thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 92 | కరీంనగర్ బుధవారం, 11 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌పై 15 లక్షల సైబర్ అటాక్స్ చేసిన పాక్..

భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ అన్ని రకాలుగా కుట్రలు చేస్తూనే ఉంది. ఓ వైపు పాకిస్తాన్ ఆర్మీ కాల్పుల విరమణకు తూట్లు పొడుస్తూ .. సరిహద్దుల వెంబడి కాల్పులకు తెగబడుతూ ఉంది. మరో వైపు పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమయాక భారతీయుల్ని పొట్టనపెట్టుకుంటూ ఉన్నారు. ఈ రెండు రకాలుగానే కాకుండా .. మూడో రకంగా కూడా భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ కుట్రలు చేస్తూనే ఉంది. ఎవ్వరూ ఊహించని విధంగా భారీ స్థాయిలో సైబర్ అటాక్స్‌కు పాల్పడుతోంది. పహల్గామ్ టెర్రర్ అటాక్ తర్వాత పాకిస్తాన్‌కు చెందిన హ్యాకర్లు దేశ వ్యాప్తంగా 15 లక్షల సైబర్ అటాక్స్ జరిపినట్లు తేలింది.




## పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్: ద్రోణుల ప్రభావంతో తెలంగాణలో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇవాళ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ, మెదక్, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డితో పాటు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. బుధవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వికారాబాద్, మహబూబ్ నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గురువారం ఉమ్మడి మహబూబ్ నగర్‌తో పాటు వికారాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.




## ఢిల్లీలోనే సీఎం రేవంత్ రెడ్డి.. ఉత్తమ్ కు కాంగ్రెస్ అధిష్టానం పిలుపు

హైదరాబాద్ : తెలంగాణలో కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు అంశం ఉత్కంఠ రేపుతోంది. మొన్న ముగ్గురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేయగా వారికి శాఖల కేటాయింపు అంశంలో ఎలాంటి క్లారిటీ రాలేదు. ఇదే విషయంలో అధిష్టానం పెద్దలతో చర్చలు జరిపేందుకు రెండు రోజులుగా ఢిల్లీలోనే సీఎం రేవంత్ రెడ్డి మకాం వేశారు. ఈ నేపథ్యంలో అనూహ్యంగా సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఢిల్లీ నుంచి పిలుపు రావడం హాట్ టాపిక్ గా మారింది. దీంతో ఆయన హుటాహుటీన ఢిల్లీకి పయనం అయ్యారు. కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు, టీపీసీసీ కార్యవర్గ కూర్పు వంటి అంశాల నేపథ్యంలో ఉత్తమ్ కుమార్ కు ఏఐసీసీ పెద్దల నుంచి పిలుపు రావడం రాష్ట్ర కాంగ్రెస్ లో ఆసక్తిని రేపుతోంది. సీఎం ఢిల్లీలో ఉండగానే పీసీసీ కార్యవర్గాన్ని అధిష్టానం ప్రకటించింది. అయితే ఉన్నపలంగా ఉత్తమ్ కుమార్ రెడ్డికి పార్టీ పెద్దల నుంచి పిలుపు రావడం వెనుక కొత్త మంత్రులకు శాఖలను కేటాయింపు అంశంపైనే చర్చిస్తారా లేక ప్రస్తుత మంత్రుల శాఖల్లో మార్పులపై చర్చించేందుకు పిలిచారా అనేది తెలియాల్సి ఉంది. ఇవేవి కాకుండా పార్టీ పరంగా ఎదైనా కీలక మార్పు ఉండబోతున్నదా అనేది సస్పెన్స్ గా మారింది. మొత్తంగా తెలంగాణ కాంగ్రెస్ లో తాజా పరిణామాలు ఉత్కంఠ రేపుతున్నాయి.



## నేడు కాళేశ్వరం కమిషన్ విచారణకు కేసీఆర్

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి భేటీ అయ్యారు. సోమవారం కాళేశ్వరం కమిషన్ విచారణకు హరీశ్ రావు హాజరైన విషయం తెలిసిందే. విచారణ తరువాత నేరుగా ఎర్రవల్లి ఫామ్‌హౌస్ కు వెళ్లిన ఆయన.. కేసీఆర్‌తో భేటీ అయ్యారు. కాళేశ్వరం కమిషన్ అడిగిన ప్రశ్నలు, విచారణ తీరుపై కేసీఆర్‌కు వివరించినట్లు తెలిసింది. వీరి భేటీ సుమారు 3గంటల పాటు సాగింది. అయితే, ఇవాళ మరోసారి హరీశ రావు ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి కేసీఆర్‌తో భేటీ అయ్యారు. కాళేశ్వరం కమిషన్ ముందుకు విచారణ నిమిత్తం రేపు (బుధవారం) కేసీఆర్ హాజరుకావాల్సి ఉంది. విచారణ సందర్భంగా కమిషన్‌కు అందించాల్సిన డాక్యుమెంట్స్ ను ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అంతేకాక.. కమిషన్ ముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చే యోచనలో కేసీఆర్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాలపై చర్చించేందుకు హరీశ్ రావు కేసీఆర్ తో మరోసారి భేటీ అయినట్లు సమాచారం.

# తొలి బోనం గోల్కొండ లోని అమ్మవారికి..

## ఆషాఢం బోనాలకు అదిరేలా ఏర్పాట్లు

### ఘనంగా నిర్వహిద్దామన్న మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్ : ఆషాఢం వస్తోంది.. బోనాల పండుగను పొరపాటు లేకుండా అద్భుతంగా నిర్వహించాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో ప్రతి ఒక్కరూ బోనాల పండుగా ప్రతిష్టాత్మకంగా తీసుకుని జరుపుకుంటారన్నారు. ఈ పండగను విజయవంతం చేయాలని కోరారు.

**28 ఆలయాల్లో బోనాల జాతర...** సమీక్ష సమావేశంలో మంత్రి సురేఖ మాట్లాడుతూ హైదరాబాద్‌లో 28 ఆలయాల్లో ఆషాఢ బోనాల జాతర జరుగుతుందన్నారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఇప్పటి నుంచి యాక్షన్ ప్లాన్ చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా, గోల్కొండ కోటలో బోనాలు సమర్పించుకోవడంతో తెలంగాణ బోనాలు మొదలవుతాయి. ఆషాఢ మాసపు మొదటి గురువారం బోనాలు ప్రారంభమవుతాయి. చివరి ఆదివారం వరకు ప్రతి రోజూ విశేష పూజలు జరుగుతాయి.

తొలుత గోల్కొండలో ప్రారంభమైన బోనాలు ముగిసిన తర్వాత వారం సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహాంకాళి అమ్మవారికి బోనం సమర్పిస్తారు. ఆ వారం సికింద్రాబాద్ అంతటా బోనాలు జరుపుకుంటారు. ఆ తర్వాతి నుంచి లాల్ దర్వాజా, ధూల్‌పేట, బల్కంపేట, పాతబస్తీ, కొత్త బస్తీ అమ్మవారి ఆలయాల్లో బోనాల జరుగుతాయి. ఆయా ఆలయాలకు ప్రముఖుల తాకిడి కూడా ఉంటుందని అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

**రూ. 20 కోట్లు కేటాయింపు...** బోనాల పండగకు బడ్జెట్ లోటు చేదని, రూ. 20 కోట్లు కేటాయిస్తున్నామని మంత్రి సురేఖ తెలిపారు. గతంలో వచ్చిన సమస్యలు పరిగణనలోకి తీసుకుని ఇప్పుడు ఎలాంటి ఏర్పాట్లు చేయాలన్నది ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. సమీక్షలో హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డీజీపీ జితేందర్, ఎండోమెంట్ డైరెక్టర్ వెంకట రావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.




### 28 ఆలయాల్లో బోనాల పండుగపొరపాట్లు లేకుండా చూడాలి

### బడ్జెట్ లోటు లేదు.. ఇప్పటికే 20 కోట్లు కేటాయింపు : అధికారులకు మంత్రి ఆదేశాలు

# 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు

# గోదావరి పుష్కరాలు!

### భారీ ఏర్పాట్ల దిశగా అధికార యంత్రాంగం అడుగులు!!




సరస్వతి నదీ పుష్కరాల సందడి ముగిసింది. త్వరలో గోదావరి పుష్కరాలు రానున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా, గోదావరి నది ప్రవహించే ప్రతి ప్రాంతంలోనూ ఈ పుష్కరాలను వైభవంగా నిర్వహిస్తారు. అయితే, గోదావరి పుష్కరాలు అనగానే అందరికీ ముందుగా గుర్తుకు వచ్చేది రాజమహేంద్రవరం. ఈ నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటి నుంచే ఏర్పాట్లపై దృష్టి సారించింది. భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తూ, పుష్కరాల నిర్వహణ కోసం ప్రణాళికలు రూపొందిస్తోంది. హిందువులు నదులను దైవ స్వరూపంగా భావించి పూజిస్తారు. ముఖ్యంగా, పుష్కరాల సమయంలో నదుల్లో స్నానం చేసి, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. భారతదేశంలోని 12 ప్రధాన పవిత్ర నదులకు ప్రతి 12 ఏళ్లకు ఒకసారి పుష్కరాలు జరుగుతాయి. బృహస్పతి ఏ రాశిలో ప్రవేశిస్తే, ఆ రాశి ఆధారంగా సంబంధిత నదులకు పుష్కర వేడుకలు నిర్వహిస్తారు. దేవగురువు బృహస్పతి సింహ రాశిలోకి ప్రవేశించినప్పుడు గోదావరి నదికి పుష్కరాలు జరుగుతాయి. ఈ సందర్భంగా, 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాలను నిర్వహించనున్నారు. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి జరిగే ఈ పుష్కరాల కోసం ఏపీ ప్రభుత్వం ఏర్పాట్లు ప్రారంభించింది.

**గోదావరి పుష్కరాల ఏర్పాట్లు...** 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల్లో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. దాదాపు 8 కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ లక్ష్యంతో, పుష్కర ఘాట్లను సిద్ధం చేసేందుకు భారీ బడ్జెట్‌తో ప్రతిపాదనలు రూపొందిస్తోంది. 2015లో రాజమండ్రిలో జరిగిన గోదావరి పుష్కరాల సమయంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని, రానున్న పుష్కరాలకు మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు ఒకే ఘాట్ వద్ద స్నానం చేయాల్సిన అవసరం లేకుండా, గోదావరి నది ఒడ్డున ఎక్కడైనా స్నానం చేయవచ్చని ప్రచారం చేయనున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పుష్కర ఘాట్ల అభివృద్ధి కోసం అధికారులు రూ. 904 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వం ముందస్తుగా రూ. 100 కోట్ల నిధులను కేటాయించింది. రైల్వే శాఖ కూడా భక్తుల సౌలభ్యం కోసం రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ. 271.43 కోట్లు మంజూరు చేసింది. దేశంలోని ప్రధాన ప్రాంతాల నుంచి రాజమండ్రికి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు, వాటి వివరాలను ముందస్తుగా ప్రకటిస్తామని అధికారులు తెలిపారు. అఖండ గోదావరి పుష్కరాలు–2027 కోసం ముసాయిదా యాక్షన్ ప్లాన్ కూడా సిద్ధమైంది. ప్రస్తుతం, ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న 17 ఘాట్లకు రోజుకు 75,11,616 మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఇరిగేషన్, టూరిజం, దేవాదాయ శాఖల అధికారులు సంయుక్తంగా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. యాత్రికుల సౌలభ్యం కోసం బస్సు ఏర్పాట్లతో పాటు, రాజమండ్రిలో గోదావరి తీరంవద్ద మరో నాలుగు కొత్త ఘాట్లను నిర్మించాలని ప్రతిపాదించారు. రాజమహేంద్రవరం పరిధిలో ఘాట్ల అభివృద్ధికి రూ. 904 కోట్లు, కార్పొరేషన్ పరిధిలో రోడ్ల అభివృద్ధికి రూ. 456.5 కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్లు, బ్రిడ్జిల అభివృద్ధికి రూ. 678.76 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మొత్తంగా, గోదావరి పుష్కర ఘాట్ల కోసం అవసరమైన నిధులపై అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. నిధుల సమీకరణతో పాటు, గోదావరి తీర ప్రాంతంలో సమగ్ర అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



# ఘనంగా బోనాల ఉత్సవాలు...

## బోనాల ఉత్సవాలు.. రూ. 20 కోట్ల కేటాయింపు..

అమరావతి : నగరంలో ప్రసిద్ధి చెందిన పండుగ బోనాల ఉత్సవాలు అని .. త్వరలో ప్రారంభం కానున్న బోనాల ఉత్సవాలపై మంగళవారం అన్ని విభాగాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. పండుగ కోసం ప్రభుత్వాన్ని రూ. 30 కోట్లు అడిగామని.. రూ. 20 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా గత ఏడాది బోనాల పండుగ జరుపుకున్నామని, ఒకటి రెండు చోట్ల ఇబ్బందులు తలెత్తాయని.. ఈ సారి ఎలాంటి సమస్యలు లేకుండా నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. వీఐపీ మూమెంట్‌లో తొక్కిసలాటలు జరుగుతున్నాయని, అవి జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

**ఘనంగా బోనాల ఉత్సవాలు..** జోగినీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని.. గతంలో జరిగిన దానికంటే ఇంకా మంచిగా బోనాల ఉత్సవాలు జరపాలని అనుకుంటున్నామని మంత్రి కొండా సురేఖ చెప్పారు. సరస్వతి పుష్కరాలు కూడా అద్భుతంగా నిర్వహించామని.. పక్క రాష్ట్రాల భక్తులు కూడా ఎంతో అభినందించారని అన్నారు. అధికారులు సమన్వయంతో ఉండి డ్యూటీ చేయాలని.. సంయమనం పాటించాలని కోరుతున్నామన్నారు. భక్తులతో దురుసుగా ప్రవర్తించకుండా మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ దర్శనం చేయించాలన్నారు. గత ఏడాది బోనాల సమయంలో పొన్నం ప్రభాకర్ వీడియో వైరల్ అయిందని.. ఈసారి ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఎవరి డ్యూటీ వారు సక్రమంగా చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు.

**మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..** 2024 యాక్షన్ ప్లాన్‌ను సరిచేసుకుని 2025లో ప్లాన్ రెడీ చేసుకోవాలని అధికారులకు సూచించారు. గత ఏడాది జరిగిన పొరపాట్లు ఈసారి జరగకుండా చూసుకోవాలన్నారు. గోల్కొండ జగదాంభిక అమ్మవారి తొలి బోనంతో బోనాల ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. గోల్కొండ జాతర, బల్కంపేట ఎల్లమ్మ తల్లి వార్షిక కల్యాణోత్సవం, లష్కర్, లాల్ దర్వాజ బోనాలు, అమ్మవారి అంబారి ఊరేగింపు, రంగం కార్యక్రమాలు అన్ని సక్రమంగా జరిగేలా యాక్షన్ ప్లాన్ రెడీ చేస్తున్నామని మంత్రి చెప్పారు. ఈసారి బోనాలకు ప్రభుత్వం రూ. 20 కోట్లు విడుదల చేసిందన్నారు. నూతన దేవాలయాలు యాడ్ అయ్యాయి కాబట్టి ఇంకో 10 శాతం ఫండ్స్ రిలీజ్ చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎండోస్మెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ చెక్కులు డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలన్నారు. డ్యూటీ లా కాకుండా ప్రతి ఒక్కరు అమ్మవారి ఆజ్ఞతో సేవ చేస్తున్నామని అనుకోవాలన్నారు. అన్ని డిపార్టుమెంట్‌లు ఎక్కడ ఇష్యూ లేకుండా చూసుకోవాలని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం జరగాలని కోరుకుంటున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు.



# హనీమూన్ హత్యకేసు.. సోనమ్ ప్లాన్ బెడిసికొట్టింది అక్కడే..!

మేఘాలయలో నవ వధూవరులు అదృశ్యమైన కేసులో కీలక విషయాలు వెలుగు చూస్తున్నాయి. వధువే పథకం ప్రకారం కిరాయి హంతకులతో భర్తను హత్య చేయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. అయితే ఆమె చేసిన ఒక్క తప్పుతో ప్లాన్ మొత్తం తారుమారు అయినట్లు తెలుస్తోంది. మధ్యప్రదేశ్‌లోని ఇండౌర్‌కు చెందిన రాజా రఘువంశీ–సోనమ్‌కు మే 11న వివాహం జరిగింది. 20న హనీమూన్ కోసం ఈ నవ దంపతులు మేఘాలయకు వెళ్లారు. అయితే వారు మొదట జమ్మూకశ్మీర్‌కు వెళ్లాలని ప్లాన్ చేసుకున్నారు. అయితే అక్కడ అప్పటికే పహల్గాం ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. దాంతో వారు మేఘాలయకు తమ హనీమూన్ ప్లాన్ మార్చుకున్నారు. అక్కడే రెండురోజుల తర్వాత వారి ఆచూకీ గల్లంతయింది. జూన్ 2న రాజా మృతదేహం దొరికింది. ఒక పదునైన ఆయుధంతో అతడి తలపై రెండుసార్లు కొట్టినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. సోనమ్ బాయ్‌ఫ్రెండ్‌గా చెప్తోన్న రాజ్ కుశ్వాహా మే 18న ఈ హత్యకు ప్రణాళిక వేశాడని ఇండౌర్ పోలీసు ఉన్నతాధికారి రాజేశ్ దండోతియా వెల్లడించారు. ఈ హత్య కోసం విశాల్ చౌహాన్, ఆనంద్ కుమార్, ఆకాశ్ రాజ్‌పుత్‌లకు రాజ్ కుశ్వాహా సుపారీ ఇచ్చాడు. మరోవైపు మేఘాలయ వెళ్లేందుకు సోనమ్ తన భర్తను ఒప్పించగలిగిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అంతా వారి ప్లాన్ ప్రకారమే జరిగింది. అయితే హత్యకు వారు ఉపయోగించిన పదునైన ఆయుధంతో అంతా తారుమారు అయినట్లు తెలుస్తోంది. “ఇలాంటి ఆయుధాన్ని సాధారణంగా మేఘాలయలో ఉపయోగించరు. దాంతో బయటివ్యక్తి ప్రమేయం ఉందని మాకు అనుమానం వచ్చింది. తర్వాత మేం కాల్ రికార్డులను పరిశీలించాం” అని పోలీసు అధికారి వెల్లడించారు. మర్డర్‌కు ముందు సుపారీ ఇచ్చిన వ్యక్తుల్లో ఒకరిని సోనమ్ కాంటాక్ట్ చేసిందని గుర్తించామన్నారు.

రాజా, సోనమ్ ఆచూకీ గల్లంతు కావడానికి ముందు ఆమె ఫోన్ లొకేషన్‌తో, నిందితుల ఫోన్ లొకేషన్ మ్యాచ్ అయినట్లు చెప్పారు. కేసు విచారణలో భాగంగా పోలీసు కస్టడీలో ఉన్న సోనమ్ సహా మిగతా నిందితులను మేఘాలయకు తీసుకెళ్తున్నారు. మరోవైపు ప్రధాన నిందితుడిగా ఉన్న కుశ్వాహా మేఘాలయకు వెళ్లకుండానే.. హత్యకు ప్లాన్ చేశాడు. ఆ సమయంలో సోనమ్‌తో టచ్‌లో ఉన్నాడని తెలిపారు. కాగా.. రఘువంశీని తాను చంపించలేదని, తననే ఎవరో అపహరించారని సోనమ్ చెప్పడం గమనార్హం. ముగ్గురు పురుషులతో ఆమె వెళ్తున్నప్పుడు చూశానని స్థానిక గైడ్ వెల్లడించడం ఈ కేసులో కీలకంగా మారిన సంగతి తెలిసిందే.



# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ

మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు.. మంగళవారం ( జూన్ 10 ) ఢిల్లీలో పర్యటిస్తున్న సీఎం రేవంత్ ను మర్యాదపూర్వకంగా కలిశారు మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ.సీఎం రేవంత్ కు బొకే ఇచ్చి, శాలువాతో సత్కరించారు. ఇటీవల వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి వచ్చిన నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలా ఉండగా.. సోమవారం ( జూన్ 9 ) ఢిల్లీలో బిజీ బిజీగా గడిపిన మంత్రి వివేక్ మల్లికార్జున ఖర్గే వంటి పలువురు పెద్దలతో భేటీ అయ్యారు.

ఈ క్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి వివేక్. తన తండ్రి కాకా వెంకటస్వామి బాటలో నడుస్తానని, ఆయన నేర్పించిన రాజకీయ విలువలు పాటిస్తూ ముందుకు వెళ్తానని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంత్రి హోదాలో సోమవారం తొలిసారి వివేక్ ఢిల్లీకి వచ్చారు. తన భార్య సరోజ, కుమారుడు, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణతో కలిసి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌ను కలిశారు. మంత్రిగా అవకాశం ఇచ్చినందుకు వాళ్లిద్దరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వంశీకృష్ణతో కలిసి వివేక్ మీడియాతో మాట్లాడారు. తనకు ఏ శాఖ అప్పగించినా, ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలా పని చేస్తానని ఆయన చెప్పారు. తనకు అప్పగించిన శాఖ ఏదన్నది చూడకుండా, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధిపై ఫోకస్ పెడతానని తెలిపారు. “శాఖల కేటాయింపు సీఎం పరిధిలో ఉంటుంది. ఆయన నాకు ఏ శాఖ కేటాయించినా సమ్మతమేనని అన్నారు.

నా తండ్రి కాకాకు గతంలో రూరల్ డెవలప్‌మెంట్ శాఖ కేటాయిస్తే.. రూ. 5 వేల కోట్ల బడ్జెట్ ఉన్న చిన్న శాఖ అని అందరూ కామెంట్ చేశారు. కానీ ఆ శాఖ బడ్జెట్‌ను రూ. 5 వేల కోట్ల నుంచి రూ. 25 వేల కోట్లకు పెంచడంలో ఆయన సక్సెస్ అయ్యారు. కార్మిక శాఖ మంత్రిగా బొగ్గు గని కార్మికులకు పెన్షన్లు ఇప్పించారు. సింగరేణి తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పుడు నాటి ప్రధాని పీవీ నరసింహారావుతో మాట్లాడి సంస్థను కాపాడారు. నేను కూడా నా తండ్రి అడుగుజాడల్లో నడిచి.. ఎంపీగా ఉన్నప్పుడు మూతపడ్డ రామగుండం ఫర్టిలైజర్ ఫ్యాక్టరీని ఓపెన్ చేయించాను. ఇందుకోసం నాటి ప్రధాని మన్మోహన్‌తో మాట్లాడి రూ. 10 వేల కోట్ల రుణమాఫీ చేయించాను. అలా అవకాశం వచ్చినప్పుడల్లా ప్రజలకు ఏం చేశామన్నదే మాకు ముఖ్యం' అని పేర్కొన్నారు.



# హరీశ్‌రావుకు హైకోర్టులో ఊరట

**హైదరాబాద్: మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావుకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై వేసిన ఎన్నికల పిటిషన్‌ను కోర్టు కొట్టి వేసింది. ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన తప్పుడు వివరాలు ఇచ్చారని గతంలో చక్రధర్ గౌడ్ అనే నేత ఈ పిటిషన్ వేశారు. విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. దాన్ని కొట్టి వేసింది.**

## ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వం అలవాటుపడింది: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్: ఆర్టీసీ బస్‌పాస్ ధరల పెంపునకు నిరసనగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో జాగృతి కార్యకర్తలు బస్‌భవన్‌ను ముట్టడించారు. పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కవితను అరెస్ట్ చేసి చంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బస్‌పాస్ ధరలు పెంచి ప్రజలపై పెనుభారం మోపిందన్నారు. “ప్రభుత్వం నిర్ణయంతో విద్యార్థులు, చిరుద్యోగులపై ఆర్థిక భారం పడుతుంది. ఈ పెంపుతో ఒక్కో ప్రయాణికుడిపై నెలకు దాదాపు రూ. 300కిపైగా భారం పడుతుందని అంచనా. ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వం అలవాటు పడింది. అనేక రూట్లలో విద్యార్థుల కోసం బస్సులు నడపడం లేదని ఫిర్యాదులున్నాయి”అని కవిత అన్నారు.



## కాంగ్రెస్‌లో పనిచేసే వారికే పదవులు: ఎమ్మెల్యే దానం నాగేందర్

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో హామీలు ఉండవని.. పనిచేసే వారికే పదవులు దక్కుతాయని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. హిమాయత్‌నగర్‌లో రూ. 60లక్షలతో రోడ్డు పనులను దానం ప్రారంభించారు.

అనంతరం ఆదర్శ్ నగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో 150 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడారు. “సామాజిక న్యాయం పాటిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ విస్తరణ చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎస్సీ, బీసీలకు ప్రాధాన్యం కల్పించారు. రాహుల్‌గాంధీ ఆశయాలను రేవంత్ ముందుకు తీసుకెళ్తున్నారు” అని దానం చెప్పారు. జీహెచ్‌ఎంసీ నుంచి



మంత్రి పదవి వస్తుందా అన్న ప్రశ్నకు ఇంకా సమయం ఉందని.. వేచి ఉండాలని సూచించారు. నూతన మంత్రులుగా బాధ్యతలు స్వీకరించినవారికి దానం అభినందనలు తెలిపారు.

## బయోసైన్స్, కృత్రిమ మేధలో పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: తెలంగాణలో షైవా గ్రూప్ భాగస్వామిగా మారిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. షైవా గ్రూప్, టారానిస్ క్యాపిటల్ కలిపి రాష్ట్రంలో రూ. 2,125 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. బయోసైన్స్, కృత్రిమ మేధలో పెట్టుబడులకు తెలంగాణ అనుకూల ప్రదేశమన్నారు. తెలంగాణ పురోగతిలో భాగస్వామ్యమయ్యేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఏడాదిన్నరలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేటు రంగంలో లక్షకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ఏడాదిన్నరలో రూ. 3లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు అవగాహన ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. ప్రభుత్వంపై నమ్మకంతో పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారన్నారు.

యువత మన ఆస్తి.. వారిలో నైపుణ్యాలు నింపేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రం అవకాశాల గని.. ఆవిష్కరణలకు, అవకాశాలకు, ప్రతిభకు కేంద్రమని పేర్కొన్నారు. అంతర్జాతీయ భాగస్వాములను రాష్ట్రం ఆకర్షిస్తోందన్నారు.

## ఓఎంసీ కేసులో పిటిషన్లపై హైకోర్టులో విచారణ



హైదరాబాద్: ఓబులాపురం మైనింగ్ కేసులో దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. గాలి జనార్దన్ రెడ్డి,, ఓబుళాపురం మైనింగ్ కంపెనీ వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్‌లపై విచారణ కొనసాగింది. నాంపల్లి సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని వీరు పిటిషన్లు వేశారు. సీబీఐ తరఫున పీపీ శ్రీనివాస్ కపాడియా వాదనలు వినిపించారు. సీబీఐ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఇతర నిందితులూ పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై విచారణను కోర్టు జూన్ 17కు వాయిదా వేసింది.



# ఆర్సీబీ విజయోత్సవాలకు ముఖ్యమంత్రే ఆహ్వానించారు!

ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా బెంగళూరులో జరిగిన తొక్కిసలాట ఇప్పుడు గవర్నర్–సీఎంల మధ్య వివాదంగా మారుతోంది. విధాన్ సౌధలో జరిగిన కార్యక్రమాన్ని తాము ఏర్పాటు చేయలేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించిన నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకొంది. గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌ను స్వయంగా ముఖ్యమంత్రే అధికారికంగా ఈ కార్యక్రమానికి ఆహ్వానించినట్లు రాజ్‌భవన్ ప్రకటించింది. తొలుత ఆర్సీబీ బృందానికి రాజ్‌భవన్‌లో ఆతిథ్యం ఇవ్వాలని భావించారు. ఈ అంశంపై గవర్నర్ కార్యాలయం రాష్ట్ర చీఫ్ సెక్రటరీని సంప్రదించి ఈ కార్యక్రమాన్ని సమన్వయపర్చాలని కోరింది. కానీ, దానికి బదులు రాష్ట్ర ప్రభుత్వమే విధాన సౌధాలో నిర్వహించాలని నిర్ణయించినట్లు సీఎస్ వెల్లడించారు. “విధాన సౌధలో నిర్వహించే ఆర్సీబీ ఆటగాళ్ల అభినందన కార్యక్రమంలో పాల్గొనాలని గవర్నర్‌ను ముఖ్యమంత్రి అధికారికంగా ఆహ్వానించారు” అని రాజ్‌భవన్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ వ్యవహారంపై కర్ణాటక ప్రభుత్వం ఆచితూచి స్పందిస్తోంది. తొక్కిసలాట చిన్నస్వామి మైదానం వద్ద చోటుచేసుకొందని.. అంతేగానీ, విధానసౌధ వద్ద కార్యక్రమం సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగలేదని చెబుతోంది. ఈ విషాదాన్ని రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షాలు వాడుకొంటున్నాయని ఆరోపించింది. “మా ప్రభుత్వం ఈ తొక్కిసలాట కేసును తీవ్రంగా పరిగణిస్తోంది” అని ఇటీవల సీఎం సిద్ధరామయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి తాను కేవలం ఆహ్వానితుడిని మాత్రమేనని, రెండు గంటలు ఆలస్యంగా తనకు తొక్కిసలాట సమాచారం అందినట్లు ముఖ్యమంత్రి పోలీసుల సస్పెన్షన్‌ను సమర్థించుకునేలా చెప్పుకొచ్చారు. ఇక విధాన సౌధలో వేడుకకు క్రికెట్ వర్గాల నుంచి ఆహ్వానం వచ్చిందని.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున కాదని పేర్కొన్నారు. తనను మైదానం వద్ద కార్యక్రమానికి ఆహ్వానించలేదన్నారు. ఆర్సీబీ కార్యక్రమానికి ముందే సిబ్బంది, పరిపాలన సంస్కరణల కార్యదర్శి జి.సత్యవతితో సహా పలువురు ఉన్నతాధికారులకు అసెంబ్లీ భద్రతను చూసే డీసీపీ ఎంఎన్ కరిబసవన గౌడ ఓ లేఖ రాశారు. అందులో 'ఆ క్రికెట్ జట్టుకు దేశవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. విధానసౌధలో కార్యక్రమం నిర్వహిస్తే.. లక్షలాది మంది అభిమానులు వచ్చే అవకాశం ఉంది. సిబ్బంది కొరత కారణంగా వారిని నియంత్రించడం కష్టం' అని ఆ లేఖలో పేర్కొన్నారు. స్టేడియంలోకి వచ్చేందుకు జారీ చేస్తున్న ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో ఎంట్రీ పాస్‌లను కూడా నిలిపివేయాలని ఆయన కోరారు. కానీ, ఆర్సీబీ కార్యక్రమం నిర్వహించడం గమనార్హం.

# భారత జలాంతర్గాముల అసమాన సేవలు

## జూన్ 11... ఐ.ఎన్.ఎస్. సింధు వీర్ భారతీయ నౌకా దళంలో చేరిన రోజు.




ఐ.ఎన్.ఎస్. సింధు వీర్ 11జూన్ 1988న నౌకా దళంలో చేరిన రోజు... 1980లలో రష్యా నుంచి ఈ కిలో–క్లాస్ సబ్‌మెరైన్‌ను భారత్ కొనుగోలు చేసింది. వైజాగ్‌లోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ఆధునికీకరించ బడింది. భారతీయ నౌకా దళం భారత సాయుధ బలగాలలో ఒక శాఖ. దేశ రాష్ట్రపతి దీనికి అధిపతిగా వ్యవహరిస్తారు. 5000 మంది నౌకా వైమానిక దళ సభ్యులు, 2000 మంది నౌకా దళ కమెండోలతో సహా యుద్ధ సన్నద్ధంగా ఉండే 55,000 మంది సభ్యులు గలిగి ప్రపంచంలో 5వ పెద్ద నౌకాదళంగా వుంది. భారత నౌకా దళం 155 నౌకల్ని కలిగి ఉంది. ఆసియాలో జెట్ యుద్ధ విమానాల్ని కలిగి ఉన్న విమాన వాహక నౌకని, నడిపే ఏకైక నావికా దళం. భారత రక్షణ వ్యవస్థలో భాగమయిన భారత నావికా దళం (ఇండియన్ నేవీ) కేవలం దేశరక్షణకే కాకుండా మానవతా సహాయాలకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు సహాయం కొరకు భారత ప్రభుత్వం నేవీని వినియోగిస్తుంది. ఇండియన్ నేవీలో 16 సబ్‌మెరైన్‌లు (జలాంతర్గాములు) ఉన్నాయి. ఇందులో ఎక్కువ రష్యా, జర్మనీలనుండి కొనుగోలు చేసినవి. ఇందులో ప్రధాన మయినవి సింధుఘోష్ తరగతికి చెందినవి. ఈ తరగతిలో మొత్తం 10 సబ్‌మెరైన్‌లు ఉన్నాయి. వీటి బరువు 3,000 టన్నులు. ప్రతి సబ్‌మెరైన్‌లో 220 కిమీ దూరంలోపు ఉన్న నౌకల పైన ప్రయోగించ గలిగే మిస్సైళ్ళు ఉన్నాయి. ఈ సబ్‌మెరైన్‌లు సముద్రంలో 300 మీటర్ల లోతువరకు వెళ్లగలగి, 18 నాట్ల వేగంతో 45 రోజుల పాటు సముద్ర ఉపరితలానికి చేరుకోకుండా ప్రయాణించ గలవు. 1985 నుండి అణు సబ్‌మెరైన్‌లను నిర్మించడానికి కల్పాక్కం వద్ద ఉన్న అణు కేంద్రంతో కలసి నేవీ కృషి చేస్తున్నది. 2010 నాటికి 6,000 టన్నులు బరువు కలిగి, పూర్తి అణు సామర్థ్యం కలిగిన సబ్‌మెరైన్‌ను, 2010–2025 నాటికి ఇలాంటివి మరో నాలుగు నిర్మించడానికి అవసరమైన చర్యలు చేపట్టడం జరిగింది. భారత నౌకాదళం లోని అన్ని యుద్ధ నౌకలకు ముందు 'ఇండియన్ నేవల్ షిప్' (ఐ.ఎన్.ఎస్), జలాంతర్గాములకు ముందు 'ఇండియన్ నేవల్ సబ్ మెరైన్ (ఐ.ఎన్.ఎస్.) ' అని చేరుస్తారు. నీటిలో మునిగి ప్రయాణం చెయ్యగల వాహనం. వివిధ దేశాల నావికా రక్షణ దళాల్లో జలాంతర్గామి ఒక ముఖ్య భాగం. జలాంతర్గామిని మొదటగా మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో విస్తృతంగా ఉపయోగించారు. జలాంతర్గాములు అనేక రకాలైన మిషన్లను చేపట్ట గలవు. యాంటీ-సర్ఫేస్ వార్‌ఫేర్, యాంటీ- సబ్‌మెరైన్ వార్‌ఫేర్, ఇంటెలిజెన్స్ సేకరణ, మైన్ లేయింగ్, తీర ప్రాంతాల్లో నిఘా తదితర మిషన్లు చేపట్టవచ్చు. భారత నౌకాదళంలో చేరిన కొన్ని జలాంతర్గాములు – వాటి తేదీల వివరాలు ఇలా ఉన్నాయి... ఐ.ఎన్.ఎస్.సింధుధ్వజ్... 12 జనవరి,1987, ఐ.ఎన్.ఎస్. షల్కి ...07 ఫిబ్రవరి 1992, ఐ.ఎన్.ఎస్. సింధుఘోష్ ...30 ఏప్రిల్ 1986, ఐ.ఎన్.ఎస్. షంకుల్ ....28 మే 1994, ఐ.ఎన్.ఎస్. సింధువీర్...11 జూన్ 1988, ఐ.ఎన్.ఎస్. సింధుశస్త్ర...19 జులై 2000, ఐ.ఎన్.ఎస్. వగ్లి ....10 ఆగష్టు 1974, ఐ.ఎన్.ఎస్. వేల ....31 ఆగష్టు 1973, ఐ.ఎన్.ఎస్. శాతవాహన... 21 డిసెంబర్1974, ఐ.ఎన్.ఎస్. షిషుమార్...22 సెప్టెంబరు1986, ఐ.ఎన్.ఎస్. సింధురాజ్ ...20 అక్టోబరు 1987, ఐ.ఎన్.ఎస్. సింధురత్న...19 నవంబరు 1988, ఐ.ఎన్.ఎస్. షంకుష్ ...20 నవంబరు1986, ఐ.ఎన్.ఎస్. సింధుకీర్తి ...09 డిసెంబరు1989, ఐ.ఎన్.ఎస్. సింధు విజయ్...17డిసెంబర్1990, ఐ.ఎన్.ఎస్.సింధు కేసరి... 19డిసెంబర్1988, ఐ.ఎన్.ఎస్.సింధు రక్షక్ ...24 డిసెంబర్1997, ఐ.ఎన్.ఎస్ విరాట్...27 సంవత్సరాల సేవ తరువాత 2016 లో ఈ నౌకను నౌకాదళం నుండి విరమింప జేసారు. 2013 లో ఐ.ఎన్.ఎస్ విక్రమాదిత్య కమిషను కాకముందు, విరాట్‌యే భారత నౌకాదళపు ఫ్లాగ్‌షిప్ నౌక. పని విరమించే ముందు వరకూ ఇది ప్రపంచం లోనే అత్యంత పాత విమాన వాహక నౌక. 1959 లో బ్రిటిష్ నౌకాదళంలో హెచ్ ఎం ఎస్ హెర్మెస్‌గా చేరిన ఈ నౌకను 1987లో భారత్ కొని, 1987 మే 12 న ఐ ఎన్ ఎస్ విరాట్‌గా పేరు పెట్టింది. ఐ.ఎన్.ఎస్వి విక్రమాదిత్య...విక్రమాదిత్య భారత్ రష్యా నుండి కొనుగోలు చేసిన విమాన వాహక నౌక. కీయెవ్ తరగతికి చెందిన అడ్మిరల్ గోర్ష్‌కోవ్ విమాన వాహక నౌకను విక్రమాదిత్యగా పునర్నిర్మించారు. ఇది 2013 లో భారతీయ నౌకాదళం లోకి ప్రవేశించింది. ఐ.ఎన్.ఎస్. విక్రాంత్ (2013)...భారత్‌లో నిర్మించిన మొదటి విమాన వాహక నౌక. 2013 లో దీన్ని నిర్మించారు. ఇది తేలిక పాటి విమాన వాహక నౌక. ఐ.ఎన్.ఎస్ చక్ర...అణు జలాంతర్గామి...ఐఎన్ఎస్ అరిహంత్ ...న్యూక్లియర్ సబ్‌మెరైన్. న్యూక్లియర్ మిస్సైల్స్‌ను ప్రయోగించే సబ్‌మెరైన్ల కోసం ఇక్కడ సముద్ర గర్భంలో అధునాతన బెర్తులు రూపుదిద్దు కుంటున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా స్వదేశీ పరిజ్ఞానంతో తొలి న్యూక్లియర్ సబ్‌మెరైన్ అరిహంత్ నిర్మాణం జరిగింది. సముద్రంపైన, భూమిపైన యుద్ధం చేయగల ఐఎన్ఎస్ జలాశ్వతో పాటు అణు ఇంధనంతో పనిచేసే సబ్‌మెరైన్ ఐఎన్ఎస్ చక్ర ఇక్కడి నుంచే సేవలు అందిస్తోంది. చైనా వద్ద 56 సబ్‌మెరైన్లు ఉండగా మన దగ్గర 14 మాత్రమే వున్నాయి. చైనా ఇప్పటికే ఐదు న్యూక్లియర్ సబ్‌మెరైన్లను సమకూర్చు కోగా మనం తొలి న్యూక్లియర్ జలాంతర్గామి (అరిహంత్) నిర్మాణంలో ఉన్నాయి. ఫ్రెంచ్ నావికాదళ రక్షణ, ఇంధన సంస్థ డీసీఎన్ఎస్ రూపొందించిన జలాంతర్గాములను భారత నేవీ ప్రాజెక్ట్ 75లో భాగంగా ముంబైలోని మజగాన్ డాక్ లిమిటెడ్ (ఎండీఎల్) నిర్మిస్తోంది. ఆరు స్కార్పీన్ క్లాస్ జలాంతర్గాముల్లోని మొదటిదైన ఐఎన్ఎస్ కల్వరిని 2017 డిసెంబర్‌లో భారత నావికాదళం లోకి ప్రవేశ పెట్టారు. ఇది డీజిల్ ఎలక్ట్రిక్ అటాక్ జలాంతర్గామి. 2017లో ప్రవేశపెట్టిన ఐఎన్ఎస్ ఖండేరి రెండవది కాగా.. మూడోది ఐఎన్ఎస్ కరంజ్ 2018 నేవీ దళంలో చేరింది. ఇక, నాల్గోది ఐఎన్ఎస్ వెలా 2019 నుంచి సేవలందిస్తుంది. ఇటీవలే దేశాల క్షిపణులు, జలాంతర్గాములు కళ్లుగప్పే స్టెల్త్ సాంకేతిక పరిజ్ఞానంతో, ప్రాజెక్ట్ 75లో భాగంగా రూపొందించిన ఐదో స్కార్పీన్ తరగతి జలాంతర్గామి ఐఎన్ఎస్ వగీర్ ముంబయిలోని మజగావ్ డాక్ వద్ద అరేబియా సముద్ర జలాల్లో జల ప్రవేశం చేసింది. ప్రస్తుతం సబ్‌మెరైన్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు చర్యలు జరుగు తున్నాయి. ఇందులో భాగంగా రాబోయే 30 సంవత్సరాలలో 24 సబ్‌మెరైన్‌లు నేవీ అమ్ముల పొదిలో చేరబోతున్నాయి. ప్రస్తుత మార్పులను బట్టి హిందూ మహాసముద్ర ప్రాంతంలోని అన్ని దేశాలలో భారత నావికా దళం అత్యంత బలమయినదిగా తయారవుతున్నదని చెప్పవచ్చు.

**రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**




రెండోసారి అధికారంలోకి వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాజాగా యూఎస్‌కు వచ్చే 12 దేశాల పౌరుల రాకపై నిషేధం విధించారు. బుధవారం దీనికి సంబంధించిన ఉత్తర్వులపై ఆయన సంతకం చేశారు. కొలరాడోలో ఇటీవల యూదులపై సీసాబాంబులతో దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలోనే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అఫ్గానిస్థాన్, ఇరాన్, యెమెన్, మయన్మార్, చాద్, కాంగో, ఈక్వెటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, లిబియా, సోమాలియా, సూడాన్ దేశాలు ఈ నిషేధ జాబితాలో ఉన్నాయి. కాగా.. బురుండి, క్యూబా, లావోస్, సియెరా లియోన్, టోగో, తుర్క్‌మెనిస్థాన్, వెనెజువెలా వంటి మరో ఏడు దేశాలపై పాక్షిక నిషేధం విధించారు. ఈ ఉత్తర్వులు సోమవారం నుంచి అమల్లోకి వస్తాయని వైట్‌హౌస్ అధికారులు తెలిపారు. 'కొలరాడోలోని బోల్డర్ కౌంటీలో ఇటీవల ఉగ్రదాడి జరిగింది. సరైన పత్రాలు లేని విదేశీ పౌరులు దేశంలో ఉండటం కారణంగానే.. మన మాతృభూమిలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. 2017లో యూరప్‌లో జరిగిన విధంగా అమెరికాలో జరగనివ్వం. సురక్షితం కానీ దేశాల నుంచి బహిరంగ వలసలను ఇక అనుమతించలేము. అందుకే ఈ రోజు యెమెన్, సోమాలియా, హైతీ, లిబియాతో సహా పలు దేశాల ప్రయాణికులపై నిషేధం విధించే ఉత్తర్వులపై సంతకం చేస్తున్నా' అని ట్రంప్ ఓ వీడియోలో పేర్కొన్నారు. కాగా.. ట్రంప్ మొదటిసారి పదవి చేపట్టిన సమయంలోనూ పలు ముస్లిం దేశాలపై నిషేధం విధించారు. 2017లో యూరప్‌లో జరిగిన ఉగ్రదాడిని గురించి ఆయన ప్రస్తావించారు.

**తక్షణ శాంతి అసాధ్యం...** ఈ ప్రకటనపై వెనిజువెలా మంత్రి డియోస్డాడో కాబెల్లో స్పందించారు. యూఎస్‌లో ఉండటం వెనిజువెలా ప్రజలకు మాత్రమే కాదు.. ఎవరికైనా ప్రమాదమే అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా తమ దేశ పౌరులు అగ్రరాజ్యంలో పర్యటించవద్దని సూచించారు. ఇక, ట్రంప్ చేసిన ఈ ప్రయాణ నిషేధానికి చట్టపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**విదేశీ విద్యార్థుల వీసాలు పరిమితం** ట్రంప్, హార్వర్డ్ విశ్వవిద్యాలయం మధ్య విభేదాలు తీవ్రతరమవుతున్నాయి. ఈక్రమంలోనే తాజాగా ట్రంప్ మరో కీలకమైన ఉత్తర్వులపై సంతకం చేశారు. ఆ యూనివర్సిటీలో చదవాలనుకునే విదేశీ విద్యార్థుల వీసాలను పరిమితం చేసే ఉత్తర్వులు అవి. అమెరికా ప్రయోజనాలకు హాని కలిగించే వారు మాకు వద్దంటూ.. హార్వర్డ్ అలాంటివారికి నిలయంగా మారిందని వ్యాఖ్యానించారు. అయితే, ఈ తాజా ఉత్తర్వులు హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి మాత్రమే వర్తిస్తోందని, దేశంలోని ఇతర సంస్థలకు కాదని యూఎస్ విదేశాంగ శాఖ పేర్కొంది.

# ప్రభుత్వ నిర్లక్ష్యంలో బాలల హక్కుల రక్షణ (భద్రత కరువైన బాల్యం)

## (జూన్ 12 ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా)

నేటి బాలలే రేపటి పౌరులు బాలలు మన జాతీయ సంపద. భవిష్యత్తుమానవవనరులు. బాలలు భవిష్యత్తు ఆర్థికవ్యవస్థలో జాతీయ ఉత్పతిని పెంచడానికి దోహదపడే ఉత్పాదక శక్తి. జాతీయాదాయ అభివృద్ధిలో బహుముఖపాత్ర పోషించే బాలలు భవిష్యత్ దేదాభివృద్ధికి దశ దిశను నిర్ణయించే శక్తి అనడ%శీ%లో అతిశయోక్తి లేదు. ఆడుతూ పాడుతూ హాయిగా జీవితం గడిపే బాల్యదశ పలు సమస్యలకు నిలయమైంది. బాలల హక్కులు స్వేచ్ఛను హరించే బాల కార్మిక వ్యవస్థ దురాచారాన్ని రుపుమాపడానికి 2002 నుండి ఐ'రా'స ' యూనిసెఫ్ ' ఐ'ఎల్'ఓ సంయుక్తంగా 12 జూన్ ప్రపంచ బా కార్మిక వ్యవస్థ వ్యతిరేకదినోత్సవాన్ని పాటిస్తారు. ఐ'రా'స రూపొందించినసుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో బాగంగా2025 నాటికి బాల కార్మిక వ్యవస్థను అంతం చెయ్యాలని లక్ష్యంగా నిర్ణయించారు. 2023 నినాద%శీ% ప్రపంచ బాల కార్మిక వ్యతరేక దినం నినాదం " వీక్ ఆఫ్ ఆక్షన్ అగనేస్ట్ చైల్డ్ లేబర్" బాల కార్మిక వ్యవస్థను అంతం చెయ్యాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగింది.

**ప్రపంచీకరణ బిబాల కార్మిక వ్యవస్థ...** ప్రపంచీకరణ' కార్పోటీకరణ ' ప్రైవేటీకరణ 'సాంకేతిక ప్రగతి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లో చోటు చేసుకున్న పరిణామాలుప్రభుత్వరంగంలో మార్పులు ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు ఉపసంహరణ బాలకార్మిక సమస్య ఉధ్రుతికి ఆజ్యం పోశాయి.

**బాలకార్మిక వ్యవస్థబి విశ్వవ్యాప్తం...** బాలకార్మిక వ్యవస్థ విశ్వ వ్యాప్తమైంది. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న సామాజిక' ఆర్థిక సమస్యల్లో బాల కార్మిక వ్యవస్థ ప్రధానమైంది . శాస్త్ర సాంకేతిక రంగాల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్న21వ శతాబ్దంలో కూడా ఈ సమస్య ఇంకా పరిష్కారానికి నోచుకోలేదు. అమలుకు నోచుకోని చట్టాలు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకై చట్టాలున్నప్పటికీ అమలుకు నోచు కోకపోవడం వల్ల బాల కార్మికుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది . బాలల హక్కులను కాల రాస్తున్న ప్రభుత్వాలకుఐక్యరాజ్యసమితి హెచ్చరికలు ఆదేశాలు జారీచేస్తూ బాలకార్మిక వ్యవస్థనిర్మూలన కొరకు "యునెస్కో"అంతర్జాతీయ సమాజం కృషి చేసినప్పటికి పూర్తి స్థాయిలో ఆశించిన ఫలితాలు రావడంలేదు.

లిబాల కార్మికుల నిర్వచనంలి 5 యేళ్ల నుండి15ఏళ్ళలోపు పిల్లలను బాలకార్మికులుగాపరిగణిస్తారు. కొన్నిదేశాల్లో17నుండి18ఏళ్ల లోపు పిల్లలను బాల కార్మికులుగా భావిస్తారు . ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 21కోట్ల మంది బాల కార్మికులు ఉన్నారని ఐక్య రాజ్య సమితి అంచనా వేసింది . పిల్లలు ఎవరైనా బాల కార్మికులుగా ఉన్నారంటే వారిజీవన భద్రతకు ప్రాథమిక హక్కులకు భంగం కలిగినట్లు భావించాలి.

**బాలకార్మికులుబి అసంఘటిత రంగం...** బాల కార్మికులు పరిశ్రమలు " తయారీ 'మైనింగ్ ' బాణాసంచా తయారీ ఫ్యాక్టరీలలో 'హొటళ్ళలో నిర్మాణరంగం'సేవారంగాలలో" బిక్షాటనలో ప్రైవేట్ అసంఘటిత రంగంలో బాల కార్మికులుఎక్కువ సంఖ్యలో అల్ప వేతనాలనకు పని చేస్తున్నారు. బాలకార్మికులుబి శ్రమ దోపిడిలి ప్రైవేట్ యాజమాన్యాల బాలకార్మికుల శ్రమ దోపిడి చేస్తున్నాయి.శ్రామిక దోపిడీకి తమ అమూల్యమైన బాల్యం బలౌతుంది. బాల కార్మిక వ్యవస్థకు కారణాలులి బాలకార్మిక వ్యవస్థకు కారణాలు ఆర్థికవ్యవస్థలో పేరుకు పోయిన 'పేదరికం' నిరుద్యోగం' నిరక్షరాస్యత చట్టాల పైపరిజ్ఞానం లేకపోవడంవల్లబాలకార్మికులు పెరిగిపోతున్నారు. కనీసావసరాలు లేక దారిద్ర్యరేఖ కింద జీవిస్తున్న పేదలు 'బడుగు' బలహీన వర్గాల ప్రజలకు అల్ప ఆదాయాలు 'అల్పకొనుగోలు శక్తి వల్ల అనేక కుటుంబాలు తమ పిల్లలను బడిలో కాకుండా పనుల్లో చేర్చుతున్నారని పలు అధ్యయనాలు తెలుపు తున్నాయి.

**ప్రపంచంబి కఠిన పేదరికం...** ప్రపంచంలో పావు శాతం జనాభా కఠిన దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. ఆఫ్రికా " 'లాటిన్ 'అమెరికా లో పేదరికం కారణంగా పిల్లలు కార్మికులుగా మారాల్సిన దుస్థితి నెలకొన్నది. కొన్ని దేశాలలో పిల్లలు విద్య అభ్యసించేందుకు సౌకర్యాలులేవు .

**ఉచిత విద్యబి మిథ్యే అయ్యింది...** రాజ్యాంగంలో పేర్కొన్న "ఉచితవిద్య"అందని ద్రాక్ష ఐయింది .ప్రభుత్వం విద్యారంగం నుండి తప్పుకొని ప్రైవేట్ 'కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించడం వల్లపేదవర్గాలకు"విద్యమిథ్యే" గామారింది. కార్పొరేట్ విద్యా ఖరీదు కావడంవల్ల పేదవర్గాల బాలలు చదువుకు దూరమై కార్మికులుగా పనిచేస్తున్నారు.

దేశంలో నెలకొన్న సామాజిక'ఆర్థిక రాజకీయ'సామాజిక' సాంస్కృతిక పరిస్థితులు ప్రభుత్వాలు అవలంబిస్తున్న అశాస్త్రీయ సమగ్ర విద్యా పాలన విధానాలు నిర్లక్ష్యం ఉదాసీనత 'బాలల విద్యకు ఆటంకంగా పరిణమించాయి. ఇంకా కొంత మంది పిల్లలు వంశ పారంపర్యంగా వస్తున్న పనుల్లో(కులవృతుల్లో) వృత్తుల్లో పని చేస్తున్నారు.

**కరోనా బిబాలకార్మికులు...** కరొనాప్రభావం కరొనా ప్రభావం కారణంగా చాలా మంది బాల కార్మికులు జీతంలేని పనులు చేస్తున్నారు అని "ఐ ఎల్ ఓ" తెలిపింది. కరోనా వల్ల ప్రత్యక్షంగా పరోక్షంగ పేదకుటుంభాల బాలల మీద ప్రభావం పడింది. కోవిడ్ 19 వల్ల ఆర్థిక వ్యవస్థ కుదేలు కావడం వల్ల బాల కార్మిక వ్యవస్థ పైగత 20 సంవత్సరాలలో సాధించిన పురోగతి వెనుకకు నెట్టి వేయబడిందని పేదరికంలోకి జారుకున్న వారి సంఖ్య 4 కోట్ల నుండి 6 కోట్లకు పెరిగింది .ఒక్క శాతం పేదరికం పెరిగితే 0.7 శాతం బాల కార్మికులు పెరుగుతారని యూనిసెఫ్ అధ్యయనంలో తేలింది ".

**ప్రమాద కరమైన పనుల్లోబి బాలకార్మికులు...** ఐ ఎల్ ఓ "అంచనాలప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 15.2 కోట్ల మంది బాలకార్మికులు ఉండగా అందులో 7.2 కోట్ల పిల్లలు ప్రమాదకరమైన పనుల్లోపనిచేస్తున్నారు .బాలకార్మిక వ్యవస్థపై ఉన్న నిషేధాన్ని ఎత్తి వేయాలనే వాదన బలపడుతుంది. ఫలితంగా ప్రపంచ దేశాలు బాలకార్మిక వ్యతిరేక చట్టాలను నీరుగార్చే ప్రమాదం పొంచివుందనే హెచ్చరికలుచోటుచేసుకోవడం శోచనీయం. ఈసమయంలో మనం సరైన నిర్ణయం తీసుకోకపోతే ఓతరాన్ని కోల్పోయే ప్రమాదం వుంది. 2000 నుండి 2016 మధ్య ప్రపంచ వ్యాప్తంగా బాలకార్మికుల సంఖ్య38 శాతం తగ్గింది. బాలకార్మికులు జీవితాలు సమస్యల వలయంగా మారాయి. అనేక ఇబ్బందులు పడుతున్నారు కనీసం ప్రాథమికవిద్య'వైద్యానికి నోచుకోవడంలేదు. పోషకాహార లోపం వల్లశారీరక ఎదుగుదల సరిగా ఉండడంలేదు. అనేక మానసిక ఆరోగ్యసమస్యలను ఎదురుకొంటున్నారు.

**ఎక్కువ పని గంటలు...** తక్కువవేతనాలులిలిప్రైవేట్ యాజమాన్యాలు బాల కార్మికులతో ఎక్కువగా పని చేయిస్తున్నాయి . బాలకార్మికులు తక్కువ వేతనాలు ఎక్కువపని గంటలతో అనారోగ్య పరిస్థితుల్లో పనిచేస్తూ శ్రమదోపిడీకిగురవుతున్నారు. సామర్థ్యానికిమించి పనులు చేయిస్తున్నారు.

**బాల కార్మికులుబి లైంగికదాడి...** ప్రమాదకర పరిస్థితుల్లో సైతం పనిచేస్తూ. బాలకార్మికులు భౌతిక 'లైంగిక దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి.

**భవిష్యత్తు అంధకారం...** భవిష్యత్తు అంధకారం బాల కార్మికులుఅద్భుత మైన జీవితం గడిపేందుకు అవకాశాలు తక్కువ ఉన్నాయి. వీరికి సరైన విద్య 'వైద్యం అందుబాటులో లేకపోవడం వల్ల ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి .పోటీతత్వము రాజ్యమేలుతున్న సమాజంలో బాలలు అన్నిరకాలుగా వెనకబడి పడిపోతున్నారు .తగిన విద్యార్హతలు 'నైపుణ్యాలు లేక పోవడం వల్ల పెద్దవారైనాక సరైన ఉపాధి దొరకనిస్థితి నెలకొన్నది .

**వ్యభిచారం' డ్రగ్స్ మాఫీయా ఉచ్చులో బాల కార్మికులు...** పలువురు బాలకార్మికులు ఎక్కువ పనిగంటలు తక్కువ వేతనాలు పొందుతూ శ్రమ దోపిడీకి గురి అవుతున్నారు. అక్రమ రవాణా 'వేశ్యావృతి 'డ్రగ్ మాఫియాకు బలవుతున్నారు. నేరాలకు పాలుపడే వైఖరి(నేర ప్రవృత్తి )పెరిగి హింసాత్మక ఘటనలకు పాలుపడే ప్రమాదం వుంది. ఫలితంగా వారి బంగారు భవిష్యత్తు అంధకారంగ మారుతుందని పలుసర్వేలువెల్లడిస్తున్నాయి . ఉపాధిఉద్యోగ మార్గాలు వెతుక్కునేందుకు సరైనమార్గదర్శనం లేకపోవడం ఆర్థిక తోడుపాటు లేకపోవడం నైపుణ్య లేమి వంటి కారణాల వల్ల బాలలు కార్మికులుగా మారుతున్నారు. ఇందుకు ప్రభుత్వం చట్టాలు సమాజం సంక్షేమ పథకాల అమలులో సమన్వయము లోపించడంగొప్ప లోపం .

బాలకార్మిక వ్యవస్థనిర్మూలన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బహుముఖ చర్యలు చేపట్టాలి. దేశంసంపదైన బాలలు బాల కార్మికవ్యవస్థలో మగ్గిపోతే దేశ భవిష్యత్తు అందకరమౌతుంది. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కార్మిక. చట్టాలను కఠినంగ అమలు చేసి సమూలంగా నిర్మూలించాలి . బాలలకు తగిన విద్య శిక్షణ అందించి విలువైన నిపుణతగల మానవ వనరులుగా తీర్చిదిద్దాలి. ఉపాధి హామీ పథకం 'సాంకేతిక నైపుణ్య అభివృద్ధి 'సహకార సంఘాలు సాంఘిక భద్రత పథకాల అమలు చెయ్యాలి . ఇటీవల భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం కరోనా వల్ల తల్లితండ్రులనుకోల్పోయిన బాలలకు ప్రత్యేక పథకం ప్రవేశపెట్టడం హర్షణీయం . బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకొరకు ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు సామాజిక సంస్థలు సమిష్టిగా కలిసి ఉద్యమించాలి . బాలకార్మిక వ్యవస్థనిర్మూలనకొరకుప్రవేశపెట్టిన చట్టాలు అమలు చేయాలి. బాలలతోపని చేయించుకునే యజమానులకు కఠిన శిక్ష విధించాలి .బాలలందరికి విద్య అందించేందుకు కృషి చేయాలి. బాలకార్మిక వ్యవస్థ కారణమైన సామాజిక ఆర్థిక సాంఘిక వ్యవస్థలో గుణాత్మక మార్పు తీసుకొనిరావడం ద్వారా మాత్రమే బాలకార్మికవ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుంది పిల్లలను బడిలోచేర్పించి నంత మాత్రాన ఈసమస్య పరిష్కారంకాదు. వారి తల్లిదండ్రులు ఆర్థికంగా ఎదగడానికి అవకాశాలు కల్పించాలి. తల్లితండ్రులకు "కౌన్సెలింగ్ కేంద్రాలను" ప్రారంభించాలి. "కమ్యూనిటీ కౌన్సిలింగ్ "వ్యవస్థను సమర్థవంతంగా అమలు చెయ్యాలి. బాలకార్మికులు కొరకు ప్రతేక పాఠశాలలు నెలకొల్పాలి . బాలకు పౌష్టిక ఆహారం అందించాలి . పాఠశాల విద్య ఉచిత బోజన వసతి ఏర్పాటు చెయ్యాలి . తల్లితండ్రుల సంరక్షణ లేని అనాధబాలల కొరకు ప్రత్యేక రక్షణ సంరక్షణ సౌకర్యాలు వసతి కలిపించాలి. ప్రపంచ దేశాలలో ఉన్న బాల కార్మికుల సంఖ్యలో మనభారత్ దేశం ముందు వరుసలో ఉంది. మన దేశంలో దాదాపు కోటి వరకు బాల కార్మికులు ఉన్నట్లుఅంచనా. ఈ వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. కఠినచట్టాలు అమలు చేస్తున్నాయి .అయినప్పటికీ బాలకార్మిక వ్యవస్థ ను నిర్మూలించేలేక పోతున్నాము. ప్రభుత్వం జాతీయ బాలకార్మిక ప్రాజెక్టును అమలుచేస్తుంది ఇందులో భాగంగా పనుల్లో మగ్గుతున్న బాలలను గుర్తించి వారికి అవాసం కలిపించి విద్యను అందిస్తున్నారు .ప్రస్తుతం అమలు చేస్తున్న విద్యాహక్కు చట్టం సత్ఫలితాలు ఇస్తుంది. బాలలు బైట వుండరాదు ప్రతిఒక్కరికీనిర్బంధ ప్రాథమికవిద్యనుఅందించాలని ఈ చట్టం నిర్దేశిస్తుంది .బాలకార్మిక నిషేధచట్టంప్రకారం14యేళ్లలోపు పిల్లలను పనుల్లో పెట్టుకోకూడదు . దీనిని అతిక్రమించిన వారిమీద చట్టబద్ధ చర్ర్యలు తీసుకుంటారు .జైలుశిక్ష తో పాటు జరిమానావిధిస్తారు.

**యునెస్కో కృషి...** అంతర్జాతీయ బాలల హక్కుల కోసం కృషి చేస్తున్న యునెస్కో వివిధ దేశాలలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చట్టాలు రూపొందించి 15 యేళ్ల లోపు పిల్లలనుఎక్కడ పనుల్లో చేర్చకోరాదని 18 యేళ్ల లోపువారినికఠినమైనపనులకు ఉపయోగించరాదు అని నిబంధనలు సభ్య దేశాలప్రభుత్వాలుఅమలు చెయ్యాలని ఆదేశించడం గమనార్హం. బాలకార్మికవ్యవస్థకు సంబంధించి ఏఒక్క నిబంధననునీరు కార్చ కూడదని" ఐ ఎల్ ఓ"కుచెందిన "బెంజ్ మెన్ స్మిత్" అంటాడు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చట్టాల రూపకల్పన ప్రాథమిక విద్యను అందించడంలో యునెస్కో క్రియాశీలక పాత్ర పోషిస్తుంది. 2025నాటికి బాలకార్మిక. వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని సుస్థిరాబివృద్ధి లక్ష్యాలల్లో నిర్దేశించారు ఈదిశగా ప్రపంచదేశాలు కృషిచెయ్యాలని బాలలహక్కుల రక్షణ పర్యవేక్షణకు పనిచేస్తున్న పలు సంస్థలు ప్రభుత్వాలకు సూచించడం గమనార్హం బాలలను హింస 'దోపిడీ దుర్వినియోగం నుండి రక్షించాలి బాలలసంక్షేమమే లక్ష్యంగా బాలల బంగారు భవిష్యత్తు కు దీర్ఘకాలిక అభివృధి వ్యూహంతో బాల కార్మిక రహిత భారత్ నిర్మాణానికి పాటు పడటం ప్రభుత్వం కృషి చెయ్యాలి బాలల బంగారు భవిష్యత్తకుతగిన వాతావరణాన్ని సృష్టించడం సామాజంయొక్కగురుతర బాధ్యత . బాలల్ని శారీరక మానసిక సాంఘిక మానవీయ కోణంలో ఎదిగేలా పటిష్ట చర్యలు చేపట్టాలి. నేటి బాలలు రేపటి పౌరులు అన్నది నినాదం కాకుండా ప్రభుత్వాల విధానం కావాలి. బాల కార్మిక రహిత సమాజ స్థాపనకు ప్రభుత్వాలు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక లను అమలు చెయ్యాలి.



**నేదునూరి కనకయ్య**
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
9440245771
కరీంనగర్

చురకలు

## సంపాదకీయం

# 11ఏళ్ళ పాలనకు మోడీ మాస్టార్ వేసిన మార్కులు

కేంద్రంలో బీజేపీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం జూన్ 9వ తేదీతో 11 ఏళ్ళ పాటు కొనసాగినట్లు అయింది. ఇంకా చేతిలో మరో నాలుగేళ్ళ అధికారం ఉంది. ఇక బీజేపీ లాంటి పార్టీకి ఇది ఒక గ్రేట్ అచీవ్మెంట్ అని చెప్పాల్సిందే. బీజేపీ 1996 మే 15న అధికారంలోకి వచ్చి కేవలం 13 రోజులు మాత్రమే పాలన చేసింది. అలా 13 రోజున నుంచి 11 ఏళ్ళ దాకా ఎదగడం అంటే కమలం పార్టీ సాధించిన అతి పెద్ద విజయంగా చూడాలి. అంతే కాదు హ్యాట్రిక్ విజయాన్ని బీజేపీ సొంతం చేసుకుంది. వరుసగా మూడు సార్లు బీజేపీ కేంద్రంలో పవర్ లోకి వస్తే మోడీ మూడు సార్లూ ప్రధానిగా ఉన్నారు. ఇక 2024లో మూడోసారి గెలిచిన తరువాత జూన్ 9న మోడీ ప్రభుత్వం ప్రమాణం చేసింది. దాంతో ఈ రోజు బీజేపీకి వెరీ స్పెషల్ ఈ సందర్భంగా ప్రధాని హెూదాలో మోడీ వేసిన ట్వీట్ ఇపుడు వైరల్ గా మారింది. 11 ఏళ్ళ బీజేపీ పాలనకు మోడీ మాస్టార్ నూరు మార్కులూ వేశారు. పైగా గర్వించే పాలన అన్నారు. ఈ 11 ఏళ్ళలో దేశంలో విప్లవాత్మకమైన మార్పులు ఎన్నో వచ్చాయని ఆయన చెప్పుకొచ్చారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అన్నది బీజేపీ విధానమైంది అన్నారు. అంతే కాదు బీజేపీ పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందని గుర్తు చేశారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యంగా పనిచేస్తోంది అని కూడా చెప్పారు. బీజేపీది సుపరిపాలన అభివృద్ధి మంత్రం అని ఆయన అభివర్ణించారు. సామాజిక అభ్యున్నతి వైపుగా పాలనను తీసుకెళ్ళామని ఆయన గుర్తు చేసుకున్నారు. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే సర్కార్ తీసుకుని వచ్చిన ఉజ్వల అలాగే, ప్రధానమంత్రి ఆవాస్, ఆయుష్మాన్ భారత్ అలాగే భారతీయ జనౌషధి ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ఇలా ఏ పథకం అయినా పేదల కోసమే రూపొందించామని ఆయన స్పష్టం చేశారు. ఈ పథకాలు అన్నీ జన జీవితాలలో సమూలమైన మర్పులు తీసుకుని వచ్చాయని అన్నారు. అంతే కాదు సగటు ప్రజానీకం జీవన ప్రయాణాన్ని సులభతరం చేసాయని అన్నారు. జీవితంలో అన్నీ అందుబాటులోకి రావడం ద్వారా జీవన సౌలభ్యాన్ని పెంచాయని చెప్పారు. ఇక దేశంలో వచ్చిన మార్పులు అనేకం అని మోడీ చెప్పారు. అందులో నమో యాప్ అన్నది ఒకటి అన్నారు. అంతే కాదు ఈ యాప్ ద్వారా ఇంటరాక్టివ్ గేమ్‌లు, క్విజ్‌లు, సర్వేలు, సమాచారం ఇలా ఎన్నో అందించడం జరిగిందని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఎంచుకున్న మార్గం సక్రమమే అని ఈ 11 ఏళ్ళ పాలన రుజువు చేసిందని అన్నారు. ఒకటి సుపరిపాలన మరొకటి జన జీవితంలో పరివర్తన ఇలా ఈ రెండు లక్ష్యాలను చేరుకున్నామని మోడీ పేర్కొన్నారు. ఇదంతా కేవలం ఎన్డీయే సర్కార్ కి సాధ్యమైంది అంటే కనుక కానే కాదని దాని వెనక 140 కోట్ల మంది ప్రజానీకం ఆశీస్సులు నిండుగా మెండుగా ఉన్నాయని మోడీ చెప్పారు. అలాగే భారతీయుల ప్రోత్సాహం ఉత్సాహం ఉందని అన్నారు. అందుకే భారతదేశం విభిన్నమైన రంగాలలో అనేక సమూలమైన మార్పులను ఈ దశాబ్దానికి పైగా సాగిన కాలంలో చూసిందని ఆయన విశ్లేషించారు. ఇదిలా ఉంటే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి పదకొండేళ్ళు పూర్తయిన సందర్భంగా వికసిత్ భారత్‌కా అమృత్ కాల్ అన్న పేరుతో ఒక భారీ ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇక మోడీ సైతం తన ప్రభుత్వంలో మంచిని చెబుతూ సానుకూల దృపథమే తమ ప్రభుత్వాన్ని ఇన్నేళ్ళూ ఒక స్ఫూర్తిగా నిలిచి నడిపించింది అని అన్నారు. ఇది కచ్చితంగా బీజేపీ విజయం. అంతే కాదు మోడీ విజయం. అలాగే భాగస్వాములైన ఎన్డీయే మిత్రుల విజయం కూడా. మరో నాలుగేళ్ళ పాలనతో మోడీ 15 ఏళ్ళ పాటు నిరాటంకంగా పాలించిన ప్రధానిగా నెహ్రూ తరువాత స్థానంలోకి రాబోతున్నారు. ఇలా అనేక రికార్డులను ఆయన తొందరలోనే బద్దలు కొట్టబోతున్నారు అని కమలనాధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# “వ్యవసాయ సంబంధిత పర్వం ఏరువాక” - జ్యేష్ఠ పూర్ణిమ సందర్భంగా




భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, భాషలు, ధర్మాలు, ప్రజలకు కేంద్రస్థానమై, అఖండ మరియు అవిభాజ్యమైన సంస్కృతికి మూలాధారమైన భారతావని, ప్రాచీన కాలం నుండి, వ్యవసాయ ప్రధాన దేశం కావడం గ్రామీణులలో, అధిక సంఖ్యాకులు రైతులే కావడం, ఎడ్లు మరియు నాగళ్ళతో విడదీయరాని బంధం, అనుబంధం ఏర్పరుచు కోవడాలు మనదేశానికి ప్రత్యేకం. కొన్ని పంచాంగాలలో, జ్యేష్ఠ పూర్ణిమకు వృషభ పూజా, హల ప్రవాహ: మొదలైన పేర్లు పేర్కొన బడుతున్నాయి. ఎద్దులను పూజించడం, నాగలి సాగించడం, ఆనాటి విధి కృత్యాలని చెప్పబడు తున్నాయి. సురవరం ప్రతాపరెడ్డి పేర్కొన్న ప్రకారం “ఆంధ్ర దీపికా నిఘంటువు”ను బట్టి “ఏరు” అనగా “సర్వ అవయవములు గల నాగలికి, ఎడ్లను పూనినది” అని అర్థం. “ఏరు వాక” అంటే “ఎద్దులను కట్టి దున్నుటకు సిద్ధపరచిన నాగలి” అని అని శబ్ద రత్నాకర నిఘంటువు స్పష్టం చేస్తున్నది. “ఏరువాక” అంటే దున్నుటకు ఆరంభం అని అర్థం. అనగా దుక్కి యొక్క ప్రారంభం. ఏరువాక వర్షరుతువు ఆరంభ దశలో రైతులు ఆచరించే పండుగగా భావించ బడుతున్నది. కర్షకులకు ఎద్దులే జీవిత సర్వస్వం, వాని పూజ కృతజ్ఞతా సూచకము, ప్రశంసనీయము. కనుక వ్యవసాయ దారులకు జేష్ఠ పౌర్ణమి ప్రధానమైన పండుగగా కనిపిస్తుంది. వర్షాలు కురిసి, భూమి పదును అయినచో, పునర్వసు కార్తెలో పునాస విత్తనాలు వేయడం పరిపాటి. పునర్వసు నుండి “పునాస” పదం ఏర్పడినట్లు చెబుతారు. పునర్వసు కార్తెలో పునాస విత్తనాలు వేయడం సనాతన సంప్రదాయం. జ్యేష్ఠ పూర్ణిమను “ఏరువాక పూర్ణిమ” అంటారు. ఈనాడు ఎద్దులకు మై కడిగి, కొమ్ములకు రంగులు వేసి, గజ్జలు, గంటలు, అద్దాలు, కుచ్చులు మెడకు కట్టి, అలంకరించే ఆచారం అనాదిగా ఆచరణలో ఉంది. పొద్దున్నే పొంగలి (పులగం) చేసి ఎద్దులకు పెట్టి, వాటిని వేసే గాడికి, దూప దీప నివేదన మొనర్చి, తమ జీవిత సర్వస్వాలు అయిన ఎద్దులకు, కృతజ్ఞత తెలుపుకునే వేడుకే “వృషభోత్సవం”. దీని గురించి “అనడుత్సవం” పేరుతో అధర్వణ వేదములో వివరించ బడింది. కన్నడిగులు “కారుణి పబ్బం” అంటారు. ఏరువాక పౌర్ణమిని “వృషభ యజ్ఞం” అంటారు. ఏరువాక పండుగ భారతావనిలో అతి ప్రాచీనమైంది. విజయనగర సామ్రాజ్య చక్రవర్తి కృష్ణదేవరాయ సార్వభౌముడు రైతన్నల కృషిని అభినందించి తగిన రీతిలో రైతు సోదరులను ప్రోత్సహించినట్లు పురాణాలు చెబుతున్నాయి. అలాగే శుద్ధోదన మహారాజు ఆనాడు కపిలవస్తులో లాంఛనంగా ఈ ఏరువాకను ప్రారంభిస్తూ.. ఒక బంగారు రంగు నాగలిని కర్షకులకు అందించినట్లు గాథలున్నాయి. జైమినీయ ‘‘న్యాయ మాలా” గ్రంథమందు “హలాధికరణం”లో, ఈ పండుగ గురించి పేర్కొన బడింది. ఔత్తరాహికులు వృషభ యజ్ఞం, జేష్ఠ పౌర్ణమి నాడు చేయడం ఆచారమై ఉంది. దీని విధి నిషేధికము శ్రౌత సూత్రమున ఉంది. ఇది తొలుత హల కర్మము. అంకురారోపణం అనే విప్రుల కర్మ సంబంధంగా పరాశర, బోధనాది గృహ్య సూత్రములలో పేర్కొన బడింది. వ్యవసాయం బ్రాహ్మణులు చేయుట మానిన తర్వాత, అమంత్రకంగా ఆచరించడం ప్రారంభమైనదిగా భావించ బడుతున్నది. ఇందుకు సంబంధించి, ఏరువాక, నాగలి గురించి జానపద గేయాలు, పాటలు, సినీ సాహిత్యంలో ప్రత్యేక ప్రస్తావన అంశాలుగా ఉన్నాయి. పారస్కరుడు తన గృహ సూత్రాలలో... హల కర్మకు “జేష్ఠ, అని స్వాతి” నక్షత్రాలు మంచివని పేర్కొన్నాడు. ఈనాడు ఓషధీపతి అయిన చంద్రుడు, హల కర్మకు మంచి నక్షత్రమైన జేష్ఠకు, దగ్గరగా ఉంటాడు. వ్యవసాయ దారులు ఈ రోజున ఎవరికీ అప్పులు ఇవ్వరు. డబ్బులు పెట్టి ఏమి కొనరు. కావలసిన వస్తు సామగ్రి మందు రోజునే తెచ్చి పెట్టుకుంటారు. ఏరువాక సాగిన నాడు నిప్పు కూడా పెట్టరు. ఇంట్లోని వస్తువులు బయటికి తీసుకెళ్లరు. “ఎద్దు లేని సేద్యం సద్ది లేని పయనం, ఎడ్లు, వడ్లు ఉన్నవాడిదే వ్యవసాయం... ఎక్కువ వెల పెట్టి గుడ్డను తక్కువ వెల పెట్టి గొడ్డును కొనకూడదు... కర్ర మన్ను అయితే కాపు బతుకుతాడు. దుక్కి గల భూమి దిక్కు గల మనుష్యుడు చెడడు”.ఇలాంటి సామెతలు వల్ల ఎద్దుల, దుక్కి ప్రాముఖ్యం స్పష్టం అవుతున్నది. “బండలు పగిలే భరణి కార్తె ఎండలు వెనకబడి, మృగశిర కార్తెతో ముంగిళ్ళు చల్లబడతాయి”. ఆ పైన ఆరుద్ర వాన... అదనపు వాన. ఇది వ్యవసాయానికి అనువైన కాలం. “రోహిణిలో విత్తనాలు చల్లితే, రోళ్ళు నిండని అల్పపు పంట” అని రైతులకు అనుభవ పునరుక్త అంశం.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**


# నాట్యావధాని ధారా రామనాథశాస్త్రి - జూన్ 11...ధారా రామనాథశాస్త్రి జయంతి

నటన, మేకప్, రచన అన్ని తానే సమన్వయ పరుచుకొని, మేళవించుకొని అప్పటికప్పుడు పృచ్ఛకుల కోరిక మేరకు ప్రదర్శించాలన్న ఆలోచనకు ప్రతి రూపమే ఈ కొత్త కళా ప్రక్రియ నాట్యావధానము. నాట్యావధాన ప్రక్రియను రంగస్థలం మీద ప్రవేశ పెట్టినది ధారా రామనాథ శాస్త్రి. సాహిత్యములో అష్టావదానాలు, శతావధానాలు, నేత్రావధానాల గురించి వింటూనేఉంటాం. సాహితి సభలు సమావేశాలలో కవి పండితుల అష్టావధానాలను, శతావధానాలను చూసి సాహితి అభిమానులు కవిత్వాలలోని రసజ్ఞతను అనుభవిస్తునే వుంటారు. సాధారణముగా నాట్యావధానము అనగానే ఇదేదో నాట్యానికి సంబంధించినదిగా అనుకుంటారు కానీ నాట్యానికి నాట్యావధానికి సంబంధము లేదు. ఈ ప్రక్రియ నాటక రంగానికి సంబంధించింది కావడం విశేషం. నాటకములో సంభాషణలను ఒక రచయిత రాస్తాడు. ఒక దర్శకుడు నటులకు ఎలా నటించాలో చెపుతాడు. పాత్రకు తగ్గట్టుగా మేకప్ మన్ మేకప్ చేస్తాడు. నటులు నటిస్తారు. రంగస్థలము మీద నాటక ప్రదర్శన సమిష్టిగా జరుగుతుంది. కానీ నాట్యావధానములో రచయిత, దర్శకుడు, మేకప్ మన్, నటుడు అన్నీ ఒకరే. అవసరాన్ని బట్టి మరో పాత్ర ఉంటుంది. నాట్యావధానములో నాట్యావధానికి కొంతమంది పృచ్ఛకులు ఒక నాటకీయ సన్నివేశాన్ని ప్రశ్నగా ఇస్తారు. ఉదాహరణకు గురజాడ కన్యాశుల్కము లోని గిరీశం, చిలకమర్తి వారి గణపతి కలిస్తే ఇద్దరి మధ్య సంభాషణలు ఎలా ఉంటాయి అని అడిగినపుడు... నాట్యావధాని అయన సహాయకుడు, గిరీశమూ, గణపతి పాత్రలకు మేకప్ చేసుకొని పాత్రల ఔచిత్యము దెబ్బతినకుండా అంటే గిరీశం టక్కరితనం, గణపతి తిండిపోతు తనం, అమాయకత్వం కొట్టవచ్చినట్లు ప్రేక్షకులముందు సన్నివేశాన్ని ప్రదర్శిస్తారు. అలాగే అప్పటి కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, నేటి వచన కవికి తారసపడ్డప్పుడు వారి మధ్య సంభాషణ ఎలా ఉంటుంది. ఈ విధమైన సమస్యలను అవి పౌరాణికాలయినా, చరిత్రనుంచి అయినా, సమకాలీన జీవితమూ నుండి అయినా, సన్నివేశానికి తగ్గట్టుగా మేకప్ చేసుకొని రంగస్థలము మీద అప్పటి కప్పుడు కూర్చుకొన్న సంబాషణలతో రక్తి కట్టిస్తారు. ఈ రకమైన ప్రక్రియ అంతకు ముందు తెలుగు నాటక రంగములో లేదు దీని సృష్టికర్త ధారా రామనాధ శాస్త్రి. అయన మాటల్లోనే చెప్పాలంటే ఇటువంటి కొత్త కళను ప్రారంభించాలని అనుకోలేదు. కానీ విద్యార్థి దశలో ఉన్నప్పుడు అరవై సంవత్సరాల క్రితం మద్రాసు బీచ్ లో కూర్చుని ఉండగా ఆయనకు వచ్చిన ఆలోచన. ధారా రామనాథశాస్త్రి (జూన్ 11, 1932 - ఆగస్టు 7, 2016) నాట్యావధానిగా సుప్రసిద్ధులు. అయన సంప్రదాయక వైదిక కుటుంబంలో 1932, జూన్ 11న ఒంగోలులో సత్యవతమ్మ, వెంకటేశ్వర శాస్త్రి దంపతులకు జన్మించారు. ఆయన తాత ధారా వెంకట సుబ్బయ్య, తండ్రి వెంకటేశ్వరశాస్త్రి ఇరువురూ నాటకాలలో వేషాలు వేసినవారే. చిన్నప్పటి నుండే నాటకాలు, బుర్రకథలు చూసి ప్రభావితు లయ్యారు. చీరాల, తెనాలిలలో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. 1947-49 మధ్యకాలంలో గుంటూరు హిందూ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువు కున్నారు. తరువాత బి.ఏ. చదివారు. మద్రాసు యూనివర్శిటీలో ఎం.ఏ. పూర్తి చేశారు. 1953లో ఒంగోలు లోని సి.ఎస్.ఆర్.శర్మ కాలేజీలో అధ్యాపకులుగా చేరి 1995 జూన్ నెల వరకు పని చేశారు. ఈ నాలుగు దశాబ్దాలలో ఎందరో శిష్యులను తయారు చేశారు. 1970లో ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి కె.వి.ఆర్.నరసింహం పర్యవేక్షణలో తెలుగులో కృష్ణకథ అనే అంశం మీద పరిశోధించి పి.హెచ్.డి సాధించారు. నటుల కుటుంబంలో నుండి వచ్చిన వారు కాబట్టి నటన ఆయనకు కొత్తకాదు. ఆయన తాత గారు ధారా వెంకట సుబ్బయ్య... టంగుటూరి ప్రకాశము పంతులుతో నాటకాలు వేశారు. సంబంధిత ప్రస్తావన మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి రచించిన నటరత్నాలు అనే గ్రంధములో ఉంది. ఒకసారి ప్రకాశము పంతులు హిరణ్య కశిపుని గాను, ధారా వెంకట సుబ్బయ్య నరసింహ స్వామిగా నాటకములో నటిస్తున్నారట. నటనలో పూర్తిగా లీనమైన ధారా వెంకట సుబ్బయ్య, హిరణ్య కశిపుని పాత్రధారి ప్రకాశముపై లంఘిస్తే ప్రాణాలు కాపాడు కోవటానికి ప్రకాశం స్టేజి మీదనుంచి క్రిందకు దూకి పరిగెత్తి బావిలో దూకారట. అంతగా పాత్రలో లీనమై నటించే నటుడు ధారా వెంకట సుబ్బయ్య. ఆయన తండ్రి ధారా వెంకటేశ్వర శాస్త్రి. ప్రముఖ రంగస్థల, సినిమా నటుడు సి.ఎస్. ఆర్ తో కలిసి నాటకాలు వేసేవారు. నాట్యావధానము అనే నూతన ప్రక్రియను వేంకట సుబ్బయ్యనే ప్రారంభించారు. పృచ్ఛకులు సాంఘిక, చారిత్మిక, ఆధ్యాత్మిక, పౌరాణిక అంశాలలో ఏదైనా ఒక సన్నివేశం చెబితే అప్పటికప్పుడు పది నిమిషాలలో ఆ సన్నివేశానికి తగిన ఆహార్యంతో పాత్రోచితంగా నటించడం ఈ అవధానంలో భాగం. అంటే నాట్యావధాని నటుడు, రచయిత, దర్శకుడు, మేకప్ మన్ ఈ నలుగురి పని ఒక్కడే చేయ గలగాలి. నటన, సాహిత్య సంపద, ఆశు ధోరణితో పాటు ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేయ గలగాలి. ఈ నాట్యావధానాన్ని మొదట 1953లో ఒంగోలులో ప్రారంభించి సుమారు 500కు పైగా ప్రదర్శన లిచ్చి ఎందరో ప్రముఖులను మెప్పించ గలిగారు. ఆయన నాట్యావధానాన్ని ప్రశంసించిన వారిలో పుట్టపర్తి సత్యసాయి బాబా, కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి, పండిట్ రవిశంకర్, ఎ.ఎస్.రామన్, హరీంద్రనాథ్ చటోపాధ్యాయ, పృథ్వీరాజ్



కపూర్, బలరాజ్ సహానీ, దివంగత భారత రాష్ట్రపతి వి.వి.గిరి, దివంగత ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు మొదలైన అనేకులు ఉన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారి ప్రతిభా పురస్కారం, బళ్ళారి రాఘవ అవార్డు, అనంత లక్ష్మీకాంత సాహితీ పురస్కారం, రామరాజ భూషణ సాహిత్య పరిషత్ పురస్కారం, పల్లె పూర్ణప్రజ్ఞాచార్యుల సాహితీ పురస్కారం, పెద్దిబొట్ల బ్రహ్మయ్య స్మారక సాహితీ పురస్కారం, అ.జో.వి.భో. ప్రతిభా మూర్తి జీవితకాల సాధన పురస్కారం, విజయవాడలో కనకాభిషేకం, సనాతన ధర్మ ట్రస్ట్ వారి ప్రతిభా పురస్కారం పొందారు. నాట్యావధాన విధాత బిరుదాంకితులు అయినారు. నాట్యావధాన కళాస్రష్ట, బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రముఖ సాహిత్యవేత్త డాక్టర్ ధారా రామనాధ శాస్త్రి 85వ ఏట ఆగస్టు 7, 2016లో కన్నుమూశారు. **రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

# అసమాన వ్యంగ్య చిత్ర కారుడు అబూ అబ్రహాం - జూన్ 11... అబూ అబ్రహాం జయంతి



రాజకీయ కార్టూనులు వేస్తూ, ప్రముఖ వార్తా పత్రికలలో పనిచేస్తూ, అదే వృత్తిగా ఎంచుకుని, స్వతంత్రంగా, నిర్భీతిగా పని చేసిన వ్యంగ్య చిత్రకారులు అతి కొద్దిమంది మాత్రమే ఉన్నారు. అందులో అబూ అబ్రహం ముఖ్యులు. ఒక కార్టూనులో ఒక పాత్రను ప్రవేశపెట్టి, ఆ పాత్రబొమ్మను అదేవిధంగా దశాబ్దాల పాటు వేయగల శక్తి ఉన్న అతి కొద్దిమంది కార్టూనిస్టులలో అబూ ఒకరు. 150 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రముఖ అబ్జర్వర్ పత్రికకు అబూనే మొట్ట మొదటి రాజకీయ వ్యంగ్య చిత్రకారుడు కావడం విశేషం. సామాన్యంగా ఇంట గెలిచి రచ్చ గెలవడం కాకుండా, అబూ అబ్రహం బయటి దేశాలలో పేరు ప్రఖ్యాతులు సంపాదించి, భారత్ కు తిరిగి రావటం జరిగింది. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందని తన మూడవ ఏట నుండే బొమ్మలు గీయటం మొదలు పెట్టారు. చదువుకునే రోజులలో తమ గురువుల బొమ్మలు కూడా వేసే వారట. అత్తుపురథు మాథ్యూ అబ్రహామ్ (11 జూన్ 1924 %-% 1 డిసెంబర్ 2002), అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రఖ్యాత భారతీయ వ్యంగ్య చిత్రకారుడు, పాత్రికేయుడు, రచయిత. ఆయన కలం పేరు అబూ. ఆయన హేతువాది, నాస్తికుడు. అబూ తన 40 యేళ్ల సుదీర్ఘ వృత్తి జీవితంలో అనేక జాతీయ, అంతర్జాతీయ వార్తా పత్రికలలో పనిచేశారు. “బాంబే క్రానికల్”, “శంకర్స్ వీక్లీ”, “బ్లిట్జ్”, ‘‘ట్రిబ్యూన్”, “ది అబ్జర్వర్”, “ది గార్డియన్”, “ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్” తదితర పత్రికలలో పని చేసి గుర్తింపు పొందారు. అబూ కేరళ రాష్ట్రంలోని మవేలికర గ్రామంలో ఎ.ఎం.మాథ్యూ, కాంతమ్మ దంపతులకు జన్మించారు. తన మూడవ యేటి నుండే బొమ్మలు గీయడం మొదలు పెట్టారు. తిరువనంత పురం యూనివర్సిటీ కాలేజీలో ఫ్రెంచి, గణితం, ఇంగ్లీషు ఐచ్ఛికాంశాలుగా 1945లో డిగ్రీ పూర్తి చేశారు. ఇతడు విద్యార్థి దశలో టెన్నీస్ ఛాంపియన్‌గా ఉండేవారు. చదువు ముగిసిన వెంటనే అబూ బొంబాయి వెళ్లి “బాంబే క్రానికల్” పత్రికలోను, దాని సోదర పత్రిక “ది బాంబే సెంటినెల్”లోను జర్నలిస్ట్‌గా చేరారు. “బ్లిట్జ్”, “భారత్” పత్రికలలో కార్టూన్లు గీయడం మొదలు పెట్టారు. 1951లో ప్రముఖ కార్టూనిస్ట్ కె.శంకర్ పిళ్ళై అబూను తన “శంకర్స్ వీక్లీ”లో పనిచేయ వలసిందిగా ఢిల్లీకి ఆహ్వానించారు. 1953లో లండన్‌లోని “ది స్టార్” పత్రిక సంపాదకుడు ఫ్రెడ్ జోస్ ఇతడిని లండన్‌కు రావలసినదిగా ప్రోత్సహించారు. ఆయన తన 32వ యేట లండన్‌లో అడుగు పెట్టారు. లండన్ చేరిన వెంటనే అబూ పంచ్, డైలీ స్కెచ్, ఎవెరీబడీస్ లండన్ ఒపినియన్, ఈస్టర్న్ వరల్డ్ మొదలైన పత్రికలకు అబ్రహాం అనే కలం పేరుతో కార్టూన్లు వేయడం ఆరంభించారు. 1956లో ట్రిబ్యూన్ పత్రికలో ప్రచురింపబడ్డ ఇతని రెండు కార్టూన్లను చూసి ప్రపంచంలో అతి పురాతనమైన ఆదివారం వార్తాపత్రిక “ది అబ్జర్వర్” సంపాదకుడు డేవిడ్ ఏస్టర్ ఆయనకు తన పత్రికలో రాజకీయ కార్టూనిస్టుగా స్థిరమైన ఉద్యోగాన్ని ఇచ్చారు. ఆయన సలహాపై అబ్రహాం అనే కలం పేరును తన చిన్ననాటి ముద్దుపేరు “అబూ”గా మార్చుకున్నారు. అబూ బ్రిటిష్ సంస్కృతిలో మునిగి పోయి వాడి, వేడి రాజకీయ కార్టూన్లను గీశారు. ది గార్డియన్ పత్రిక అబును “త్రికరణ శుద్ధిగా వామపక్ష భావ జాలాన్ని నమ్మి ప్రభుత్వానికి పక్కలో బల్లెంలా తయారైనాడని’’ అభివర్ణించింది. 1962లో శాతం క్యూబాలో చేగువేరా చిత్రాన్ని గీశారు. 1966 సెప్టెంబరులో అబూ ది గార్డియన్ పత్రికలో చేరారు. ట్రిబ్యూన్ పత్రికకు వారం వారం కార్టూన్లను వేశారు. 1968లో వియత్నాం యుద్ధంపై వెలువడిన “వర్డిక్ట్స్ ఆఫ్ వియత్నాం” అనే కార్టూన్ల సంకలనానికి సంపాదకత్వం వహించారు. అబూ 1969లో భారత దేశానికి తిరిగి వచ్చారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో 1981 వరకు రాజకీయ కార్టూనిస్టుగా పనిచేశారు. 1970లో ఆయన తీసిన షార్ట్ ఫిలిం నో ఆర్బ్స్ కు బ్రిటిష్ ఫిలిం ఇన్స్టిట్యూట్ ప్రత్యేక అవార్డును ఇచ్చింది. 1972-78ల మధ్య ఇతడు రాజ్యసభలో నామినేటెడ్ సభ్యుడిగా ఉన్నారు. 1975లో భారత అత్యవసర స్థితి విధించినపుడు పత్రికా స్వేచ్ఛను రద్దు చేశారు. అబూ ఈ చర్యతో ఇందిరా గాంధీ పై ఉన్న అభిమానాన్ని కోల్పోయారు. పత్రికా రంగంలో పని చేసే వారు కొంత మంది, ఎమర్జెన్సీ రోజులలో వంగమంటే, నేలన పడి పాకారని ఒక అపప్రధ ఉన్నది. అటువంటి చెడ్డపేరు, అబూ అబ్రహంకు గాని ఆయన పని చేసిన ఇండియన్ ఎక్స్ప్రెస్సుకు గాని రాలేదు. ఆయన ధైర్యంగా ఉండి తన కార్టూన్లను తాను వేస్తూ, సెన్సార్ అధికారులకు అందకుండా, చాలా తెలివిగా కార్టూన్లు గీసి నెగ్గుకు వచ్చారు. ధైర్యం, నిబద్ధత ఉంటే ఎంతటి నియంత అయినా ఏమీ చెయ్యలేదని నిరూపించారు. 1977లో ఎమర్జెన్సీ సమయంలో ప్రచురించ లేక పోయిన రాజకీయ కార్టూన్లు, వ్యాసాలతో “గేమ్స్ ఆఫ్ ఎమర్జెన్సీ” అనే పుస్తకాన్ని విడుదల చేశారు. ఇంకా ఇతడు “అబూ ఆన్ బాంగ్లాదేశ్”, “ప్రైవేట్ వ్యూ”, “అరైవల్స్ అండ్ డిపార్చర్స్” అనే కార్టూన్ పుస్తకాలను ప్రకటించారు. 1988లో వెలువడిన పెంగ్విన్ బుక్ ఆఫ్ ఇండియన్ కార్టూన్స్‌కు సంపాదకుడిగా ఉన్నారు. 1981 నుండి అబూ ఫ్రీలాన్సర్‌గా వివిధ వార్తా పత్రికలకు కార్టూన్లు గీయడం ప్రారంభించారు. “సాల్ట్ అండ్ పెప్పర్” అనే స్ట్రిప్ కార్టూన్ వేయనారంభించారు. ఎంతో మందిని తన భావ యుక్తమైన కార్టూన్లతో కదిలించిన, ఈ ప్రముఖ వ్యంగ్య చిత్రకారుడు, 2002 సంవత్సరం డిసెంబరు 1 వ తేదీ మరణించారు. ఆయన మరణానికి సంతాప సూచకంగా రాజ్యసభ రెండు నిమిషాల మౌనం పాటించింది. అబూ అంత్య క్రియలను ప్రభుత్వ లాంచనాలతో ఘనంగా నిర్వహించారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

# ‘శిక్షణ’ వరం.. ఉపాధికి ఊతం

వికారాబాద్ : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ వరంగా మారింది. ఏదో ఒక పరిశ్రమలో ఉపాధి పొందేందుకు ఈ శిక్షణ దోహదపడుతుంది. లేదంటే సొంతంగా ఏర్పాటు చేసుకొని పలువురికి ఉపాధి చూపొచ్చు. జిల్లాలో వికారాబాద్, తాండూరు, మర్పల్లిలో ప్రభుత్వ ఐటీఐలున్నాయి. తాండూరు, వికారాబాద్‌లో ప్రైవేటువీ కొనసాగుతున్నాయి. ఇవే కాకుండా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ) ఏర్పాటుకు భవనాలు నిర్మిస్తున్నారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తే ఐటీఐలో సీటు కేటాయిస్తారు.

**90 శాతం హాజరు తప్పనిసరి..**

ఐటీఐలో శిక్షణ పొందే విద్యార్థులు తప్పనిసరిగా 90 శాతం హాజరు ఉండాల్సిందే. విద్యార్థులతోపాటు శిక్షకులు, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నారు. జిల్లాలోని వికారాబాద్, మర్పల్లి, తాండూరులో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. మూడు ప్రాంతాల్లో దాదాపు భవన నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఈ కేంద్రాలను ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రాంభించొచ్చని అంటున్నారు.



**అందిస్తున్న కోర్సులు..**

వికారాబాద్, మర్పల్లి ఐటీఐలలో ఫిట్టర్, కోబా, దుస్తుల తయారీ, వెల్డర్, టర్నర్, మోటారు మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఎలక్ట్రీషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ రెండు కేంద్రాల్లో కలిపి సుమారు 400 సీట్లు ఉన్నాయి.

**సద్వినియోగం చేసుకోవాలి..**

ఐటీఐ శిక్షణ పొందిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువే. ప్రతి పరిశ్రమలో వారి అవసరముంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
ఆర్.నరేందర్‌బాబు, ప్రిన్సిపల్, ఐటీఐ, వికారాబాద్.

**26 వరకు దరఖాస్తులకు అవకాశం..**

ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మొదటి విడత ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశముంది. 2025-26 విద్యాసంవత్సరం, రెండేళ్ల కోర్సుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. 10, 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఐటీఐ.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను తెరిచి అందులో వివరాలను నమోదు చేసుకోవాలి. అన్ని నిజ ధ్రువపత్రాలను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో ఉంచాలి. ఇతర సమాచారం కోసం 9177472488, 8555865421 నంబర్లలో సంప్రదించాలని అధికారులు తెలిపారు.

# విద్యుత్తు పాశాలు

జగిత్యాల :మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లోని ఓ వీధిలో నివాసముంటున్న పాంద్రవీసం లక్ష్మి ఇంటిపై చేతికందే ఎత్తులో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా కొంత మేర సరిచేసినా లాభం లేకుండా పోయింది. ఇంటిపైకి చిన్న పిల్లలను వెళ్లనివ్వడం లేదని, పెద్దలు ఎవరూ వెళ్లినా ముందుగానే హెచ్చరించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో వెల్లుల్ల వైపు వెళ్లే ప్రధాన రహదారిలో సుతారి నవీన్ ఇంటిని తాకుతూ విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. తీగలను పక్కకు జరిపేందుకు అయ్యే ఖర్చులు భరించాలని విద్యుత్తు అధికారులు చెబుతున్నారని కుటుంబసభ్యులు వాపోయారు. జగిత్యాల గ్రామీణ మండలం గుల్లపేటలో పోచమ్మ ఆలయం వద్ద విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. ఇప్పటికే పశువులకు ప్రమాదాలు జరిగాయి. నియంత్రిక చుట్టూ రక్షణ చర్యలు చేపట్టలేదు. విద్యుత్తు నియంత్రికను మార్చాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటంలేదని స్థానికులు వాపోయారు. జిల్లాలో ఒక్క బండ లింగాపూర్‌లోనే కాదు గ్రామాలు, పట్టణాల్లోనూ విద్యుత్తు తీగలు, స్తంభాలు, నియంత్రికలు ప్రమాదకరంగా ఉన్నాయి. నివాస సముదాయాలు, వ్యవసాయ పొలాల్లో వంగిన స్తంభాలు, చేతికందే ఎత్తులో వేలాడుతున్న తీగలు, రక్షణ లేని



నియంత్రికలు ఉన్నా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు చేపట్టడం లేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలో 321,776 గృహ కనెక్షన్లు ఉండగా 1,33,880 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. గ్రామాలు, పట్టణాల్లో ఫిర్యాదులు వచ్చినప్పుడు సరి చేస్తున్నా పొలాల్లో మాత్రం పట్టించుకోవటంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
వర్షాకాలంలో విద్యుత్తు ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. వ్యవసాయ పొలాల్లో వంగిన స్తంభాలు, వేలాడుతున్న తీగలు ట్రాక్టర్లు, ఇతర వాహనాలకు తాకి ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. ఇన్సులెటర్లు దెబ్బతిని విద్యుత్తు సరఫరాఅయి ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. గాలికి స్తంభాలు వంగిపోయి కిందపడిపోయే అవకాశం ఉంది. వేలాడుతున్న తీగలు, దెబ్బతిన్న ఇన్సులెటర్లను మార్చాల్సిన అవసరం ఉంది. లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు ప్రతి లైన్‌ను సరిచేయాల్సిన అవసరం ఉంది. శాఖలో సిబ్బంది కొరతతో ఉన్న వారితోనే వెళ్లతీస్తున్నారు. చాలా సార్లు ఫిర్యాదులు చేసిన వారి సమస్యలు పరిష్కరిస్తుండగా వాటిని అలాగే వదిలేస్తున్నారు.

**ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తాం: సాలియా నాయక్, ఎస్ఈ**

జిల్లాలో ఫిర్యాదులు వచ్చిన వాటిని వెంటనే పరిశీలన చేసి సరిచేస్తున్నాం. స్తంభాలు, తీగలు, నియంత్రికలు ప్రమాదకరంగా ఉన్న చోట సరి చేయాలని సిబ్బంది, అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. కాల్ సెంటర్‌కు, అధికారులకు ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తాం. వ్యవసాయ పొలాల్లో పరిశీలించి సరిచేయిస్తాం.

# కొలువై.. మనసులు తోడై



హైదరాబాద్ : బెంగళూరులో పనిచేసే నలుగురు ఉద్యోగులకు హైదరాబాద్‌కు బదిలీ అయింది. కంపెనీ దగ్గరలో వసతి కోసం వెతకగా బ్యాచిలర్లు కావడంతో యజమానులు నిరాకరించారు. దగ్గరలో ఉండేందుకు అనువైన వసతిగృహం దొరక్క అపార్ట్‌మెంట్‌లో అద్దెకుంటున్నారు. ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు వేర్వేరుగా వ్యక్తిగత గదుల్లో ఉంటున్నారు. వంట, ఇతర పనులు కలిసి చేసుకుంటున్నారు. ఇలాంటి సంస్కృతి నగరంలోనూ విస్తరిస్తోంది.

**యువత ఆసక్తి..**

భాగ్యనగరంలో కో-లివింగ్ కల్చర్ విపరీతంగా పెరుగుతోంది. ముంబయి, దిల్లీ, బెంగళూరుకే పరిమితమైన ఈ హాస్టళ్లు హైదరాబాద్‌లోనూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కో-లివింగ్ అంటే.. మహిళలు, పురుషులు కలిసి ఒకే ప్రదేశంలో ఉండటం. హైదరాబాద్.. ప్రముఖ ఐటీ హబ్ కావడంతో యువ ఉద్యోగులు, విద్యార్థులు, స్టార్టప్ సంస్థల సిబ్బంది ఇతర నగరాల నుంచి పెద్దసంఖ్యలో వస్తున్నారు. వారు ఈ సంస్కృతికి ఆసక్తి చూపిస్తున్నారు.

**వ్యక్తిగత బెడ్‌రూం, కలిసి జీవనం..**

ఇందులో ఉండేవారు.. వ్యక్తిగత బెడ్‌రూమ్‌లు కలిగి ఉంటారు. కిచెన్, లివింగ్ రూమ్, ఇతర సోషల్ స్పేస్‌ని ఇతరులతో పంచుకుంటారు. ఇవి పూర్తిగా ఫర్నిష్డ్‌గా.. వై-ఫై, హౌస్‌కీపింగ్, భద్రత, జిమ్, కో-వర్కింగ్ స్పేస్‌లు, కమ్యూనిటీ ఈవెంట్‌లు వంటి సౌకర్యాలతో ఉంటాయి. షేర్డ్‌స్పేస్‌లు, కమ్యూనిటీ ఈవెంట్‌లు.. ఒంటరితనాన్ని తగ్గించి, సామాజిక వాతావరణాన్ని పెంపొందిస్తాయని, ఒకేరంగంలో పనిచేసే వ్యక్తులను ఒకచోట చేర్చుతాయని నిర్వాహకులు చెబుతున్నారు.

**రూ.6వేల నుంచి మొదలు**

మాదాపూర్, హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేటతోపాటు కేపీహెచ్‌బీ, అమీర్‌పేటల్లోనూ ఈ హాస్టళ్లు వెలుస్తున్నాయి. ఒకరికి నెలకు రూ.6వేల నుంచి ఫీజు మొదలవుతుంది. వారం, ఒకరోజు కూడా ఉండే సౌకర్యం ఉంది. ఆయా హాస్టళ్లలో అమ్మాయి, అబ్బాయి కలిసి ఒక రూమ్ షేర్ చేసుకోవచ్చు. వీటిల్లో సీసీ కెమెరాల నిఘా, ప్రీమియమ్, లగ్జరీ హోటళ్లలో మాదిరిగా సౌకర్యాలు కల్పిస్తున్నారు.

**ఆధునిక జీవనశైలి..**

ఆధునిక యువత సాధారణ ఇంట్లో కంటే.. ఫ్లెక్సీబుల్, సామాజిక, టెక్-సేవీ జీవన శైలిని ఇష్టపడుతున్నారు. అలాంటి సౌకర్యాలు ఈ కో-లివింగ్ హాస్టళ్లు అందిస్తుండడంతో ఆసక్తి కనబరుస్తున్నారు. అంకుర సంస్థల ఉద్యోగులు, ఫ్రీలాన్సర్లు హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నారు. వారికి ఫ్లెక్సీబుల్ లీజ్ ఒప్పందాలు, కో-వర్కింగ్ స్పేస్‌లు, నెట్‌వర్కింగ్ అవకాశాలు ఈ కో-లివింగ్ హాస్టళ్ల ద్వారా సులభతరం అవుతుంది.

**ఇన్‌ఫ్లూయెన్సర్లతో ప్రచారం**

సోషల్ మీడియాలో అత్యధిక మంది ఫాలోవర్లు కలిగిన ఇన్‌ఫ్లూయెన్సర్లతో కో-లివింగ్ హాస్టల్ నిర్వాహకులు ప్రచారం కల్పిస్తున్నారు. వీరి ద్వారా ఎక్కువ మందికి ఈ సమాచారం చేరుతుందని భావిస్తున్నారు.

# అద్దెవి.. వద్దే వద్దు



బొంరాస్‌పేట : గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వసతి, దూరాభారం కష్టాలు తీరనున్నాయి. అరకొర వసతుల మధ్య అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటికి ప్రభుత్వం పరిష్కారం చూపింది. సొంత భవనాలు మంజూరు చేసింది. కొడంగల్ నియోజకవర్గంలోని మూడు బీసీ గురుకులాలకు సొంత భవనాల నిర్మాణానికి రూ.73.40 కోట్లు వచ్చాయి. పనులు చకచకా సాగుతున్నాయి.

**గోకాఫస్లాబాద్‌లో చకచకా పనులు..**

దౌల్తాబాద్ మండలం గోకాఫస్లాబాద్‌కు మంజూరైన బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రస్తుతం కొడంగల్‌లో కొనసాగుతోంది. సొంత భవనం కోసం రూ.25 కోట్లు మంజూరయ్యాయి. పనులు చకచకా సాగుతున్నాయి. అయిదెకరాల విస్తీర్ణంలో మూడంతస్తుల్లో భవనాలను నిర్మిస్తున్నారు.

**జిల్లాలో 27 గురుకులాలు**

జిల్లాలో వివిధ సొసైటీల ఆధ్వర్యంలో 27 గురుకులాలు కొనసాగుతున్నాయి. వాటిలో కొన్నింటికి సొంత భవనాలుండగా మరికొన్ని అద్దె వాటిలో దూరంగా ఉన్న పట్టణాల్లో నడుస్తున్నాయి. వాటికీ నిధులు మంజూరు చేసి సొంత భవనాలు నిర్మిస్తే విద్యార్థులకు వసతి సౌకర్యాలు కలగడంతోపాటు తల్లిదండ్రులకు ప్రయాణ కష్టాలు దూరమవుతాయి.
బీసీ గురుకులాలు 9 ఉన్నాయి. వాటిలో కెరెల్లి బాలికల గురుకుల పాఠశాల 60 కి.మీ. దూరంలోని రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో కొనసాగుతోంది.
బషీరాబాద్ బాలికల గురుకుల పాఠశాల తాండూరు పట్టణంలో కొనసాగుతోంది.
సాంఘిక సంక్షేమ గురుకులాలు 8 ఉన్నాయి. బంట్వారం బాలికల గురుకుల పాఠశాల 60 కి.మీ. దూరంలోని చేవెళ్లలో, మోమిన్‌పేట బాలికల గురుకుల పాఠశాల 20 కి.మీ. దూరంలోని బూర్గుపల్లిలో కొనసాగుతున్నాయి.

**బురాన్‌పూర్‌కు రూ.25 కోట్లు మంజూరు..**

బొంరాస్‌పేట మండలం బురాన్‌పూర్‌కు మంజూరైన బీసీ బాలికల గురుకుల పాఠశాలకు స్థానికంగా భవనాల్లేక చేవెళ్లలో నడుపుతున్నారు. పిల్లలను చూసిరావడానికి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 70 కి.మీ. దూరం వెళ్లి రావాలంటే పేదవారికి ఆర్థికంగా భారమవుతోంది. ప్రస్తుతం బురాన్‌పూర్‌లో సొంత భవనానికి రూ.25 కోట్లు మంజూరయ్యాయి. మూడెకరాల్లో జీ ప్లస్ టు భవనం నిర్మిస్తున్నారు. పునాదుల దశ దాటింది. అకాడమిక్ బ్లాక్, డార్మెటరీ, ఉపాధ్యాయుల నివాస సముదాయం ఉంటాయి.

**కొడంగల్‌లో పదెకరాల విస్తీర్ణంలో..**

కొడంగల్ బీసీ బాలుర గురుకుల పాఠశాలకు పట్టణం సమీపంలో సొంత భవనం ఉంది. సరైన సౌకర్యాల్లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయులకు గృహ సముదాయం లేదు. దీంతో కొత్త భవనం నిర్మాణానికి రూ.23.40 కోట్లు మంజూరయ్యాయి. పదెకరాల విస్తీర్ణంలో భవనాలు నిర్మిస్తున్నారు.

**వచ్చే ఏడాదికల్లా అందుబాటులోకి..**

కొడంగల్ నియోజకవర్గంలోని మూడు గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం రూ.73.40 కోట్లు మంజూరు చేసింది. పనులు వేగంగా కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది ఆగస్టు నాటికి వాటిని పూర్తి చేస్తాం.శ్రీనివాస్, ఏఈ, విద్యామౌలిక వసతుల అభివృద్ధి సంస్థ.

# మహమ్మారిపై ముందస్తు సన్నద్ధత

గోదావరిఖని : దేశంలో కరోనా వ్యాప్తి నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ముందస్తు ఏర్పాట్లు, మహమ్మారి విజృంభిస్తే త్వరితగతిన వైద్యసేవలు అందించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లోని వసతుల వివరాలు సేకరిస్తున్నారు. కరోనా నిర్ధారణ పరీక్షలు(ఆర్టీపీసీఆర్), టీకాలు అందుబాటులో ఉన్నాయా?.. ఐసోలేషన్ వార్డుల ఏర్పాటుపై ఆరా తీస్తున్నారు. ప్రధానంగా ఆక్సిజన్, వెంటిలేటర్లు, నెబ్యులైజర్ సదుపాయాలు, గతంలో కరోనా చికిత్సలో ప్రత్యేక శిక్షణ పొందిన వైద్యులు, నర్సింగ్, అంబులెన్స్ సిబ్బంది వివరాలు తెలుసుకుంటున్నారు.

**ఆస్పత్రుల్లో వసతుల వివరాల సేకరణ**గతంలో కరోనా విజృంభించిన సమయంలో గోదావరిఖనిలో ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేశారు. మొదట సుల్తానాబాద్‌లోని టీబీ ఆసుపత్రిలో ఏర్పాటు చేయగా.. కేసుల సంఖ్య పెరగటంతో ఖని ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేశారు. పడకలు సరిపోక ప్రైవేటు కళాశాలల భవనాల్లో వార్డులు అందుబాటులోకి తెచ్చారు. కరోనా నిర్ధారణలో కీలకమైన ఆర్టీపీసీఆర్ కేంద్రాన్ని గోదావరిఖని ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆయా ఆసుపత్రుల్లోని వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, కరోనా నివారణ చికిత్స పొందినవారి వివరాలు, నెబ్యులైజర్లు, ఆక్సిజన్ సిలిండర్లు, ఉత్పత్తి కేంద్రం, పైపులైన్ కలిగిన పడకలు, వెంటిలేటర్లు, ఐసోలేషన్ వార్డులు, పీపీఈ కిట్లు, ఎన్-95 మాస్కులు తదితర సదుపాయాల వివరాలు సేకరిస్తున్నారు. ఖని ప్రభుత్వాసుపత్రిలో 330 పడకలుండగా అందులో వెంటిలేటర్లు, ఆక్సిజన్ సదుపాయం కలిగిన పడకలు 50 ఉన్నాయి. మొత్తం 128 మంది వైద్యుల్లో కరోనా చికిత్సలో శిక్షణ పొందినవారు 25 మంది ఉన్నారు. 353 మంది నర్సింగ్ సిబ్బందిలో 25 మంది కరోనా చికిత్సలో శిక్షణ పొందారు.

# విలీనం.. అభివృద్ధికి దూరం

వేములవాడ: మున్సిపాలిటీలో తమ గ్రామాలు విలీనమైతే మెరుగైన అభివృద్ధి ఉంటుందని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. వీధుల్లో కనీసం మురుగు కాలువలు, సీసీ రోడ్ల వసతి నేటికీ సమకూరడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ మున్సిపాలిటీలో తిప్పాపూర్, నాంపల్లి, అయ్యోరుపల్లి, శాత్రాజుపల్లి, కోనాయిపల్లి గ్రామాలను ఐదేళ్ల క్రితం విలీనం చేశారు. అప్పటి నుంచి ఆయా గ్రామాల పరిపాలన మున్సిపల్ పరిధిలోకి వెళ్లి పోయింది. అప్పటి నుంచి తమకు సమస్యలు మొదలయ్యాయని ప్రజలు అంటున్నారు. ఏచిన్న పని కావాలన్నా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాల్సి రావడంతో సమస్యలు మరింత పెరిగాయి. చాలా దూరంలో ఉన్న గ్రామాలను సైతం మున్సిపల్‌లో విలీనం చేయడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. నాంపల్లి, శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి గ్రామాలు పట్టణానికి దాదాపు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. ఏదేని అవసరాలకు వేములవాడలోని మున్సిపల్ కార్యాలయానికి రావడం తమకు ఇబ్బందిగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**శివారు కాలనీల్లోనూ...**

ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ పట్టణం రోజు రోజుకూ విస్తరిస్తుండటంతో శివారు ప్రాంతాల్లో కొత్తగా కాలనీలు వెలుస్తున్నాయి. ఈ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. పట్టణం చుట్టూ బైపాస్ రహదారులు, శివారు వీధులతో పాటు సాయినగర్, కోరుట్ల వైపు రోడ్డు, మల్లారం రోడ్డు, తదితర ప్రాంతాల్లో మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలు నేటికీ లేవు. పట్టణం నుంచి మల్లారం వెళ్లే ప్రధాన రోడ్డు వెంబడి మురుగు కాలువ లేక పెద్ద ఎత్తున మురుగు రోడ్డుపై పారుతోంది. దుర్గంధం వెదజల్లడంతో తాము రోగాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఆయా నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని అంటున్నారు. లేకుంటే వర్షాకాలంలో మురుగు సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

**మౌలిక వసతులేవీ...**

విలీన గ్రామాల్లో మౌలిక వసతులు అంతంతమాత్రమే ఉన్నాయి. చాలా గ్రామాల్లో మురుగు కాలువలు, సీసీ రోడ్ల సదుపాయం లేదు. వర్షాకాలంలో చాలా వీధులు బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేములవాడ మన్సిపల్‌లో రెండేళ్ల క్రితం టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.20 కోట్లతో పాటు ఇతరత్రా నిధులను మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి వెచ్చించినప్పటికీ అవి సరిపోలేదు. చాలా గ్రామాల్లోని అంతర్గత వీధుల్లో మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. వర్షాకాలంలో మురుగు వీధుల్లో పారుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సమస్యలు మొరపెట్టుకున్నా పరిష్కారం కావడం లేదని అంటున్నారు.

**నిధులు మంజూరు కావాల్సి ఉంది**

గతంలో మంజూరైన నిధులతో పట్టణంలోని వివిధ వార్డులతో పాటు విలీన గ్రామాల్లోనూ మురుగు కాలువలు, సీసీ రోడ్ల పనులు చేపట్టాము. పలుచోట్ల ఇంకా మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

# పల్లెల్లో ఆర్థిక సౌరభాలు

నల్గొండ : రైతులు, మహిళా సంఘాలు, ఇతరులు ఆర్థిక పరిపుష్టి సాధించడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. అర్హులకు ప్రయోజనం అందించేందుకు పీఎం కేయిఎస్‌యుఎం-ఏ పథకాన్ని అమలు చేస్తోంది. దీని ప్రకారం వ్యవసాయానికి అనుకూలంగా లేని, బంజరు భూముల్లో సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రెడ్కో సంస్థ అర్హత కలిగిన రైతుల నుంచి సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నిలకడగా 25 సంవత్సరాల పాటు ఆదాయం పొందే ప్రాజెక్టు ఇది. ఈనెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
అర్హులెవరంటే..రైతులు(వ్యక్తిగతంగా), రైతు ఉత్పత్తి సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, మండల గ్రామ సమాఖ్యలు, పంచాయతీ స్థానిక సంస్థలు భూమిని లీజుకు తీసుకొని కూడా సౌర ప్లాంట్ యూనిట్‌ను నిర్ణీత సామర్థ్యంతో ఏర్పాటు చేసుకోవచ్చు.
ముఖ్యాంశాలిలా..
మొత్తం 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యం
ఒక్కో యూనిట్ సామర్థ్యం: 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల



వరకు.ఒక మెగావాట్ సౌర విద్యుదుత్పత్తికి మూడున్నర నుంచి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ప్లాంట్ నిర్మించాల్సి ఉంటుంది.
ఉత్పత్తి చేసిన సౌర విద్యుత్‌ను తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీజీ-ఈఆర్‌సీ) నిర్ణయించిన టారిఫ్ ప్రకారం కొనుగోలు చేస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు వెబ్‌సైట్: %www.tgredco.telangana.gov.in% ను సంప్రదించాలి.
పూర్తి సమాచారం, సందేహాలు నివృత్తికి..రెడ్కో జిల్లా కార్యాలయం నల్గొండలో సంప్రదించాలి. టెలిఫోన్ నంబర్: 08682 224447, చరవాణి నెంబరు: 98318 78596, 63049 03923 సంప్రదించవచ్చు.

**భూములు పరిశీలిస్తున్నాం**

పాండురంగారావు, రెడ్కో సంస్థ ఉమ్మడి జిల్లా మేనేజర్, నల్గొండ
ఉపయోగంలో లేని భూముల్లో సౌర ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. దీనిపై మహిళా సంఘాలు, రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సకాలంలో ఆన్‌లైన్ దరఖాస్తులు పూర్తి చేసి సమాచారం పొందవచ్చు. కలెక్టర్ ఆదేశంతో నల్గొండ జిల్లాలో సౌర విద్యుదుత్పత్తికి కావాల్సిన ప్రాంతాలను పరిశీలిస్తున్నాం. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో పరిశీలించాల్సి ఉంది.

# రాయితీ యంత్రం వైపు..రైతు నేత్రం

నల్గొండ : రాయితీ వ్యవసాయ యంత్ర పరికరాల పథకానికి పలువురు దరఖాస్తు చేసినా.. నేటికీ అవి అందలేదు. ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా 2.63 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారు. నల్గొండ జిల్లాలో ప్రచారం కొరవడటం, గడువు తక్కువగా ఉండటంతో అధిక సంఖ్యలో రైతులు అర్జీలు సమర్పించలేకపోయారు. త్వరలో వానాకాలం పంటలు మొదలుకానున్న నేపథ్యంలో అన్నదాతలు రాయితీ పరికరాల కోసం ఎదురు చూసున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరోసారి దరఖాస్తులకు అవకాశం కల్పించడటంతో పాటు గతేడాది మంజూరు చేసిన నిధులకు ఈ సంవత్సరం అదనంగా కేటాయిస్తే ఎక్కువ మంది రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.
2024-25 సంవత్సరానికి సంబంధించి రాయితీ వ్యవసాయ పరికరాల కోసం నల్గొండ జిల్లాలో 820 యూనిట్లకు రూ.1.80 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటి మంజూరుకు అర్హులైన మహిళా రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలిచ్చింది. ఏఈవోల ద్వారా తీసుకున్నారు. అంతలోనే ఆర్థిక సంవత్సరం ముగియడంతో నిధులు వెనక్కివెళ్లాయి.గత ప్రభుత్వం హయాంలో ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 50 శాతం రాయితీపై పరికరాలు అందేవి. నిధుల కొరత



వల్ల ఈ పథకం ఆగిపోయింది. యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని పునరుద్ధరించాలని ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించింది. రాయితీతో వ్యవసాయ సంబంధ యంత్రాలు, పరికరాలు అందించాలని భావించింది. కానీ నిధులు మంజూరు కాకపోవడంతో రైతులంతా వాటికోసం ఎదురు చూస్తున్నారు.
పవర్ స్ప్రేయర్లు, పవర్ టిల్లరు, డ్రోన్లు, రోటోవేటర్లు, పవర్ వీడర్స్, బ్రష్‌కట్టర్స్, ట్రాక్టర్లు, విత్తనాల, ఎరువుల వేసే యంత్రాలు, దమ్ము, బోదలు చేసే పరికరాలు, బ్యాటరీ స్ప్రేయర్ యంత్రాలను ప్రభుత్వం రాయితీపై అందించనుంది.యంత్ర పరికరాల కోసం మహిళా రైతుల నుంచి దరఖాస్తులు ఏఈవోల స్థాయిలో తీసుకున్నారు. ఆర్థిక సంవత్సరం ముగియడంతో దరఖాస్తులు వారి వద్దనే ఉన్నాయి. రైతులు మాత్రం యంత్రపరికరాల కోసం ఎదురు చూస్తున్నారు. మంజూరు అయిన యంత్ర పరికరాలను డీలర్లు అప్పటికే తయారు చేసి పెట్టారు. జిల్లాలో సుమారు 1500 మంది మహిళా రైతులు దరఖాస్తులు చేసుకున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.
**నిధులు రాగానే..** మార్చిలో రాయితీ యంత్ర పరికరాల కోసం మహిళ రైతుల నుంచి దరఖాస్తులు ఏఈవోల ద్వారా తీసుకున్నాం. వాటికి నిధులు రాగానే పంపిణీ చేస్తాం.పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

# ఆరా తీసి.. పేర్లు ఏరేసి

నల్గొండ : రాష్ట్రంలో రేషన్ దుకాణాల నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో అనర్హులను గుర్తించి పేర్ల తొలగింపు ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కార్డుదారులు పలువురు బియ్యం తీసుకోవడానికి ముందుకు రావడం లేదని గుర్తించింది. గత ఆరు నెలల నుంచి బియ్యం తీసుకోనివారి లెక్కలు తీసింది. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించగా చాలా మంది అనర్హులు, పెళ్లి అయి వెళ్లిన వారు, చనిపోయిన వారు, మరికొంత మంది స్థానికంగా లేకున్నా కార్డులు ఉండటాన్ని గుర్తించారు. వాటిని గుర్తించి ఏరివేత చేపట్టారు.జూన్‌లో మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించడంతో కోటా విషయంలో లెక్కలు తప్పరాదన్న ఉద్దేశంతో రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా ఆరా తీసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా మండలాల్లో తహసీల్దార్లతో క్షేత్రస్థాయి విచారణ చేయిస్తోంది. లబ్ధిదారులు సదరు చిరునామాలో ఉంటున్నారా? లేదా మరణించారా? అని పరిశీలిస్తున్నారు. మరోవైపు వందేళ్ల వయసు పైబడి చనిపోయినవారు రేషన్ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. మరికొందరికి రెండేసి కార్డుల్లో పేర్లు ఉన్నట్లు సమాచారం. జిల్లాలో 991 రేషన్ దుకాణాల పరిధిలో 4,66,061 రేషన్ కార్డులున్నాయి. జూన్‌లో మూడు నెలలకు సంబంధించి ఆగస్టు వరకు చేపట్టనున్న బియ్యం పంపిణీలో తొలగించిన పేర్లను పరిగణనలోకి తీసుకొని కోటాను సరఫరా చేయనున్నారు.
**5,092 అనుమానాస్పద కార్డులు**
జిల్లాలో చేపట్టిన సర్వే ఆధారంగా 5,092 అనుమానాస్పద రేషన్ కార్డులు, 7,862 మంది లబ్ధిదారులు ఉన్నట్లు గుర్తించారు. ఈ కార్డుల విచారణ పూర్తి అయితే జిల్లాలో రద్దు అయ్యే కార్డుల అనర్హుల జాబితా తేలనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అనేక పథకాలకు రేషన్‌కార్డే అర్హత కావడంతో భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. అదే సమయంలో ఇప్పటికే ఉన్న లబ్ధిదారుల్లో అనేక మంది అనర్హులున్నారు.

# రైతు వేదిక.. నిర్వహణ సులువిక

కొత్తగూడెం: నిర్వహణ భారంగా మారుతోన్న రైతు వేదికలకు మంచి రోజులు రానున్నాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని రైతు వేదికలపై సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసి తద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఒక్కో దానిపై 5కిలోవాట్ల సౌర పలకలు అమర్చాలని నిర్ణయించింది. వీటి ద్వారా ఆయా రైతు వేదికల విద్యుత్తు అవసరాలు పోనూ ఒక్కోదాని నుంచి సుమారు రూ.25వేల వార్షికాదాయం పొందేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఉభయ జిల్లాల్లోని ఐదు వేదికలను పరిశీలించిన రెడ్కో అధికారులు వాటిపై సౌర పలకలు బిగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.
**మార్కెట్ యార్డులు, రైతు బజార్లలోనూ..** రైతు వేదికలతో పాటు మార్కెట్ యార్డులు, రైతు బజార్లలోనూ సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు నిర్ణయించాయి. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోన్న పీఎం కుసుమ్ పథకం కింద సౌర ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని మార్కెట్ యార్డులు, రైతు బజార్లలోనూ సౌర విద్యుదుత్పత్తికి బాటలు పడనున్నాయి. అయితే వీటికి సంబంధించిన విధివిధానాలు జిల్లాస్థాయి రెడ్కో అధికారులకు అందాల్సి ఉంది. ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు అందితే సౌర ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామని రెడ్కో అధికారులు చెబుతున్నారు.
**నిర్మించారు.. నిర్వహణ మరిచారు..** రైతులను సమావేశపరిచి శాస్త్రవేత్తల ద్వారా శిక్షణ, సలహాలు, సూచనలు అందించేందుకు.. ఎరువులు, విత్తనాల పంపిణీకి 5వేల ఎకరాలకు ఒక్కటి చొప్పున ఖమ్మం జిల్లాలో 129, భద్రాద్రి జిల్లాలో 67 రైతు వేదికలు నిర్మించారు. కొన్నేళ్లుగా నిర్వహణ నిధులు అందకపోవటంతో వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓలు) వాటిని గాలికొదిలేస్తున్నారు. సొంత ఆదాయం లేకపోవటం, ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో రైతు వేదికల లక్ష్యం నీరుగారిపోతోంది. సౌర పలకల ఏర్పాటుతో ఆదాయం సృష్టించాలనే ప్రభుత్వ తాజా నిర్ణయంతోనైనా వాటి నిర్వహణ సక్రమంగా సాగాలని అన్నదాతలు ఆకాంక్షిస్తున్నారు. **ఆదాయం ఇలా..** ఒక్కో రైతు వేదికపై 5కిలోవాట్ల సౌర పలకలు బిగిస్తే.. నెలకు 600 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని రెడ్కో అధికారులు చెబుతున్నారు.

# జలసిరులకు 'ఉరి'



హైదరాబాద్ : ఆ ప్రాంతంలో నిర్మాణాలు నిషిద్ధం. నగర ప్రజల దాహార్తిని తీర్చే జంట జలాశయాల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదంటూ ప్రభుత్వం జీవో 111ను జారీ చేసింది. దీని ప్రకారం ఎలాంటి అనుమతులు ఇవ్వరు. ఎఫ్‌టీఎల్ పరిధి మాత్రమే కాదు.. బఫర్‌జోన్ పరిధిలోనూ నిర్మాణాలు చేయకూడదు. ఈ చిత్రం చూశారా..! ఇది ఆధునిక హంగులతో నిర్మాణం చేసుకున్న ఓ రిసార్టు. ఇక్కడ అన్ని రకాల కార్యకలాపాలు జరుగుతుంటాయి. వారాంతంలో ధూంధాంగా వేడుకలు నిర్వహిస్తుంటారు. కానీ ఈ రిసార్టు.. పక్కాగా నగరానికి తాగునీరు అందించే జంట జలాశయాల్లో ఒకటైన హిమాయత్‌సాగర్‌లో నిర్మాణం కావడమే విశేషం. ఏకంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించి.. పార్టీలకు అద్దెలకు ఇస్తున్నారు. రూ.లక్షల్లో ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడమే ఆశ్చర్యం.
**రైతుల నుంచి లీజుకు..** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం నాగిరెడ్డిగూడ గ్రామం పరిధిలో నిర్మించిన రిసార్టు పూర్తిగా హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంది. మొత్తం పది మంది రైతులకు చెందిన భూములను లీజుకు తీసుకున్న ఓ వ్యక్తి నాలుగు ఎకరాల వరకు పూడ్చి వేశారు. 9 ఎకరాల్లో జీప్లస్1 భవనం నిర్మాణం చేశారు. జలాశయం పక్కనే పూడ్చి వేసి కంచె వేశారు. ఎకరానికి నెలకు రూ.25 వేల చొప్పున రైతులకు లీజు చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నారు. 9ఎకరాలకు దాదాపు రూ.2.25 లక్షలు చెల్లిస్తున్నారు. కానీ ఒక్కరోజుకే రిసార్టుకు ఆ అద్దెను వసూలు చేస్తున్నారు. ప్రభుత్వంలో పెద్దలు తనకు కావాల్సిన వారని స్థానిక అధికారులను మచ్చిక చేసుకొని ఈ భారీ నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిసింది. ఇక్కడ మిస్ యూనివర్స్ తెలంగాణ, ఆంధ్రా ఎంపికలను నిర్వహించడం విశేషం. ఇదొక్కటే కాదు.. ఇలాంటి రిసార్టులు, కన్వెన్షన్ సెంటర్లు పదుల సంఖ్యలో వెలుస్తున్నాయి. స్థానిక పురపాలక, రెవెన్యూ అధికారుల కళ్లకు మామూళ్లతో గంతలు కడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. **మా దృష్టికి రాలేదు:** హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో భారీ రిసార్టు నిర్మాణం వ్యవహారాన్ని మొయినాబాద్ తహసీల్దారు గౌతంకుమార్ దృష్టికి తీసుకెళ్లగా.. తమ దృష్టికి రాలేదని ఆ ప్రాంతాలను తనిఖీ చేసి హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని వివరించారు.

# ఆటలు ఆడకున్నా పతకాలు!



హైదరాబాద్ : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక వర్సిటీ(జేఎన్‌టీయూహెచ్) క్రీడా విభాగంలో జరిగిన అవినీతి ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఇద్దరు అధికారులు, పొరుగుసేవల సిబ్బంది అంతర్ వర్సిటీ క్రీడా పోటీల్లో ఆటలు ఆడకపోయినా పతకాలు, ధ్రువపత్రాలు ఇప్పిస్తామంటూ రూ.లక్షలు వసూలు చేశారంటూ కొందరు జేఎన్‌టీయూకు ఫిర్యాదులు చేశారు. దీనిపై విచారణకు ఏర్పాటైన కమిటీకి ఆరోపణలు వాస్తవమేనని ప్రాథమిక ఆధారాలు లభించాయి. దీంతో ఉన్నతాధికారులు ఆగ్రహించి నలుగురు పొరుగుసేవల సిబ్బందిపై వేటు వేశారు. లోతుగా విచారణ కొనసాగించి, అక్కడ పనిచేస్తున్న అధికారుల సహకారంపై నిజానిజాలు తేల్చనున్నారు.
**విద్యార్థినులకు పురుష శిక్షకులు**
జేఎన్‌టీయూ క్యాంపస్, అనుబంధ కళాశాలల నుంచి జట్లను ఎంపిక చేసిన అధికారులు వీరిని కొద్ది నెలల నుంచి ఇతర రాష్ట్రాల్లో వేర్వేరు వర్సిటీలకు తీసుకెళ్లారు. విద్యార్థినుల క్రీడా బృందాలకు మహిళా కోచ్‌లను కాకుండా ఇద్దరు పొరుగు సేవల సిబ్బందిని పంపించారు. బాక్సింగ్, రెజ్లింగ్‌కు ఎంపికైన విద్యార్థినులు.. పంజాబ్‌లోని గురుకాశీ వర్సిటీలో ఐదు నెలల జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ పోటీల్లో పాల్గొన్నారు. సౌత్‌జోన్ వాలీబాల్ విద్యార్థినీ, విద్యార్థులు యూనివర్సిటీ ఆఫ్ కేరళలో జరిగిన పోటీలకు హాజరయ్యారు. తమిళనాడు కేంద్రీయ వర్సిటీలో ఆరు నెలల క్రితం జరిగిన ఖోఖో సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్ మహిళ, పురుషుల జట్టు.. తమిళనాడులోని జెప్పియార్ వర్సిటీ పోటీల్లో పాల్గొన్నాయి. ఇందులో విద్యార్థినులతో పాటు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పంపించారు.
**మినరల్ వాటర్‌తో కార్లు కడిగించుకున్నారు!**
క్రీడా విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు అధికారుల ప్రవర్తనపై క్యాంపస్ విద్యార్థులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరి కొందరు వారి చేష్టలను లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఓ అధికారి తన కార్లను మినరల్ వాటర్‌తో కడగాలంటూ సిబ్బందికి హుకుం జారీ చేశారు. నలుగురు ఔట్ సోర్సింగ్ సిబ్బందితో వర్సిటీ, అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు ఫోన్లు చేయించారు. క్రీడా పోటీలకు ఎంపిక చేస్తాం.. ఖర్చవుతుంది అంటూ వారితో చెప్పించారు. పోటీల్లో పాల్గొనకుండానే ధ్రువపత్రాలు ఇస్తామంటూ రూ.వేలల్లో వసూలు చేయించారు.

# అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో..అకడమిక్ ఆడిట్




హైదరాబాద్ : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు.. ఆచార్యుల హాజరును పరిశీలించేందుకు అధికారులు కొత్త విధానాన్ని అమలుచేయనున్నారు. ప్రతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బోధించేందుకు సరైన సంఖ్యలో ఆచార్యులు.. సహ ఆచార్యులు.. సిబ్బంది ఉన్నారా? లేదా? పరిశోధనలు నిర్వహించేందుకు ప్రయోగశాలలున్నాయా? అన్న అంశాలను ఆకస్మికంగా తనిఖీ చేయనున్నారు. 'అకడమిక్ ఆడిట్' పేరుతో కొంతమంది అధికారులను బృందంగా ఏర్పాటుచేయనున్నారు. ప్రత్యేక బృందం సభ్యులు కళాశాలల్లో పరిస్థితులను పరిశీలించనున్నారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి నిబంధనలు, జేఎన్‌టీయూ మార్గదర్శకాలు పాటించడం లేదని గుర్తించి నివేదికలు సమర్పించిన వెంటనే చర్యలు తీసుకోనున్నారు. విద్యార్థులు, ఆచార్యుల నిష్పత్తికి అనుగుణంగా బోధన సిబ్బంది లేకపోయినా.. నిర్ణీత సంఖ్యలో ప్రయోగశాలలు లేకున్నా యాజమాన్యాలకు తాఖీదులిచ్చి గడువులోగా ప్రమాణాలు పాటించాలంటూ హెచ్చరించనున్నారు.
వరుస ఆరోపణలు... వేలిముద్రల ఆచార్యులు
జేఎన్‌టీయూ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తగిన సంఖ్యలో లేరని ఆరోపణలొస్తున్నాయి. ఫలానా కళాశాలలో ఫ్యాకల్టీ లేరని, ల్యాబ్‌లు లేవంటూ తల్లిదండ్రులు ఉపకులపతి, రిజిస్ట్రార్ కార్యాలయాలకు లేఖలు రాస్తున్నారు. జేఎన్‌టీయూ పరిధిలో 215 అనుబంధ గుర్తింపు కళాశాలలుండగా.. వాటిల్లో 3.50లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కొన్ని ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు బీటెక్, ఎంటెక్ పూర్తిచేసిన వారిని అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమిస్తున్నారు. మరికొన్ని కళాశాలలు ప్రొఫెసర్లను నియమించుకుని బయోమెట్రిక్ హాజరు వేయించుకుని పంపుతున్నారు. ఇంకొన్ని కళాశాలల్లో చాలామంది బోధనా సిబ్బంది లేకపోవడంతో కాగితాలపైనే ఆచార్యులను నియమించుకుంటున్నారు.
**కమ్యూనికేషన్ స్కిల్స్ లేవు..**
అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో 60శాతం మంది ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలు లేవని జేఎన్‌టీయూ అధికారులు గుర్తించారు. ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తైనా వారికి ఉద్యోగాలు రావడం లేదంటూ పలు అధ్యయనాల నేపథ్యంలో ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో బోధనా ప్రమాణాలపై దృష్టి సారించారు. క్యాంపస్ ఇంటర్వ్యూలలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు 30శాతంమంది కూడా ఎంపిక కావడం లేదని తెలుసుకున్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న జేఎన్‌టీయూ అధికారులు అకడమిక్ ఆడిట్ ద్వారా లోపాలు గుర్తించి వాటిని సవరించుకోవాలంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రెండు, మూడు నెలల గడువులోపు లోపాలను సవరించుకోకపోతే కఠినంగా చర్యలు చేపట్టనున్నారు. బోధనా ప్రమాణాలు పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని జేఎన్‌టీయూ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

# రాయితీ యంత్రం.. రైతులకు దూరం

కాల్వశ్రీరాంపూర్: అన్నదాతలకు తోడ్పాటునందించడంతోపాటు సాగుకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవసాయానికి ఉపయోగపడే పరికరాలు, యంత్రాలు రాయితీపై అందించేది. అయితే కొన్నేళ్లుగా ప్రభుత్వం సబ్సిడీ యంత్రాలు, పరికరాలు అందించడం లేదు. దీనికితోడు రోజురోజుకు సాగు ఖర్చులు పెరుగుతుండటంతో రైతన్నలకు భారంగా మారింది.
**ఇప్పుడందిస్తేనే మేలు**
ప్రభుత్వం సబ్సిడీ వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందిస్తే రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి సాగు పెరుగుతుంది. రెండు నెలల కిందట ప్రభుత్వం యంత్రాలు అందిస్తామని చెప్పడంతో కొంతమంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న తరుణంలో ఇప్పటికీ వాటి జాడ లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంపిణీ చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.
**ఏడేళ్లుగా ఎదురుచూపులు**
భారాస ప్రభుత్వం తొలిసారి అధికారంలోకి వచ్చాక రొటవేటర్, మక్కలు పట్టే యంత్రం, తదితర పరికరాలు రాయితీతో రైతులకు అందజేసింది. కూరగాయల విత్తనాలతోపాటు ట్రాక్టర్లు, పిచికారీ పంపులు, కలుపు తీసే యంత్రాలు, వరికోత మిషన్లు, టార్పాలిన్లు కూడా పంపిణీ చేసింది. అయితే 2018 నుంచి వీటిని అందించడం నిలిపివేసింది. దీంతో అన్నదాతలు యంత్రాలను కొనుగోలు చేసే పరిస్థితి లేక కూలీలపై ఆధారపడాల్సి వస్తోంది. వీటి వినియోగంతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగుకు అవకాశముంటుంది. ఖర్చులు సైతం ఆదా అవుతాయి. ప్రస్తుతం రైతులు మార్కెట్‌లో యంత్రాలను అద్దెకు తీసుకొచ్చి పనులు చేసుకుంటున్నారు.
**బడ్జెట్ మంజూరైతే అందిస్తాం: ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి**
రాయితీపై యంత్రాలు, పరికరాలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి రెండేళ్ల బడ్జెట్ మంజూరు కావాలి. ఎన్ని నిధులు వస్తాయో దానిని బట్టి రైతుల నుంచి డీడీలు తీసుకుంటాం. తప్పకుండా యంత్రాలు అందించేలా చూస్తాం.

# నిబంధనలతో మాకేం పని?

పెద్దపల్లి: చెరువు మట్టి తీసుకువెళ్లేవారికి అనుమతించిన పరిమాణంతోపాటు నిర్దేశిత గడువు, తరలించేందుకు వినియోగించే వాహనాలు ఇతర నిబంధనలన్నింటిని ప్రభుత్వం ఉత్తర్వులలో స్పష్టంగా పేర్కొంటున్నా.. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఒకే జిల్లాలో వేర్వేరు చెరువుల్లో మట్టి తరలింపునకు అనుమతించడంలో వివాదాలు ఏర్పడుతున్నాయి. తాజాగా పెద్దపల్లి మండలం కొత్తపల్లి చెరువు నుంచి 2022లో నిల్వచేసిన మట్టిని తరలించడం ఘర్షణకు దారితీసింది. ఒకరి మట్టిని మరొకరు తీసుకువెళుతున్నారనే అంశమే అసలు గొడవకు కారణమవుతోంది. ఇంతా జరుగుతున్నా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదు. కేవలం సీనరేజీ చెల్లిస్తే సరిపోతుందనే ధోరణితో ఉంటున్నారు.
**రెండేళ్లుగా తరలింపు**
కొత్తపల్లి చెరువు నుంచి 2022 వేసవి కాలంలో మట్టి తీసుకునేందుకు అనుమతి తీసుకున్న ఆరుగురు ఇటుక బట్టీ వ్యాపారులు.. అనుమతించిన పరిమాణం కంటే ఎక్కువగా తరలించి, అదే గ్రామంలోని ప్రైవేటు భూముల్లో నిల్వ చేశారు. దీనిపై కొందరు ఫిర్యాదు చేయడంతో విచారణ నిర్వహించిన అధికారులు నిల్వచేసిన 70,216 మెట్రిక్ టన్నుల మట్టిని సీజ్ చేశారు. ఈ డంప్‌ను తిరిగి పొందేందుకు బట్టీ యజమానులకు ప్రభుత్వం వన్‌టైం సెటిల్‌మెంట్ కింద 2023లో రూ.2.50 కోట్ల జరిమానా విధించింది. ఈ జరిమానాను చెల్లించిన కొందరు మట్టిని తరలించగా, మరికొందరు అక్కడే నిల్వ చేశారు. దీనిని తీసుకువెళ్లడానికి నిర్దిష్టమైన గడువు విధించకపోవడంతో రెండేళ్లుగా తరలింపు జరుగుతోంది. ఇటుక బట్టీలు లేనివారు సైతం మట్టిని తీసుకుపోతున్నారు.



**అనుమతుల్లో గందరగోళం**
ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్ నుంచి తరలించిన మట్టిని అంతర్గాం మండలం ముర్మూర్ వద్ద నిల్వ చేశారు. ఈ డంప్‌ను తరలించేందుకు గత ఫిబ్రవరిలో మైనింగ్ అధికారులు అనుమతించారు. 80,280 మెట్రిక్ టన్నుల మట్టిని తరలించేందుకు నిర్దేశిత గడువుతోపాటు వాహనాల నంబర్లు ఉత్తర్వులలో స్పష్టంగా పేర్కొన్నారు. దీంతో సంబంధిత మట్టిని నిబంధనల ప్రకారం ఉత్తర్వుల్లో పేర్కొన్న వాహనాల్లో నిర్దేశిత గడువులోగానే తీసుకుపోయారు. కానీ కొత్తపల్లి వద్ద డంపింగ్ చేసిన చెరువు మట్టి విషయంలో అధికారులు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఈ మట్టిని పది మంది నిల్వ చేసినట్లు ప్రచారం జరుగుతుంది. కానీ మైనింగ్ అధికారుల నుంచి మాత్రం ఆరుగురే అనుమతి పొందినట్లు రికార్డులలో పేర్కొన్నారు. ఇక చెరువు నుంచి అనుమతి తీసుకున్న పరిమాణం? ఎంతమేరకు బట్టీలకు తరలించారు? ఎంత నిల్వ చేశారనే అంశాలపై మైనింగ్ అధికారులు విచారణ చేయలేదు. వీటికి ముగింపు పలకకపోతే రానున్న రోజుల్లో సమస్య మరింత జటిజలంగా మారే అవకాశముంది.

# నిధులందవు.. నిర్మాణాలు సాగవు

ధర్మపురి: గతంలో ఈ రహదారిని సీసీ రోడ్డుగా మార్చేందుకు ప్రతిపాదించగా.. రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే కేవలం 15 శాతమే పనులు పూర్తయ్యాయి. రోడ్డు పక్కన తవ్వి వదిలేయడంతో ఆసుపత్రికి వెళ్లే రోగులు, నది స్నానానికి వెళ్లే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇదేకాక ధర్మపురి పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పలు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో స్థానికులు తమ ఇంటి ఎదుట కంకరతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి మీదుగా వెళ్లే రహదారిపై వేలాది భక్తుల వాహనాలు గోదావరికి వెళ్తుంటాయి.
**భక్తుల ఇబ్బందులు**
పట్టణంలోని తెనుగువాడ నుంచి బ్రాహ్మణసంఘం వరకు రెండు వరుసల రహదారి నిర్మాణానికి రూ.1.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 280 మీటర్ల వెడల్పుతో రెండు వైపులా మురుగు కాలువలు నిర్మించగా.. రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఎక్కువగా వాహనాలు ఇదే రహదారి నుంచి బ్రాహ్మణసంఘం, దేవస్థానం వరకు పెద్దఎత్తున వెళ్తుంటాయి. రహదారి నిర్మాణం ఆగిపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



**ప్రమాదకరంగా..**
అంబేడ్కర్ కూడలి నుంచి అక్కపల్లి దేవస్థానం వరకు రోడ్డు వేసేందుకు రూ.కోటి నిధులు మంజూరు చేశారు. రెండు చోట్ల కల్వర్టులు నిర్మించారు. కేవలం 30 శాతం పనులు పూర్తవగా, మిగతావి నిలిచిపోయాయి. ఏడాదికిపైగా కంకర తేలి ఆయా కాలనీ ప్రజలకు అసౌకర్యంగా ఉంది.
**కంకర పోసి.. వదిలేసి**
పట్టణంలోని వివేకానంద కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నాలుగు వరుసల రహదారి ఏర్పాటుచేసి, మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించగా.. దీనికి రూ.6 కోట్ల నిధులు గతంలో మంజూరు చేశారు. అయితే రెండు వైపులా కంకర పోసి నిధులు విడుదల కాక వదిలేశారు. దీంతో రహదారి ప్రమాదకరంగా మారింది. అర్ధాంతరంగా నిలిచిన పనులను వెంటనే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.
**ప్రతిపాదనలు పంపించాం**
నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. వీటిని పూర్తి చేసేందుకు మళ్లీ ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదల కాగానే పనులు చేపడతాం. రాజశేఖర్, పురపాలక కమిషనర్ ధర్మపురి

# సరిచేసే సమయమిదే..!

భానుపురి : జిల్లాలో వంగిన స్తంభాలు, వేలాడిన తీగల మరమ్మతుకు వేసవి కాలమే మంచి తరుణం. వర్షాలు కురిసిన వెంటనే వ్యవసాయ పనులు ప్రారంభమవుతాయి. అప్పుడు మరమ్మతుకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. వీటితో పశువులు, మనుషులు మృత్యువాత పడే ప్రమాదం ఉంటుంది. ముందే మేల్కొంటే అలాంటి ఘటనలు జరగకుండా ఉంటాయి. విద్యుత్తు అధికారులు వేసవిలోనే పనులు ప్రారంభిస్తే మంచిది.

**సరఫరాలో అంతరాయాలకు అడ్డుకట్ట..**
వేసవిలో ముందుగానే పొలాలు, రోడ్ల వెంట తెగిన పడిన తీగలు, వంగిన స్తంభాలను సరిచేస్తే వర్షాకాలంలో గృహాలకు విద్యుత్తు సరఫరాలో ఎటువంటి ఆటంకం ఉండదు. గాలిదుమారానికి స్తంభాలు కూలిపోవడం, తీగలు తెగడంతో గంటకొద్దీ ఇళ్లకు సరఫరా నిలిచిపో తుంది. రాత్రి పూట మరీ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉ




ంటుంది. ఇప్పటికైనా జిల్లాలో స్తంభాలు, తీగలను వెంటనే మార్చాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు అధికారులను వివరణ కోరగా ఇప్పటికే పలుచోట్ల స్తంభాలు, తీగలను సరిచేయించాం. మిగతా చోట్ల కూడా చేయించి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.

**స్తంభాలు, తీగలు మరమ్మతులు..** ఏళ్ల నుంచి పాత స్తంభాలు, తీగలు ఉన్నాయి. ఈదురుగాలులు, వర్షాలతో పొలాల్లో తీగలు తెగిపడి ఉంటాయి. వాటిని నెలల తరబడి అలాగే ఉండటంతో వ్యవసాయ పనులు ప్రారంభ సమయంలో రైతులు వాటిని గమనించకుండా పనులు చేస్తుంటారు. పశువులు కూడా అక్కడ తీగలు తెగి ఉన్నాయనే విషయం వాటికి తెలియదు. ఈ కారణంగా విద్యుదాఘాతం జరిగి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఏటా పశువులు, మనుషులు మేతకు వెళ్లినప్పుడు, నాట్లు వేస్తున్న కూలీలకు తాకి మృతిచెందిన ఘటనలున్నాయి. ఇప్పుడే స్పందించి సరిచేస్తే వర్షాకాలంలో ఎటువంటి ఆపద తలెత్తదు.

# లక్ష్యం.. నిర్దేశం

నిర్మల్ : మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు ఆర్థిక చేయూత కోసం అందించే రుణాల్లో బ్యాంకు లింకేజీ ఒకటి. చిన్న వాటితోపాటు భారీ పరిశ్రమలను ఏర్పాటు చేయిస్తూ వ్యాపార పరంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుంది. ఏటా లక్ష్యాలను నిర్ణయిస్తుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సర్కారు తాజాగా లక్ష్యం కేటాయించింది. గత ఏడాది ఇచ్చిన వాటి కంటే అధికంగా రుణాలు ఇప్పించడంతోపాటు వసూళ్లలోనూ ప్రత్యేకత కనబర్చాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 33,023 ఎస్‌హెచ్‌జీలకు రూ.1425.87 కోట్ల రుణాలను ఇప్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసి జిల్లాలకు పంపించారు.

**వ్యాపారపరంగా..**ఒక్కో సంఘానికి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు ఇవ్వనున్నారు. ఇందుకోసం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సంబంధిత బ్యాంకులను సంప్రదించి ఇప్పించనున్నారు. పొందిన రుణాలతో సభ్యులు భారీ, చిన్న కుటీర పరిశ్రమలు, కిరాణా, వస్త్ర దుకాణాలు, టైలరింగ్, వ్యవసాయ రంగానికి సంబంధించి నాటు



కోళ్లు, చేపల పెంపకం, కూరగాయలు పండించడం తదితర వాటితో ఉపాధి పొందనున్నారు. ఇచ్చిన రుణాలను నెలవారీగా చెల్లిస్తూనే పొదుపు పాటించేలా అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు వారికి సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. ముఖ్యంగా మహిళలు వ్యాపారంలో రాణించేలా ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కుటుంబానికి ఆర్థిక వెన్నుదన్నుగా వారు నిలుస్తున్నారు.

**మహిళలకు మేలు: విజయలక్ష్మి, డీఆర్డీవో, నిర్మల్**
ఎస్‌హెచ్‌జీల్లోని మహిళల ఆర్థిక తోడ్పాటుకు బ్యాంకు లింకేజీ రుణాలు ఎంతో మేలు చేయనున్నాయి. లక్ష్యం పూర్తి చేసేలా ఇప్పటి నుంచి కార్యాచరణ రూపొందించాం. ఇప్పటికే మూడు పర్యాయాలు వరుసగా రాష్ట్ర స్థాయిలో జిల్లాను ఉన్నత స్థానంలో నిలపడం ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో ఈ ఆర్థిక సంవత్సరంలోనూ ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేశాం. తీసుకున్న రుణాలతోపాటు పొదుపు నెలవారీగా చెల్లింపులు చేపట్టేలా అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వారిలో చైతన్యం తీసుకొచ్చేలా సూచనలు, సలహాలు ఇచ్చాం.

## స్టేడియం పనులు.. పూర్తికాక పదకొండేళ్లు

వేములవాడ: వేములవాడ పట్టణంలో క్రీడా మైదానాలు లేవు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని మైదానం అంతంత మాత్రంగానే ఉంది. మినీ స్టేడియం పూర్తయితే ఎంతో ఉపయోగంగా ఉంటుందని భావించినప్పటికీ ఏళ్లుగా నిర్మాణంలోనే మూలుగుతోంది. తిప్పాపూర్ శివారులో అయిదెకరాల విస్తీర్ణంలో స్టేడియం నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.2.10 కోట్లు మంజూరు చేసింది. 2014లో అప్పటి స్పీకర్ మధుసూదనాచారి శంకుస్థాపన చేశారు. మొదట పనులు చేపట్టిన గుత్తేదారు మధ్యలోనే చేతులెత్తేశారు. ఆ తరువాత మరో గుత్తేదారు అసంపూర్తిగా వదిలేశారు. అప్పటి నుంచి పనులు తిరిగి మొదలు కావడం లేదు. మొదట విడుదలైన నిధులు సరిపోకపోవడంతో ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసింది. దీంతో తిరిగి పనులు చేపట్టిన గుత్తేదారు క్రీడాకారులకు అవసరమైన విశ్రాంతి భవనం, డ్రెస్సింగ్ గదులు, క్రీడా పరికరాలు భద్రపరిచే గది, కార్యాలయ భవనం, తదితర గదుల నిర్మాణాలు, ప్రహరీ నిర్మాణాలు చేపట్టి మధ్యలోనే వదిలేశారు. ఇండోర్ స్టేడియం పైకప్పు వరకు గోడలు నిర్మించారు. మైదానంలో మొరం పోసి చదును చేశారు. ఆర్చ్‌గేటు నిర్మాణం, మైదానంలో ట్రాక్ పనులన్నీ అసంపూర్తిగానే నిలిచి ఏడాది కావొస్తుండటంతో తుమ్మచెట్లు పెరిగాయి.
వేములవాడ పట్టణంలో క్రీడా మైదానాలు లేవు. కేవలం కళాశాల మైదానమే అన్నింటికి పెద్ద దిక్కుగా మారింది. కళాశాల తరగతులు నడుస్తున్న సందర్భాల్లో అక్కడ ఎలాంటి క్రీడల నిర్వహణకు అవకాశం ఉండదు. ఈ ప్రాంతంలో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, ఖోఖో, షటిల్ వంటి క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడిన క్రీడాకారులున్నారు. సరైన క్రీడా మైదానాలు లేక క్రీడాకారులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోలేక పోతున్నారు. స్టేడియం పనులు తిరిగి వారం రోజుల్లో మొదలవుతాయని టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఏఈ శ్రీకాంత్ పేర్కొన్నారు.

# లేనిది ఉన్నట్లు.. అంతా కనికట్టు



ఆదిలాబాద్ :బట్టిసావర్గాం శివారులో 6 ఎకరాల్లో దాదాపు 90 ప్లాట్లతో తయారైన లేఅవుట్ ఇది. ఇందులో పార్కుల్లో పచ్చదనం, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటకున్నా, మంచినీటి ట్యాంకు, సెప్టిక్/ఎస్టీపీ ట్యాంకు నిర్మించకున్నా ఉన్నట్లు తప్పుడు నివేదికలు సమర్పించి తుది ఆమోదం జారీ చేశారు. ఇది మావల పరిధిలో 15 ఎకరాల్లో 200 ప్లాట్లతో వెలిసిన వెంచర్. ఇక్కడ పార్కులో, బహిరంగ స్థలాల్లో పచ్చదనం లేదు. మంచినీటి ట్యాంకు నిర్మించలేదు. భూగర్భ మురుగు కాలువలు లేకున్నా ఉన్నట్లుగా తనిఖీ నివేదిక సమర్పించి లేఅవుట్‌కు తుది ఆమోదం పొందారు. బల్దియాలో కొందరు స్థిరాస్థి వ్యాపారులు చేస్తున్న మాయాజాలానికి అధికారులు వత్తాసు పలుకుతున్నారు. లేనిది ఉన్నట్లుగా తప్పుడు నివేదికలతో కనికట్టును ప్రదర్శిస్తున్నారు. పట్టణంలోని పలు లేఅవుట్లలో పూర్తిస్థాయిలో వసతులు కల్పించకున్నా అన్నీ సవ్యంగా ఉన్నాయంటూ తనిఖీ నివేదికలు సమర్పించి తుది ఆమోదం జారీ చేస్తున్నారు. వెంచర్లలో కొన్ని అభివృద్ధి పనులే చేసినా అన్నీ చేసినట్లు సృష్టించిన తప్పుడు తనిఖీ నివేదికలు వెలుగుచూశాయి. రూ.లక్షలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు మోసపోతున్నారు. వ్యాపారులు లాభపడుతున్నారు.

**18 రకాల సదుపాయాలు ఎక్కడ**
ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేఅవుట్ చేయాలనుకున్న స్థిరాస్తి వ్యాపారి డీటీసీపీ ఆమోదం కోసం టీజీ-బీపాస్‌కు దరఖాస్తు చేసుకుంటారు. జిల్లాస్థాయి లేఅవుట్ కమిటీ స్థలాన్ని పరిశీలించి సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించి అన్నీ సవ్యంగా ఉంటే తాత్కాలిక ఆమోదం(టెంటేటివ్ అప్రూవల్) జారీ చేస్తారు. రెండేళ్లలో లేఅవుట్ యజమాని నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలి. విద్యుత్తు సదుపాయం, తాగునీటి వసతి కల్పించాలి. పార్కులను అభివృద్ధి చేయాలి, పచ్చదనం పెంపొందించాలి. ఇలా 18 రకాల అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే అధికారులు మళ్లీ లేఅవుట్‌ను పరిశీలించి పూర్తిస్థాయిలో లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తే తుది ఆమోదానికి సంబంధించిన ప్రొసీడింగ్స్ జారీ చేస్తారు. లేకపోతే రిమార్కులు రాసి మళ్లీ ఆయా పనులను పూర్తి చేయాలని స్థిరాస్తి వ్యాపారికి సూచించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయితేనే అధికారులు ఆ వెంచర్లలో భవన నిర్మాణ అనుమతులు జారీ చేయాలి.

**తప్పుడు నివేదికలు సమర్పించి**
బల్దియాలో విలీనమైన మావల, బట్టిసావర్గాం పరిధిలోకి వచ్చే పలు లేఅవుట్లలో ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు జరగలేదు. గతంలో తాత్కాలిక అనుమతి పొందిన లేఅవుట్ల యజమానులు పూర్తిస్థాయి ఆమోదం కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు లేఅవుట్లను పరిశీలించి సౌకర్యాలు లేకున్నా తుది ఆమోదం ఇచ్చేశారు. వాస్తవానికి అక్కడ రహదారులు, మురుగు కాలువలు, విద్యుత్తు సదుపాయం మాత్రమే కల్పించారు.
మంచినీటి ట్యాంకులు నిర్మించలేదు.
సెప్టిక్, మురుగు శుద్ధి కేంద్రాలు లేవు.
సామాజిక ఇంకుడు గుంతలు నిర్మించలేదు.
బోరుబావులు తవ్వించలేదు.
మ్యాన్‌హోల్స్‌తో కూడిన భూగర్భ మురుగు కాలువలు లేవు.
పార్కులు, బహిరంగ స్థలాల్లో పచ్చదనం లేదు.
రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటలేదు.

# వెక్కిరిస్తున్న ఖాళీలు.. అటవీ రక్షణపై నీలినీడలు




జన్నారం : కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం పరిధిలోని జన్నారం అటవీ డివిజన్‌లో పలువురు బీట్ అధికారులు ఆరు నెలల క్రితం ఇతర ప్రభుత్వ కొలువులు సాధించి వెళ్లిపోయారు. దీంతో ఇక్కడ ఏర్పడిన ఖాళీలు ఇంత వరకు భర్తీ కాలేదు. ఏడాదిన్నర క్రితం అటవీ డివిజనల్ అధికారి హైదరాబాద్‌లోని అటవీశాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ కావడంతో అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉంటుంది. జన్నారం రేంజీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే దీర్ఘకాలిక సెలవు మీద వెళ్లడంతో ఏడాది నుంచి రేంజి అధికారి పోస్టు ఇన్‌ఛార్జితోనే నడుస్తోంది. అడవిని రక్షించాల్సిన బీట్ అధికారులు, డివిజన్ మొత్తాన్ని నడిపించే డివిజన్ అధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కలప స్మగ్లర్లను అరికట్టడానికి ఇద్దరే రేంజి అధికారులు ఉన్నారు.

**బీట్ అధికారులిలా..**జన్నారం అటవీ డివిజన్‌లోని ఇంధన్‌పల్లి బీట్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న వేముల హరీశ్, బంగారుతండా బీట్ అధికారి బానోత్ సంతోష్, మల్యాల్ బీట్ అధికారి శ్రావణ్‌కుమార్, తాళ్లపేట రేంజి పరిధి తపాల్‌పూర్ బీట్ అధికారిగా విధులు నిర్వర్తించే దండేపల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన సందుపట్ల లక్ష్మీపతిలకు గ్రూపు-4లో కొలువులు రావడంతో వెళ్లిపోయారు. దొంగపల్లి బీట్ అధికారి ప్రణీత్‌కుమార్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్‌లో వార్డు అధికారిగా కొలువు సాధించారు. ఇలా అయిదుగురు బీట్ అధికారులు ఒకేసారి తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి వెళ్లడంతో జన్నారం అటవీ డివిజన్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.
జన్నారం రేంజి అధికారిగా ఏడాది నుంచి తాళ్లపేట రేంజి అధికారి సుష్మారావుకు ఇన్ఛార్జి బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి ఆమె రెండు రేంజీల బాధ్యతలు సమర్థంగానే నిర్వర్తిస్తున్నారు. జన్నారం రేంజి అధికారి పోస్టును భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

**ఎఫ్‌డీఓ పోస్టు మరిచిపోయారా?**
అటవీ డివిజన్‌కు ఎఫ్‌డీఓ పోస్టు ఎంతో కీలకం. జన్నారం అటవీ డివిజన్ అధికారిగా నాలుగున్నర సంవత్సరాలు పని చేసిన సిరిపురపు మాధవరావు 2023 నవంబరులో బదిలీపై హైదరాబాద్ వెళ్లారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉంది. దీంతో కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రానికి జీవనాడిగా నిలుస్తున్న జన్నారం డివిజన్ పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా మారింది. కిందిస్థాయి సిబ్బంది, అధికారుల పోస్టులు ఖాళీగా ఉండటం కలప స్మగ్లర్లకు వరంగా మారింది. ఇప్పటికైనా అటవీశాఖ ఉన్నతాధికారులు జన్నారం డివిజన్ మీద దృష్టిసారించి ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

# తాళం.. వారికి ఆహ్వానం

నిర్మల్ : జిల్లా పరిధిలో ఇటీవల దొంగతనాలు ఎక్కువవుతున్నాయి. పల్లె, పట్నం తేడాలేకుండా చోరీలు పెరగడంతో జనం భయాందోళనకు గురవుతున్నారు. తాళం వేసి ఉంటే చాలు దొంగలకు వరమవుతోంది. నిరంతర నిఘా, విస్తృత గస్తీ చేపడుతున్నామని పోలీసులు ప్రకటిస్తున్నా దొంగతనాలు ఆగకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. చేసేదేం లేక కొన్నిచోట్ల స్థానికులే చొరవ తీసుకొని ప్రత్యేకంగా గస్తీ చేపడుతున్నారు.

**ఇటీవలి ఘటనలు**సోన్ మండలం మాదాపూర్‌లోని రెండిళ్లలో ఇటీవల దొంగతనం జరిగింది. ఇళ్లకు తాళం వేసి ఉండటం, కుటుంబసభ్యులు ఇంటి డాబాపై నిద్రిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఒకరింట్లో రూ.15 వేలు నగదు, తులంన్నర బంగారం అపహరణకు గురవగా, మరో ఇంట్లో ఏం పోయాయో తెలలేదు. భైంసా మండలం వాలేగాం వాసి మాధవరావు ఉపాధినిమిత్తం మహారాష్ట్రలో ఉంటారు. అతడి భార్య, కుమారుడు బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. తాళం వేసి ఉండటం గమనించిన దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. రూ. 1.80 లక్షల నగదు, ఐదు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. బాసర మండలం టాక్లీ గ్రామంలో ఓ కుటుంబం ఇంటికి తాళం వేసి, డాబాపై నిద్రిస్తున్న సమయంలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. తులం బంగారం, వెండి ఆభరణాలతో పాటు రూ. 30 వేలు నగదు ఎత్తుకెళ్లారు.
జిల్లా కేంద్రంలోని గాజులపేట్‌లో నివాసముంటున్న సాబీర్ ఇంట్లో సుమారు 20 రోజుల క్రితం దొంగలు చొరబడ్డారు. ఇంట్లోని బీరువా తెరిచి మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు అపహరించారు. ఆ ఇంటి పక్కనే నివాసముండే అన్వర్ ఇంట్లోనూ చోరీకి పాల్పడ్డారు. బీరువా తెరిచి రూ. 6 వేలు నగదు, రెండు బంగారు ఉంగరాలు ఎత్తుకెళ్లారు. రెండిళ్లకూ తాళం వేసి ఉండటం గమనించి పట్టపగలు చోరీకి పాల్పడ్డారు.

**స్థానికుల గస్తీ..**కడెం మండలంలో ఇటీవల చోరీ ఘటనలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో గ్రామస్థులు గస్తీ తిరుగుతున్నారు. ప్రతీ ఇంటి నుంచి ఒకరు చొప్పున వచ్చి బృందాలుగా విడిపోయి కాలనీలో పహారా కాస్తున్నారు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితం ఉండటం



లేదని, దొంగలు ఏ సమయంలో వస్తున్నారో తెలియడం లేదని వాపోతున్నారు.

**అనువుగా ఉండటంతో..**పొరుగునే మహారాష్ట్ర ఉండటం, తనిఖీ కేంద్రాలు పెద్దగా పనిచేయకపోవడంతో ఇష్టారీతిన రాకపోకలు సాగుతున్నాయి. దీనికితోడు జిల్లాలో 44, 61వ జాతీయ రహదారులు ఉన్నాయి. రవాణాపరంగా సౌలభ్యంగా ఉండటంతో ఇతర జిల్లాలకు చెందిన వ్యక్తులు నేరుగా వచ్చి దొంగతనం చేసి పారిపోతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వేసవికావడం, కూలీ పనులు అంతగా లభించకపోవడం, వ్యవసాయపనులు లేకపోవడం వంటి కారణాలతో కొందరు సులభ సంపాదనకు చోరీలవైపు మళ్లుతున్నారనే వాదనలూ లేకపోలేదు.

**అప్రమత్తతే రక్ష**వేసవి కావడంతో చాలామంది గ్రామీణ ప్రాంతాల్లోని బంధువుల ఇళ్లకు, శుభకార్యాలు, వినోదయాత్రలకు వెళ్తుంటారు. దీంతో ఇళ్లకు తాళం వేయడం తప్పనిసరి. పైగా రాత్రివేళల్లో కొందరు చల్లగాలి కోసం ఇళ్లకు తాళం వేసి ఆరుబయటనో, డాబాపైననో నిద్రిస్తుంటారు. దీన్ని గమనించే దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. అనువైన సమయం లభించగానే తాళం పగలగొట్టి ఇళ్లలోకి చొరబడుతున్నారు. జరిగిన ఘటనలు పరిశీలిస్తే ఈ విషయాలు తేటతెల్లమవుతున్నాయి. ఇళ్లకు తాళం వేసి వెళ్లాల్సివస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవడం, వ్యక్తిగతంగా అప్రమత్తంగా ఉండటమే దొంగతనాల నివారణలో కీలకం.

# ప్రైవేటులో కడుపు కోతలే..

మంచిర్యాల : జిల్లాలోని ప్రైవేటు ప్రసూతి ఆసుపత్రి నిర్వాహకులతో ఆరోగ్యశాఖ ఏర్పాటు చేస్తున్న సమావేశాలు సత్ఫలితాలు ఇవ్వడం లేదు. కోతలు తగ్గించాలంటూ ఆదేశాలివ్వడం అధికారులకు అలవాటైతే.. పెడచెవిన పెట్టడం ఆ వైద్యులకు పరిపాటిగా మారింది. ప్రైవేటులో జరుగుతున్న కోతల్లో ఏ మాత్రం మార్పు రాకపోగా మరింత పెరుగుతున్నాయి. ఈ శస్త్రచికిత్సలన్నీ జిల్లాలోని ఆరేడు ఆసుపత్రుల్లోనే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. అయినా వైద్యశాఖ చాలా 'మామూలు'గా తీసుకుంటోంది. భారీగా శస్త్రచికిత్సలు జరుగుతున్నా కనీసం ఆరా కూడా తీయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.
ప్రైవేటు కేంద్రాల్లో కోతల తీరుకు ఈ లెక్కలే నిదర్శనం. 90శాతానికి పైగా శస్త్రచికిత్సలతోనే ప్రసవాలు చేస్తున్నట్లు వీటితో తెలుస్తోంది. ప్రతినెల సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ఈ ప్రసవాల్లో అధికంగా మంచిర్యాలలోని 4-5 ఆసుపత్రుల్లోనే జరుగుతుండగా



చెన్నూరులోని ఒక చోట ఎక్కువగా ఉంటున్నట్లు తేలింది. అయినా ఆరోగ్యశాఖ అధికారులు వాటిపై ఎలాంటి చర్యలు లేవు. శస్త్రచికిత్సలు చేయాల్సిన అవసరంపై ఆరా తీసే ప్రయత్నమూ చేయడం లేదు.

**ఫీజులు భారీగా..**
ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవమైనా.. శస్త్రచికిత్స ద్వారా చేసినా ఫీజుల్లో ఏ మాత్రం తగ్గడం లేదు. కానీ వైద్యులు సమయం ఆదా చేసుకునేందుకు, పని సులువుగా పూర్తి చేసేందుకు కోతలకే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. గంటల తరబడి ఎదురుచూడలేక.. ఓపిక పట్టడం చేతకాక అయిదు నిమిషాల్లో పూర్తయ్యే శస్త్రచికిత్సలకు అలవాటుపడిపోతున్నారు. ఫీజులు ఎలాగూ తగ్గించడం లేదు. బాధితులకు సాధారణ ప్రసవాలతో కలిగే లాభాలను వివరించి వీటికే మొగ్గుచూపేలా చొరవచూపాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శస్త్రచికిత్సలు బాలింతల భవిష్యత్తు ఆరోగ్యంపై ఏ స్థాయిలో ప్రభావితం చేస్తాయో తెలిపేలా ఆరోగ్యశాఖ అవగాహన పెంచడంతోపాటు ప్రైవేటులో కోతలను తగ్గించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు
ప్రైవేటు ప్రసూతి కేంద్రాల్లో జరిగిన ప్రసవాల సంఖ్య: 3954
శస్త్రచికిత్సల ద్వారా చేసినవి: 3543
సాధారణ ప్రసవాలు: 411
ప్రైవేటు ఆసుపత్రులు నెలవారీగా చేస్తున్న ప్రసవాల్లో కనీసం పదిశాతం కూడా మించడం లేదనడానికి ఈ లెక్కలే ఉదాహరణ.

# భూ అక్రమణలపై ఉక్కుపాదం

నిర్మల్ : ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమించుకుని ఆపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై జిల్లా యంత్రాంగం కొరడా ఝుళిపిస్తోంది. కలెక్టర్ అభిలాష అభినవ్ చొరవతో జిల్లా కేంద్రంతోపాటు 18 గ్రామీణ మండలాల్లోనూ ప్రభుత్వ భూముల ఆక్రమణలపై దృష్టి సారించింది. తొలుత నిర్మల్, భైంసా, నర్సాపూర్(జి), లోకేశ్వరంలలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూముల సర్వే నిర్వహించగా.. భూ ఆక్రమణలు వెలుగులోకి వచ్చాయి. ఈ మండలాల్లో రూ.11.22 కోట్ల విలువైన 81.59 ఎకరాల ప్రభుత్వ భూములను అధికారులు స్వాధీనం చేసుకుని సంబంధిత ఆక్రమణదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. మిగతా మండలాల్లోనూ ప్రభుత్వ భూముల సర్వే కొనసాగిస్తున్నారు.

**చెరువుల శిఖంపై దృష్టి సారించాల్సిందే**
భూగర్భజలాల పెంపునకు దోహదం చేయడంతోపాటు వందలాది ఎకరాలకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో నిర్మల్‌ను పాలించిన రాజులు తవ్వించిన చెరువులు కొంతమంది అక్రమార్కులు చేస్తున్న శిఖం కబ్జా కారణంగా అవి అస్తిత్వాన్ని కోల్పోతున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు మండలాల్లోని చాలా ప్రాంతాల్లోని తటాకాల శిఖం విస్తీర్ణం తగ్గిపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం ఉండటం లేదు. చారిత్రక పట్టణంగా పేరున్న నిర్మల్‌లోని గొలుసుకట్టు చెరువు శిఖం భూముల కబ్జా పర్వం కొనసాగుతూనే ఉంది. కొద్ది రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ చెరువు కొంత శిఖం భూమిని రాజకీయ పలుకుబడి ఉన్న కొంతమంది తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఇక్కడ శిఖం చుట్టూ రక్షణగా సిమెంటు స్తంభాలు ఏర్పాటుచేసినా వాటి లోపల మొరం పోసి ఆక్రమిస్తున్నారు. **చర్యలు తీసుకుంటాం: అభిలాష అభినవ్, జిల్లా కలెక్టర్**ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు నాలుగు మండలాల్లో ప్రభుత్వ భూముల ను గుర్తించి స్వాధీనం చేసుకున్నాం. జిల్లాలోని ప్రభుత్వ, రెవెన్యూ, అటవీ భూములు, చెరువు శిఖం, సాగునీటి ప్రాజెక్టులు, కాలువల భూముల ఆక్రమణలు జరగకుండా వాటి పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటాం.

# ఇందిరమ్మ ఇళ్లకు సి'మంట'

కరీంనగర్ : సిమెంట్ ధరల పెరుగుదల ప్రభావం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపై పడనుంది. ఇప్పటికే స్థలం ఉండి ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పనులు ప్రారంభిస్తున్నా పెరిగిన సిమెంట్ ధరలపై ఆందోళన చెందుతున్నారు. సిమెంట్ బస్తా ధర దాదాపు రూ.30 నుంచి రూ.50 వరకు పెరిగినట్లు రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మండలానికి ఒకటి చొప్పున 60 పైలట్ గ్రామాలను ఇందిరమ్మ పథకానికి ఎంపిక చేశారు. సర్వే అనంతరం 6,416 ఇళ్లను మంజూరు చేశారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ప్రభుత్వం ఇవ్వనుండగా 600 చదరపు అడుగులలోపే నిర్మించుకోవాలి. ఈ క్రమంలో ఒక ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి అయ్యేవరకు దాదాపు 200ల బస్తాల సిమెంట్ అవసరం ఉంటుందని అధికారులు ఇంటి నిర్మాణ ప్రణాళికలో పేర్కొన్నారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన సమయంలో సిమెంట్ బస్తా ధర రూ.280 నుంచి రూ.330ల వరకు ఉండేది. తరవాత రూ.30 నుంచి రూ.50 వరకు ధర పెరగడంతో రూ.320 నుంచి రూ.380 వరకు చేరుకున్నాయి. దీంతో ఇంటి విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో లబ్ధిదారుడికి రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు అదనపు భారం పడే అవకాశం ఉంది. ప్రభుత్వం తక్కువ ధరకు సిమెంట్ సరఫరా చేస్తే ఈ ఇబ్బంది ఉండదని లేకుంటే అదనపు భారం తప్పదని లబ్ధిదారులు వాపోతున్నారు.
మధ్య తరగతిపైనా.. ఉమ్మడి జిల్లాలో ఏటా 5 వేలకుపైగా ఇళ్లు నిర్మితమవుతుంటాయి. ఇందులో మధ్య తరగతి వారే 80 శాతం ఉంటారు. ఏటా వేసవికి ముందు ఇళ్ల నిర్మాణం ప్రారంభించి వర్షాకాలంలోగా పూర్తి చేయడానికి ఎక్కువ శాతం మంది ఏర్పాట్లు చేసుకుంటుంటారు. ఈ క్రమంలో ఈ సంవత్సరం కూడా వేలల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. సిమెంట్ ధరలు పెరగడంతో వారందరిపైనా భారం పడే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు దాదాపు 50 వేల సిమెంట్ బస్తాలు విక్రయిస్తుంటామని వ్యాపారులు చెబుతున్నారు.

# మునక పొలం.. వెనుక బేరం

నందికొట్కూరు : శ్రీశైల జలాశయం వెనుక జలాల్లో 'భూ'పంచాయితీలు తారస్థాయికి చేరాయి. నదిలో నీటి నిల్వ తగ్గడంతో మైదాన ప్రాంతంగా మారింది.. ఒండ్రు మట్టితో కూడుకుని ఉన్న ఆయా భూముల్లో పంటలు సాగు చేసుకొంటున్నారు. పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువగా ఉండటంతో సొంతం చేసుకోవడానికి రైతుల మధ్య పోటీ పెరిగింది. ఈ కారణంగా వారి మధ్య వివాదాలు తలెత్తి ఘర్షణలు జరుగుతున్నాయి. డిమాండ్ పెరగడంతో మరికొందరు అనధికారికంగా పొలాలను విక్రయిస్తున్నారు.

**ఏటా తేల్చని అధికారులు**

శ్రీశైలం జలాశయం నిర్మాణానికి పూర్వం కొత్తపల్లి మండలంలోని జానాలగూడెం, బలపాలతిప్ప, సిద్ధేశ్వరం గ్రామాల్లో సుమారు 250 కుటుంబాల వారు నివసించే వారు. వీరు 1,300 ఎకరాల భూమిని సాగు చేసుకునే వారు. ముంపు తర్వాత పునరావాస ప్రాంతాల్లో స్థిరపడ్డారు. నీరు తగ్గి తర్వాత పంటలు సాగు చేసుకొంటున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన మరికొందరు ఆయా గ్రామాలకు చేరుకొని అవన్నీ మా భూములే అంటూ పంచాయితీలు చేస్తున్నారు. గతేడాది ఈ అంశం అధికారుల దృష్టికి వెళ్లడంతో 145 సెక్షన్ విధించి సాగు ఆపేశారు. వాటిని నమ్ముకొన్న కుటుంబాలకు జీవనాధారం కరవైంది. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విన్నవిస్తున్నారు.

**అక్రమంగా విక్రయాలు**



నీటి ముంపు నుంచి తేలిన పొలాల్లో భూసారం ఎక్కువగా ఉండటంతో విత్తనం వేస్తే చాలు మంచి పంట దిగుబడి వస్తోంది. ఆయా భూముల్లో మొక్కజొన్న, మినుము, శనగ, కంది, పొగాకు పంటలు సాగు చేస్తున్నారు.

**రెండు పంటలు పండించుకుంటారు.**

ముంపు నుంచి బయటపడే సమయాన్ని బట్టి పొలాలకు ధర నిర్ణయిస్తున్నారు. ఎకరం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు కౌలుకు ఇస్తున్నారు. నది గర్భంలో ఉన్న పొలాలకు కౌలు ఎకరం రూ.5 వేలు పలుకుతోంది. నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా మండలాల పరిధిలో సమస్యలు లేని భూములను స్థానికులు ఎకరం రూ.లక్ష నుంచి రూ.3 లక్షలకు విక్రయించారు. రూ.10 వేల వరకు కౌలు వసూలు చేస్తున్నారు. ఈ మూడు మండలాల్లో సుమారు 200 ఎకరాల వరకు విక్రయించినట్లు సమాచారం. వీటికి రిజిస్ట్రేషన్లు లేకున్నా కాగితంపై రాసుకుని విక్రయాలు సాగిస్తున్నారు.

**63 గ్రామాలు.. 35 వేల ఎకరాలు**

నందికొట్కూరు నియోజకవర్గంలో 63 గ్రామాలు శ్రీశైలం జలాశయం నిర్మాణ సమయంలో ముంపునకు గురయ్యాయి. వాటి పరిధిలో సుమారు 35 వేల ఎకరాల వరకు పొలం ఉంటుంది. ఆయా భూములు జులై నుంచి నవంబరు వరకు నీటిలో మునిగి ఉంటాయి.
డిసెంబరు మొదటి వారం నుంచి కృష్ణానదిలో క్రమంగా నీరు తగ్గిపోయి భూములు తేలుతాయి. నిర్వాసితుల్లో చాలామంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇక్కడే ఉన్న కొందరు ఆయా భూముల్లో ఏటా పంటలు సాగు చేసుకొంటారు.
మునక భూములు సారవంతంగా ఉండటంతో పంటల దిగుబడి అధికంగా వస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని అక్రమార్కులు వాటిని సొంతం చేసుకొనే పనిలో పడ్డారు. గ్రామాలు వదిలివెళ్లిన వారు తిరిగొచ్చి తమ భూములు తామే సాగు చేసుకుంటామనడంతో ముంపు గ్రామాల్లో గొడవలకు దారి తీస్తోంది.

# ఏమీ లేదు గర్వకారణం

గిద్దలూరు : వైద్య విధాన పరిషత్ వైద్యశాల పరిధిలోని ప్రాంతీయ, సామాజిక ఆరోగ్య కేంద్రం, మాతా శిశు వైద్యశాలల్లో అందిస్తున్న సేవలు, రోగుల సంఖ్య, వసతుల ఆధారంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ప్రతి నెలా ఆసుపత్రులకు గ్రేడ్‌లను కేటాయిస్తారు. జిల్లాలో వైద్యవిధాన పరిషత్ వైద్యశాల పరిధిలో 2 ప్రాంతీయ వైద్యశాలలు, ఒంగోలు మాతాశిశు వైద్యశాల, మరో ఎనిమిది సామాజిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఏప్రిల్ నెలకు సంబంధించి వీటిలో ఏ ఒక్కటీ ఎ గ్రేడ్ సాధించలేదు. యర్రగొండపాలెం ప్రాంతీయ వైద్యశాలకు, కొండపిలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి మాత్రమే బి గ్రేడ్ దక్కింది. మిగిలిన గిద్దలూరు ప్రాంతీయ వైద్యశాల, ఒంగోలు మాతాశిశు వైద్యశాల, కనిగిరి, కంభం, చీమకుర్తి, దోర్నాల, దర్శి, పామూరు, పొదిలి సామాజిక ఆరోగ్య కేంద్రాలు సి గ్రేడ్‌తో సరిపుచ్చుకున్నాయి.

**ఇవీ వేధిస్తున్న వెతలు:**

కూటమి ప్రభుత్వం స్పెషలిస్టు వైద్యులను నియమించింది. అదే సమయంలో పూర్తిస్థాయిలో అధునాతన పరికరాలు అందుబాటులో లేకపోయాయి. దీంతో రోగులకు శస్త్రచికిత్సలు చేయలేని పరిస్థితి.
గత ప్రభుత్వం ప్రైవేట్ వైద్యశాలల్లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కాన్పులు, సిజేరియన్లకు అవకాశం కల్పించింది. దీంతో ప్రసవాల కోసం గర్భిణులను వారి కుటుంబ సభ్యులు ప్రైవేట్ వైద్యశాలలకు తీసుకెళ్లేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్య తగ్గిపోయింది. జిల్లాలోని పలు వైద్యశాలల్లో వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. పామూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే యంత్రం మూలకు చేరింది. దోర్నాల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే యంత్రం అందుబాటులో లేదు. పొదిలి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే యంత్రం మంజూరైనప్పటికీ వినియోగంలోకి తేలేదు.
గత వైకాపా పాలనలో గిద్దలూరు వైద్యవిధాన పరిషత్ వైద్యశాల భవనాన్ని గుత్తేదారుడు అసంపూర్తిగా నిర్మించి అప్పగించారు. కంటి శస్త్రచికిత్స, ఎముకల చికిత్స విభాగం, చెవి, ముక్కు, గొంతు విభాగాలకు చెందిన శస్త్ర చికిత్స పరికరాలు అందుబాటులోకి రావాల్సి ఉంది.
నిధులకు చొరవ చూపితే మేలు: వైద్యశాలల్లో మౌలిక వసతులతో పాటు, అధునాతన పరికరాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాల్సి ఉంది.
కంభం, దర్శి, దోర్నాల, పామూరు, పొదిలి సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో జనరేటర్ల ఏర్పాటుకు రూ.60 లక్షలు అవసరం. దర్శి, దోర్నాల, కొండపి, పొదిలి సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో డిజిటల్ ఎక్స్‌రే క్యాస్ట్ రీడర్ ఏర్పాటుకు రూ.32 లక్షలు కావాలి. గిద్దలూరు, యర్రగొండపాలెం ప్రాంతీయ వైద్యశాలల్లో చెవి, ముక్కు, గొంతు సేవల విభాగానికి శస్త్ర చికిత్సల పరికరాల కోసం రూ.88.72 లక్షలు ఇవ్వాలి. కంటి చికిత్సల పరికరాల కోసం రూ.36.20 లక్షలు, ఎముకల విభాగం పరికరాల కోసం రూ.47 లక్షల నిధుల అవసరం. ఈ మేరకు జిల్లా అధికారులు రాష్ట్ర వైద్యశాఖ ఉన్నతాధికారులకు నివేదించారు. ఖాళీగానే పోస్టులు: జిల్లా వ్యాప్తంగా వైద్యవిధాన పరిషత్ వైద్యశాల పరిధిలో 21 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, పదోన్నతి ద్వారా వచ్చే డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులు 19, జనరల్ మెడిసిన్ పోస్టులు 2, సీఎస్ఆర్ఎంవో 2 ఖాళీగా ఉన్నాయి.

# ఆకర్షణ మాయలో.. అకృత్యాల వేటలో!



అనంతపురం : బడికి వెళ్తున్న బాలికను ఓ యువకుడు ప్రేమ పేరుతో లొంగదీసుకున్నాడు. మోసగించి అత్యాచారం చేశాడు. ఆ దురాగాతాన్ని వీడియోల్లో చిత్రీకరించి.. వాటిని అడ్డం పెట్టుకుని మరికొందరు బాలికపై అత్యాచారపర్వం సాగించారు. ఇటీవల బాధితురాలు గర్భం దాల్చడంతో ఈ దారుణ విషయాలు వెలుగులోకి వచ్చాయి. శ్రీసత్యసాయి జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లాలో మైనర్లపై జరుగుతున్న అకృత్యాలు ఆందోళన కల్గిస్తున్నాయి. ఆకర్షణల వలలో చిక్కుకుని కొందరు విలవిలలాడుతున్నారు. సామాజిక మాధ్యమాలు, సినిమాల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. అదే సమయంలో సంరక్షణ, పెంపకం పరంగా తల్లిదండ్రుల శ్రద్ధ లోపిస్తోంది. నైతిక విలువలు, క్రమశిక్షణ లోపించి మైకం కమ్మేసిన కొంతమంది యువకులు ప్రేమ పేరుతో ఇష్టారాజ్యంగా బాలికలపై అమానవీయ చర్యలకు పాల్పడుతున్నారు. టీనేజీ ప్రేమ ఆకర్షణే తప్ప అందులో పరిపక్వత ఉండదని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నా పెడచెవిన పెడుతున్నారు. చదువుకోవాల్సిన వయసులో ప్రేమిస్తున్నానని వెంటాడి వేధింపులకు పాల్పడుతూ విలువైన జీవితాన్ని కోల్పోతున్నారు.

**నిజస్వరూపం తెలిశాక..**

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇటీవల పదో తరగతి పూర్తి చేసింది. అదే గ్రామానికి చెందిన మోసగాడి మాటలు నమ్మింది. సర్వం అర్పించింది. తీరా పెళ్లి విషయం తెచ్చేటప్పటికి ఆ యువకుడు ముఖం చాటేశాడు. పోలీసులను ఆశ్రయించగా.. పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని జైలుకు పంపారు.
మరో ఘటనలో పదో తరగతి చదివిన బాలిక చరవాణిలో పరిచయమైన ఓ యువకుడి మాయలో పడి.. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంది. తీరా కాపురానికి వెళ్లాక అక్కడ భర్త, అతని కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేశారు. దిక్కుతోచక తిరిగి నగరానికి చేరుకుని పోలీసులను ఆశ్రయించింది. అప్పటికే ఆమె గర్భిణి.. మైనర్‌ను పెళ్లి చేసుకోవడమే కాకుండా వేధింపులకు గురి చేసిన భర్తపై పోక్సో కేసు నమోదు చేసి కటకటాలకు పంపారు.

**గడప దాటి..**

వారం క్రితం శింగనమల నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంటర్ చదివింది. తల్లిదండ్రులకు తోడుగా కూలి పనులకు వెళ్తుండేది. ఈ క్రమంలో ఓ యువకుని ఆకర్షణకు లోనైంది. ముక్కూ ముఖం తెలియని వాడితో గడప దాటి వెళ్లిపోయింది. ఆ తర్వాత కానీ అమ్మాయికి అతని అసలు స్వరూపం బోధపడలేదు. కేవలం శారీరక సుఖం కోసమే తనకు దగ్గరయ్యాడని గ్రహించి తిరిగి ఇంటికి చేరుకుంది.

**పట్టేదెవరికి?**

పాఠశాలల్లో కేవలం పుస్తకాల పాఠ్యాంశాలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారు. యవ్వన దశలో చోటు చేసుకున్న ఆకర్షణ, ప్రేమ, వాటి పర్యసానాలపై చర్చ జరగడం లేదు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం విద్యాలయాల్లో బాలికలకు అనుకోని ఆపద, ప్రేమ పేరుతో ఎదురయ్యే ఇబ్బందులపై రహస్యంగా వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించేలా.. ఎప్పటికప్పుడు బాలికల సమస్యలు తెలుసుకునేలా ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలని ఆదేశించినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

**లక్ష్యంపై ప్రేరణ నింపాలి**

ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్య నిపుణుడు

ప్రేమ, పెళ్లి పేరుతో ఎదురయ్యే ఆకర్షణ వలలో బాలికలు చిక్కుకోకుండా ఉండేందుకు వారి ప్రవర్తన, కదలికలపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు శ్రద్ధ చూపించాలి. మంచి చెడులను వారికి అర్థమయ్యేలా వివరించాలి. పిల్లల అభిప్రాయాల్ని గౌరవించి సమాజంలో ఎవరితో ఎలా మసలుకోవాలో తెలియజెప్పాలి. ఆకర్షణ వలలో చిక్కుకున్న దారుణ ఘటనల్ని మైనర్లకు తెలపాలి. ఉన్నత లక్ష్యాల వైపు మనసు లగ్నం చేసేలా వారిలో ప్రేరణ నింపాలి. సాధనపై ఏకాగ్రత చూపించే విధంగా నిత్యం కంటిపాపలా చూసుకోవాలి.

# దగ్గరవుతున్న దారి



నంద్యాల : జిల్లా మీదుగా వెళ్లనున్న జాతీయ రహదారి (167కే) పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. కొత్తపల్లి మండలం సిద్ధేశ్వరం నుంచి నంద్యాల వరకు మొదటి విడత పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా రైతుల నుంచి సేకరించిన భూమికి నష్టపరిహారం అందజేస్తున్నారు.. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించనున్నారు. ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ హైదరాబాద్-తిరుపతి ప్రయాణ మార్గాన్ని 70 కి.మీ.లు తగ్గించేందుకు ఈ రహదారి (కల్వకుర్తి-జమ్మలమడుగు)ని ప్రతిపాదించారు. తెలంగాణ రాష్ట్రం కల్వకుర్తి నుంచి జిల్లా సరిహద్దు వరకు రహదారి నిర్మాణ పనులు పూర్తికావొచ్చాయి.

**251 హెక్టార్ల భూసేకరణ** సిద్ధేశ్వరం నుంచి నంద్యాల వరకు ప్రభుత్వ, ప్రైవేట్ కలిపి 620 ఎకరాల భూమిని సేకరించారు. రూ.170 కోట్ల పరిహారానికి గానూ ఇప్పటికే రూ.100 కోట్లు నిర్వాసితుల ఖాతాల్లో జమ చేశారు. 90 శాతం నష్టపరిహారం అందించిన వెంటనే పనులు ప్రారంభిస్తారు. ఇప్పటి వరకు 75 శాతం పరిహారం పంపిణీ పూర్తయ్యింది.
ప్యాకేజీ-4లో భాగంగా 62.77 కి.మీల పొడవునా నిర్మించే ఈ రోడ్డుకు రూ.776.65 కోట్ల అంచనాతో టెండర్లు పిలిచారు. అనంతపురానికి చెందిన ఓ గుత్తేదారు సంస్థ పనులు దక్కించుకొంది.

**ప్యాకేజీ-3, 5లపై తర్వాత నిర్ణయం**

జాతీయ రహదారి 167కేలో భాగంగా ప్యాకేజీ-1 కింద తెలంగాణలో ఇప్పటికే పనులు ప్రారంభం కాగా, ప్యాకేజీ-2 కింద ఐకానిక్ వంతెనకు టెండర్లు పూర్తి చేశారు. ప్యాకేజీ-4కు సంబంధించి టెండర్లు పూర్తయ్యాయి. ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు పూర్తి కాగా ఖరారు చేయాల్సి ఉంది.
ప్యాకేజీ-3కి సంబంధించి నల్లకాల్వ-వెలుగోడు మధ్య నిర్మించే రోడ్డుకు టెండర్లు పిలవలేదు. అటవీ ప్రాంతంలో నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండటంతో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు ఇవ్వాలి. ప్యాకేజీ-5 కింద నంద్యాల-జమ్మలమడుగు రహదారి ఉంది. ఇక్కడ భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోంది.

# తంగడంచను తుంచారు



నందికొట్కూరు : జాతీయ, రాష్ట్రస్థాయిల్లో పేరొందిన తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రం భూముల్ని ఆక్రమించేస్తున్నా...అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే కొందరు దుకాణాలు, ఆలయాల్ని నిర్మించేశారు. కొన్నిచోట్ల మట్టిని తవ్వి యథేచ్ఛగా తరలిస్తున్నా..అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రం 1653 ఎకరాల్లో ఏర్పాటైంది. ఇందులో ఉద్యానవనానికి 26 ఎకరాలు కేటాయించగా, మూడెకరాల్లో సపోటా, మామిడి పెంచేవారు. ప్రస్తుతం అవన్నీ కనుమరుగై సుమారు మూడెకరాల్లో చెట్లు దర్శనమిస్తున్నాయి. వైకాపా పాలనలో ఉద్యానవనానికి కేటాయించిన భూమిలో కొంత జగనన్నకాలనీకి కేటాయించారు. మిగిలిన భూమి నిరుపయోగంగా మారింది. విత్తనోత్పత్తి క్షేత్రానికి చెందిన మిగిలిన భూమిలో సుమారు 20 ఎకరాల్లో కార్యాలయాలు, షెడ్లు నిర్మించారు. మరో అయిదెకరాల్లో సిబ్బంది కోసం క్వార్టర్స్ నిర్మించారు. జైన్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 623 ఎకరాలు, మెగాసీడ్ హబ్‌కు 500 ఎకరాలు, ఏపీఐఐసీకి 200 ఎకరాలు కేటాయించారు. ప్రస్తుతం రాష్ట్ర విత్తనోత్పత్తి క్షేత్రానికి 177 ఎకరాల భూమి మాత్రమే ఉండగా, ఇందులో సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో కంది, సెనగ విత్తనోత్పత్తి చేస్తున్నారు. ఇప్పటికే కేజీ రహదారి వెంట దుకాణాలు వెలిశాయి. కొన్ని ఆలయాల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలుసుకుని తంగడంచ విత్తనోత్పత్తి సహాయ సంచాలకులు ఇక్కడ స్థలాలకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేశారు. తంగడంచ విత్తనోత్పత్తి కార్యాలయం సమీపాన క్షేత్రానికి సంబంధించిన భూముల్లో మట్టి తవ్వకాల దందా సాగుతోంది. సుమారు 100 ట్రిప్పుల వరకు మట్టిని తరలించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఈ భూముల్లో ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేస్తుండటంతో భారీగా గుంతలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాష్ట్ర విత్తనోత్పత్తి క్షేత్రానికి సంబంధించిన భూములు, స్థలాల్ని కాపాడాలని స్థానికులు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

# నిధి వెక్కిరింత.. విస్తరణ తీరని చింత

బనగానపల్లి : కుందూ నది విస్తరణ పనుల పేరుతో గత వైకాపా ప్రభుత్వం హడావుడి చేసింది. పెద్దఎత్తున నిధులు కేటాయించినట్లు గొప్పలు చెప్పింది. అధికారులు టెండర్లు పిలిచి గుత్తేదారులకు అప్పగించారు. కొంతమేర పనులు చేపట్టినా బిల్లులు మంజూరు చేయలేదు. దీనికితోడు భూసేకరణ పనులు ముందుకు సాగలేదు. ఫలితంగా ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయి.
బనగానపల్లి మండల పరిధిలోని టంగుటూరు గ్రామం నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు సమీపంలోని పెన్నా నది వరకు 187 కి.మీ. మేర కుందూ నది విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. నదికి సంబంధించి రెండు వైపులా కలిపి 130 మీటర్ల మేర విస్తరించి 35 వేల క్యూసెక్కుల నీరు వైఎస్సార్ జిల్లాలో ప్రవహించే పెన్నా నదిలో పంపేలా అప్పట్లో అధికారులు ప్రణాళికలు రూపొందించారు. దీనికిగాను గత ప్రభుత్వం రూ.1,758 కోట్లు కేటాయించింది. 2021, మార్చి 31న పనులకు శ్రీకారం చుట్టారు.
ప్రస్తుతం 18 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో ప్రవహించే కుందూ



నదిని 35 వేల క్యూసెక్కులకు పెంచేలా పనులు చేపట్టారు. ఈ నిధులతోనే కోవెలకుంట్ల సమీపంలోని జొలదరాశి వద్ద 0.80 టీఎంసీ నీటిని నిల్వ చేసేలా ఒక ప్రాజెక్టు, చాగలమర్రి సమీపంలోని రాజోలి వద్ద 3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో మరో ప్రాజెక్టు నిర్మించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టులు దాటి మిగులు జలాలను పెన్నా నదిలోకి తీసుకెళ్తారు. ఏటా వర్షానికి కుందూలో నీరు ఉద్ధృతంగా ప్రవహించి సమీపంలోని పొలాలను ముంచెత్తుతోంది. విస్తరణ పనులు పూర్తి చేస్తే రైతులకు ఎలాంటి నష్టం జరగదు. నీరు సాఫీగా ప్రవహిస్తుంది.

**భూసేకరణ చేయకనే..**

2019 డిసెంబరులో జొలదరాశి జలాశయం, కుందూ నది విస్తరణ పనులకు వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం నెలటూరులో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 8 వేల ఎకరాల వరకు భూసేకరణ చేయాల్సి ఉంది. కానీ ఆ ఊసే లేకుండా పనులు ప్రారంభించేశారు. కుందూ ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూముల్లో మాత్రమే పనులు చేశారు. దీనికితోడు చేసిన పనులకు బిల్లులు మంజూరుకాకపోవడంతో గుత్తేదారులు చేతులెత్తేశారు. ఈ విషయమై ఈఈ సురేశ్‌బాబు మాట్లాడుతూ అప్పటి ప్రభుత్వ ఆదేశాలమేరకు పనులు ప్రారంభించామని చెప్పారు. మొదట్లో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు ఆపేశారని చెప్పారు. ఇప్పటివరకు రూ.100 కోట్ల విలువైన పనులు మాత్రమే చేశారని వివరించారు. తాజా పరిస్థితిని కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

**ఏటా పంట నష్టమే – శేఖర్, పొట్టిపాడు**

గ్రామంలో కుందూ ఒడ్డున ఆరెకరాల పొలం ఉంది. ఏటా భారీ వర్షాలకు కుందూలో వరద ప్రవాహం పెరిగి పొలాలు మునిగిపోతున్నాయి. వరి పంటకు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టం వస్తోంది. కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని విస్తరణ పనులు పూర్తి చేస్తే మా కష్టాలు తీరుతాయి.

# ఖరీఫ్‌కు ఢోకా లేదు

బొబ్బిలి: ఇటీవల కురిసిన వర్షాలకు జలాశయాల్లో నీటి మట్టాలు పెరిగాయి. గతేడాది మేతో పోల్చితే వట్టిగెడ్డ మినహా మిగిలిన చోట్ల స్వల్పంగా పెరిగాయి. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగునీటికి ఢోకా లేదని ఇంజినీర్లు చెబుతున్నారు. జూన్ నుంచి వర్షాలు ప్రారంభమైతే పూర్తిస్థాయి నీటి మట్టాలు చేరి, పూర్తి ఆయకట్టుకు నీరందే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఎన్నడూ లేనివిధంగా మే నెలలో కురిసిన వర్షాలతో నీరు చేరిందని ఈఈ అప్పలనాయుడుతో అన్నారు.

**తాగునీటి గండం గట్టెక్కినట్లే!**

జలాశయాల్లో నీటి మట్టాలు పెరగడంతో తాగునీటి కష్టాలు కూడా



దాదాపు గట్టెక్కినట్లే. వేగావతి నదిపై సాలూరు, బొబ్బిలి పురపాలక సంఘాల తాగునీటి పథకాలు ఉన్నాయి. వీటితోపాటు మరో 110 గ్రామాల ప్రజల దాహార్తి తీర్చే పథకాలున్నాయి. గతేడాది వేగావతిలో నీరు ఇంకిపోవడంతో పైన పెద్దగెడ్డ జలాశయం గేట్లు ఎత్తితే నదిలోకి నీరు వచ్చింది. దీంతో తాగునీటి ఇబ్బందులు తప్పాయి. ఈ ఏడాది ఆ పరిస్థితులు తలెత్తే అవకాశాలు లేవంటున్నారు. అలాగే సువర్ణముఖి నదిలో మరో 80 గ్రామాలకు చెందిన పథకాలు ఉన్నాయి. నాగావళి నదిలో పార్వతీపురం పట్టణ తాగునీటి పథకాలతోపాటు సుమారు 100 గ్రామాలకు చెందిన పథకాలు ఉన్నాయి. రిజర్వాయర్లలో నీరు చేరడంతో ఇబ్బందులు లేనట్లేనని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు అంటున్నారు.

# జీవాల దాహార్తి.. తొట్టెలతో స్వస్తి

పుంగనూరు : కూటమి ప్రభుత్వం నీటితొట్టెల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఉపాధిహామీ పథకం కింద ఏప్రిల్ మొదటి వారంలో తొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఉద్యాన పంటల సాగు అధికం. ముఖ్యంగా టమాటా, మామిడి, ఇతర కూరగాయ పంటలు సాగు చేస్తున్నారు. వీటికి అనుబంధంగా పాడి పరిశ్రమ ఉంటుంది. ఆవులు, గెదేలు పెంచి పాలు విక్రయిస్తుంటారు. అయితే ప్రస్తుతం టమాటా ధరలు పతనం కావడంతో రైతులు పాడిపైనే ఆధారపడుతున్నారు. నిత్యం పాల నుంచే ఆదాయాన్ని జీవనానికి వినియోగిస్తున్నారు. ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.33 వేలతో పనులు ప్రారంభించారు. జిల్లాలోని 700 పంచాయతీలకు 1,751 నీటి తొట్టెలు మంజూరయ్యాయి. 5 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు, 2 అడుగుల లోతుతో నిర్మిస్తారు. ఇప్పటి వరకు అధికారులు 579 పూర్తి చేశారు. మిగిలిన 1,172 వివిధ దశల్లో ఉన్నాయి.

# అంతొద్దు.. తగ్గిస్తే మేలు!

అనకాపల్లి : రోజుకు ఒక చెంచా పరిమాణంలో నూనె వాడితే ఆర్యోగం. అంటే నలుగురు కలిగిన ఒక కుటుంబం నెలకు రెండు లీటర్లలోపు వాడాలన్నమాట. మరి జిల్లాలో ఎంత వాడుతున్నారో తెలుసా? ఒక్కో కుటుంబం సగటున నాలుగు లీటర్లు వాడుతోంది. అంటే వాడాల్సి నదానికన్నా రెట్టింపు. మారుతున్న ఆహారపు అలవాట్ల కారణంగా ఏటా వినియోగం 2.5 నుంచి 2.75 శాతం పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఏ వంట చేయాలన్నా తైలం తప్పనిసరి, ఎక్కువైన కొద్దీ ఊబకాయం, మధుమేహం, గుండె సంబంధ వ్యాధుల బారినపడే ప్రమాదముంది. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగంలో పొదుపు పాటించాలని సూచిస్తున్నాయి. ఈ మేరకు



ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. నాలుగు నెలల క్రితం నిర్వహించిన మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ స్వయంగా ప్రతి ఇంటా వంటనూనె వినియోగాన్ని కనీసం పదిశాతం తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల నిర్వహించిన హెల్త్ బులెటటిన్ పవర్ ప్రజెంటేషన్‌లో వంట నూనె వినియోగం గణనీయంగా తగ్గించాలని సూచించారు.

జిల్లా జనాభా: 17.27 లక్షలు (2011 లెక్కల ప్రకారం)
ప్రస్తుత జనాభా: 18.10 లక్షలు (అంచనా)
కుటుంబాలు: 4.52 లక్షలు
నూనె వినియోగం సగటున నెలకు: 18 లక్షలు

# నాడు నిర్వాకం.. నేడు నిష్ఫలం

మునగపాక: గత వైకాపా ప్రభుత్వ పాలకుల అనాలోచిత నిర్ణయాల మూలంగా కోట్లాది రూపాయలు నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. అవసరం లేకపోయినా భారీ స్థాయిలో నిర్మాణాలు చేపట్టారు. పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయక అసంపూర్తిగానే విడిచిపెట్టారు. అందుకు ఉదాహరణగా మునగపాక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో రూ. 98 లక్షలతో చేపట్టిన నాడు-నేడు అభివృద్ధి పనులే నిలుస్తాయి. ఈ పాఠశాలలో మూడు నుంచి పదో తరగతి వరకు 371 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. విద్యార్థులకు సరిపడా 19 గదులున్నా గత వైకాపా ప్రభుత్వం నాడు-నేడు రెండోవిడతలో పది అదనపు భవనాల నిర్మాణానికి రూ. 1.15 కోట్ల నిధులు మంజూరు చేసింది. భవనాల నిర్మాణానికి పాఠశాలలో స్థల సమస్య ఏర్పడింది. ముందు ఐదు తరగతి గదుల నిర్మాణం



చేపట్టారు. ప్రభుత్వమే సిమెంటు సరఫరా చేసేది. తరగతి గదులకు శ్లాబ్ వేశారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేశారు. భవన నిర్మాణ కోసం సరఫరా చేసిన వందలాది సిమెంటు బస్తాలు గడ్డకట్టి పాడైపోయాయి. మరోవైపు ఏడాదిగా భవనాలు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి.

గత ప్రభుత్వం నిధులు పూర్తిగా ఇవ్వకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయి. పాఠశాలలో నిల్వ ఉండి గడ్డకట్టిన సిమెంటు బస్తాలు ఈ పాఠశాలకు చెందినవి కావు.
శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు

నిర్మాణ పనులకు నిధులకు బదులు సిమెంటు మంజూరు చేయడం... పనులు సకాలంలో పూర్తి చేయకపోవడం వల్ల మునగపాక పాఠశాలతోపాటు జిల్లాలో పలుచోట్ల భవనాల సిమెంటు గడ్డకట్టి పాడైపోయింది. నిధులు మంజూరైన మేరకు పనులు చేశాం.
చంద్రరావు, సమగ్ర శిక్షా అభియాన్ ఏఈ

# ఎత్తిపోయిందోచ్..!

పుత్తూరు : పుత్తూరు, పిచ్చాటూరు పౌరసరఫరాల శాఖ గోదాములో జరిగిన రేషన్ బియ్యం కుంభకోణం నీరుగార్చారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది సెప్టెంబరు 25న పౌర సరఫరాల శాఖ అధికారుల తనిఖీల్లో 205 టన్నుల రేషన్ బియ్యం పక్కదారి పట్టినట్లు తేలింది. ఈ మేరకు ఆ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు రంగంలోకి దిగి సీఎస్ డీటీని అరెస్టు చేసి చేతులు దులుపుకోవడంపై విమర్శలు ఉన్నాయి. పుత్తూరు, పిచ్చాటూరు గోదాం సీఎస్ డీటీగా ఉన్న విష్ణు 205 టన్నుల రేషన్ బియ్యం గోదాము నుంచి నేరుగా అక్రమార్కులకు అమ్మేశారు. రూ. 2.05 కోట్లు అవినీతి జరిగినట్లు నిగ్గు తేల్చారు. పుత్తూరు పౌరసరాలశాఖ గోదాము పరిధిలో పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట మండలాలు, 109 చౌక దుకాణాలు ఉన్నాయి. ప్రతి నెలా వీటికి ఈ గోదాము నుంచి 25 వేల బస్తాల బియ్యం డీలర్లకు అందజేస్తుంటారు. ఈ క్రమంలోనే అవినీతి చోటుచేసుకుంది. దీనిపై సివిల్ సప్లైస్ డీఎం సుమతి గతేడాది అక్టోబర్ 12న పోలీసులకు ఫిర్యాదు చేయగా డీటీ విష్ణును అరెస్టు చేశారు. ఆ తర్వాత కేసులో పురోగతే లేదు. ఈ అక్రమాల్లో కడప, నగరికి చెందిన నలుగురు ఉన్నట్లు విలేకరుల సమావేశంలో పోలీసులు ప్రకటించినా నేటికీ చర్యలు శూన్యం.

**అంతా గోప్యమే..**

పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు హడావుడి చేసే అధికారులు రూ. 2.05 కోట్లు బియ్యం పక్కదారి పట్టిన విషయాన్ని చాలా గోప్యంగా ఉంచారు. ఇదంతా వారికి తెలిసే జరిగి ఉంటుందని, ఒక్క సీఎస్ టీడీని బలిపశువును చేసి మిగిలిన వారు తమకేమీ సంబంధం లేనట్లు తప్పుకొన్నారనే విమర్శలున్నాయి. అక్రమార్కులు తమ పలుకుబడితో పోలీసు అధికారులపై ఒత్తిడి తెచ్చి కేసు నీరుగార్చారనే ప్రచారం జరుగుతోంది.

# కుంభకోణాల కథ కంచికా.. అక్రమార్కుల మంచికా!!



విశాఖపట్నం: విశాఖ కేంద్రంగా జరిగిన కుంభకోణాలపై అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. విజిలెన్స్, సీఐడీ విచారణకు ఆదేశించడంతోపాటు, కొన్ని కమిటీలు వేశారు. అయితే ఈ విచారణలు నత్తనడకన సాగుతున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న అక్రమాల డొంక కదలాలంటే విచారణ త్వరతిగతిన పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉంది.

డెయిరీ గుట్టు విప్పితేనే: విశాఖ డెయిరీలో అక్రమాలపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో అసెంబ్లీ సభా సంఘం ఛైర్మన్ జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ఈఏడాది మార్చిలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డెయిరీ ఆధ్వర్యంలో భూములు, పాడి రైతులకు డబ్బులు తగ్గించి ఇవ్వడం, ఏడాదిలో నైపుణ్యశిక్షణ పేరుతో రూ. 12కోట్లు ఖర్చు చూపడం వంటి పలు అంశాలపై పరిశీలించారు. ఆ తర్వాత డెయిరీ ఛైర్మన్ ఆనంద్‌కుమార్ భాజపాలో చేరారు. కమిటీ మరోసారి పరిశీలిస్తుందని, త్వరలో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తామని చెప్పినా జాప్యమవుతోంది. వైకాపా హయాంలో నాలా పన్ను రూ. 680కోట్ల మేర ఎగవేసినట్లు వెలుగులోకి వచ్చింది. దీనిపై విజిలెన్స్ ఆరా తీసినా నివేదికలు సిద్ధం చేయలేదు. భీమిలిలో విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి సీఆర్‌జెడ్ నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో తీరంలో ఆక్రమణలపై నిపుణుల కమిటీ వేసి నివేదికలివ్వాలని హైకోర్టు ఆదేశించింది.

తెర వెనుక పెద్దలెవరో తేల్చితే: నిషిద్ధ జాబితా (22ఏ) నుంచి తొలగించిన భూముల (ఫ్రీహోల్డ్) వ్యవహారంలో ఉత్తరాంధ్రలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయి. జీవో విడుదల కాకముందే కొందరు రైతుల నుంచి ఎసైన్డ్ భూములు కొనేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో అప్పటి ప్రభుత్వంలోని కీలక అధికారిపైనా, ముఖ్య నేతలపైనా ఆరోపణలొచ్చాయి. విశాఖలో ఆనందపురం, భీమిలి, పద్మనాభం, విజయనగరం జిల్లాలో భోగాపురం మండలాల పరిధిలో ఎక్కువగా ఒప్పందాలు సాగాయి. 2023 డిసెంబరు నుంచి 2024 మే 9న ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు 136 ఎకరాల ఫ్రీహోల్డ్ భూములు రిజిస్ట్రేషన్ అయి చేతులు మారాయి. ఇంకా వందల ఎకరాలపై అగ్రిమెంట్లు ఉన్నాయి. కూటమి అధికారంలోకి రాగానే ఆ భూముల రిజిస్ట్రేషన్లు నిలిపి వేసి విచారణకు ఆదేశించినా... తెరవెనుక మంత్రాంగం సాగించిన పెద్దలెవరో తేలలేదు.

**ఓవైపు ఇలా.. మరోవైపు మంజూరా?**

గత వైకాపా హయాంలో విశాఖలో రూ. 1,800కోట్ల విలువైన 700పైగా టీడీఆర్ బాండ్లు మంజూరు చేశారు. సిరిపురం వద్ద సీబీసీఎన్సీ స్థలంలో వైకాపా మాజీ ఎంపీ ఎంవీవీ నిర్మిస్తున్న ప్రాజెక్టు వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డు పేరుతో రూ. 63కోట్ల టీడీఆర్ కట్టబెట్టారు. రేవెళ్లపాలెం రోడ్డును పదిహేనేళ్ల కిందట అభివృద్ధి చేస్తే, అందులో స్థలాలు కోల్పోయామంటూ కొందరు వైకాపా నేతలు చక్రం తిప్పి రూ. 209కోట్ల బాండ్లపై కన్నేశారు. మురికివాడల్లో సైతం వదలకుండా బాండ్లు మంజూరు చేయించుకున్నారు. కూటమి ప్రభుత్వం వీటిపై విజిలెన్స్, సీఐడీ విచారణకు ఆదేశించగా, సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. మరోవైపు... విచారణ జరుగుతున్న వివాదాస్ప బాండ్ల వ్యవహారంలో కొందరు కూటమి నాయకులతో వైకాపా నేతలు చేతులు కలిపారు. వాటి ఆమోదానికి దస్త్రాలు కదిలేలా చేస్తున్నారనేది చర్చనీయాంశంగా మారింది.

# విశిష్టత తెలిసేలా.. పర్యాటకానికి అద్దం పట్టేలా..




అనంతపురం: జిల్లా సంస్కృతి, వారసత్వ సంపద, పర్యాటక ప్రదేశాలు, వనరులను తెలియజేస్తూ అధికారులు కాఫీ టేబుల్ బుక్ రూపొందించారు. తక్కువ సమయంలో జిల్లా స్వరూపాన్ని అర్థం చేసుకునేలా వివరాలను పొందుపరిచారు. అధ్యాత్మిక క్షేత్రాలు, చారిత్రక ప్రదేశాలను చెబుతూనే జిల్లా ఆర్థిక, సామాజిక అంశాలతో పాటు మౌలిక వసతులు, అభివృద్ధిపై పుస్తకంలో వివరించారు. జిల్లాకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించడంతో పాటు.. ఆసక్తిని పెంచాలనే లక్ష్యంతో తీర్చిదిద్దారు. వివిధ ప్రాంతాల విశిష్టతను తెలిపే ఫొటోలను పుస్తకంలో పొందుపరిచారు. జిల్లా పర్యాటకశాఖ ద్వారా ఈ పుస్తకాన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నారు.

**పర్యాటకులను ఆకర్షించేలా..**

జిల్లాలోని పెన్నహోబిలం, బుగ్గరామలింగేశ్వర స్వామి, చింతల వెంకటేశ్వరస్వామి... తదితర పుణ్యక్షేత్రాలు, రాయదుర్గం, గుత్తి, కుందుర్పి కోటల విశేషాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. యాడికి, పంపనూరు, బూదగవి ప్రాంతాల్లో ఆదిమానవుల ఆనవాళ్ల చిత్రాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. జైన సంస్కృతిని ప్రతిబింబించే జంబూద్వీపం, నగరంలోని టవర్ క్లాక్, పురావస్తుశాఖ మ్యూజియం వివరాలను పొందుపరిచారు.

**అవకాశాలను వివరిస్తూ..**

జిల్లాలోని భారీ పరిశ్రమలు, వాటి ఉత్పత్తి సామర్థ్యం వివరాలను సంక్షిప్తంగా ఇచ్చారు. పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి రంగంలో జిల్లా సాధించిన ప్రగతిని వివరించారు. ఉద్యాన పంటల సాగులో రైతులు సాధించిన విజయాలు, భవిష్యత్తులో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ఉన్న అవకాశాలను పుస్తకంలో పొందుపరిచారు. పర్యాటకులను ఆకర్షించడంతో పాటు జిల్లాలో పెట్టుబడులు పెట్టేవారికి ఆసక్తి కలిగించేలా కాఫీ టేబుల్ పుస్తకాన్ని రూపొందించినట్లు అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు.

# దేవుడి మాన్యం మాయం



పత్తికొండ: దేవుడి మాన్యాన్ని చెరబట్టారు... ప్రభుత్వ స్థలాన్ని కాజేశారు.. ఎంచక్కా గదులు నిర్మించారు.. అద్దెలు తీసుకుంటున్నారు.. టవర్ల ఏర్పాటుకు లీజుకిచ్చారు.. తుగ్గలిలో గత ఐదేళ్లుగా వైకాపా నేతల ఆగడాలివి. రెవెన్యూ దస్త్రాల్లో దేవాదాయ, ఇనాం భూములుగా ఉన్న వాటినీ ఆక్రమించి అనుభవిస్తున్నారు. సర్వే నంబర్లు 604/ఎ1, 605/ఎ1, 605/ఎ2, 604/బి1, 605/బితో పాటు మరికొన్ని సర్వే నంబర్లలోని 22 ఎకరాల భూమి కబ్జాకు గురైంది. ఈ విషయమై వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దారుకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. నేటికీ ఎలాంటి చర్యలు లేవు. తుగ్గలి గ్రామంలోని ఆర్‌అండ్‌బీ స్థలాన్ని వైకాపా నాయకులు ఆక్రమించుకొని దుకాణ సముదాయాలు నిర్మించి అద్దెలు వసూలు చేస్తున్నారనేది బహిరంగ రహస్యమే. ఎవరికి వారు ఆయా శాఖల అధికారులు మాత్రం చర్యలు చేపట్టకుండా ఆక్రమణల తతంగం చూస్తూ ఉండిపోతున్నారు. పత్తికొండ- గుత్తి ప్రధాన రహదారి పక్కన స్థలానికి డిమాండ్ ఎక్కువగా ఉంది. ఇక్కడ ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారనే ఆరోపణలు రావడంతో సంబంధిత శాఖ అధికారులు సర్వే చేపట్టారు. వారి స్థలం ఎక్కడి వరకు ఉందో గుర్తిస్తూ రంగులతో మార్కు వేశారు. అక్కడి వరకు తమ పరిధి అని వారు ఆక్రమణదారులకు తాఖీదులు జారీ చేశారు. రహదారులు భవనాల శాఖ పరిధిలోని స్థలంలోనే సెల్ టవర్లు ఏర్పాటు చేసి నిర్వాహకుల నుంచి వైకాపా నాయకులు అద్దెలు వసూలు చేయడంపై స్థానికులు అభ్యంతరం చెబుతున్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలదారులపై ఎలాంటి చర్యలు లేవని వారు ఆరోపిస్తున్నారు. రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు, భూములు అన్యాక్రాంతం కావడంపై వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.“ దేవాదాయ భూములతో పాటు, ప్రధాన రహదారి ఆక్రమించి అద్దె గదులు నిర్మించుకున్నారు. అడ్డగోలుగా అద్దెలు వసూలు చేస్తున్నారు. గ్రామస్థులు ఫిర్యాదు చేసినా.. అధికారులు మాత్రం స్పందించడం లేదు. ఆక్రమణదారులపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి. లేదంటే పోరాటం కొనసాగిస్తామని” – తుగ్గలి నాగేంద్ర పేర్కొన్నారు.

# చెరువులు వెలవెల.. పల్లెలు విలవిల!

ఉండి : భరించలేని ఉక్కపోత.. వేడిగాలులతో అల్లాడుతున్న గ్రామీణ ప్రజలు ఇప్పుడు తాగునీటి కష్టాలతో ఇబ్బందులు పడుతున్నారు. పల్లెల్లోని ప్రధాన చెరువులు అడుగంటిపోవడమే దీనికి ప్రధాన కారణం. కొన్ని చోట్ల రక్షిత నీటి పథకాల ఫిల్టర్ బెడ్ల వద్ద ఇంజిన్లకు నీరందని పరిస్థితులు నెలకొన్నాయి. కాలువలకు పూర్తి స్థాయిలో నీరొచ్చి చెరువులను నింపాలంటే మరో వారం పది రోజుల సమయం పడుతుందని.. అప్పటి వరకు ఎలా ముందుకెళ్లాలో తెలియని దుస్థితిని పంచాయతీల పాలకవర్గాలు ఎదుర్కొంటున్నాయి.

ఉండి మండలం మహదేవపట్నంలో అడుగంటిన మంచినీటి చెరువు ఇది. రెండున్నర దశాబ్దాల నుంచి పూడికతీత పనులు చేపట్టకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. నీటి మట్టం తగ్గిపోవడంతో కొద్ది రోజుల నుంచి ఒక్క పూటే సరఫరా చేస్తున్నారు. శనివారం నాటికి నీరు బాగా అడుగంటడంతో ఇంజిన్లకు అందని పరిస్థితి ఎదురైంది. చెరువు నీటిని ట్యాంకర్లతో తెచ్చి సంపు నింపుతున్నారు.



**మొరాయిస్తున్న ఫిల్టర్‌బెడ్లు**

జిల్లాలోని 20 మండలాల్లో 328 మంచినీటి చెరువులున్నాయి. మొగల్తూరు, పెంటపాడు, పెనుమంట్ర మండలాల్లోని నాలుగు చెరువుల్లో జలాలు 30 రోజులకే నిండుతున్నాయి. పూర్తిస్థాయిలో నింపితే 41 రోజులకే సరిపడే జలాలను నిల్వ చేసే చెరువులు 100 వరకు ఉన్నాయి. 45 రోజులకు సరిపడే చెరువులు మరో 50 వరకు ఉన్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వీటన్నింటిల్లో నీటి నిల్వలు ఇప్పుడు బాగా తగ్గిపోవడంతో ఫిల్టరు బెడ్లు మొరాయిస్తున్నాయి. ఈ నెల ఒకటో తేదీనే కాలువలకు నీటి సరఫరాను ప్రారంభించడంతో దాహం ఇబ్బందుల నుంచి గట్టెక్కుతామని ఆశించారు. కానీ ఎగువ ప్రాంతాల్లో నిర్వహణ పనుల కోసం నీటి సరఫరాను పెంచకపోవడంతో ఎక్కడ చెరువులను నింపే పరిస్థితి లేదు.

**9 నుంచి సరఫరా పెంపు**

కాలువల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు ఏర్పడిన అంశం మా దృష్టికి వచ్చింది. చెరువులు నింపేందుకు వీలుగా ఈ నెల 9వ తేదీ నుంచి కాలువలకు నీటి సరఫరా పెంచుతాం. సుబ్రహ్మణ్యేశ్వరరావు, జల వనరుల శాఖ ఈఈ (శెట్టిపేట)

# నమోదుకూ పెళ్లి నడకే!

పెనుగొండ: ఏడడుగుల బంధంతో ఒక్కటవుతున్న వారిలో చాలామంది రిజిస్ట్రేషన్ విషయంలో శ్రద్ధ వహించడం లేదు. నగరపాలక పరిధిలో వివాహం చేసుకుంటే కార్పొరేషన్‌ల్లో, గ్రామీణ, మండల పరిధిలోని గ్రామాల్లో అయితే పంచాయతీల్లో 90 రోజుల్లో నమోదు చేసుకోవాలి. కానీ.. కొత్త జంటలు పెళ్లి తంతు అయిన వెంటనే ఆ విషయమే మరిచిపోతున్నారు. దీని వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

**ఏమి జత చేయాలంటే..** దరఖాస్తుతో శుభలేఖ, పెళ్లి కుమార్తె, పెళ్లి కుమారుడి పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాల నకళ్లు జత చేయాలి. పదో తరగతి చదివితే మార్కుల జాబితా ఉండాలి. వీటితో కలిపి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రూ. 500 ఫీజు చెల్లిస్తే ధ్రువపత్రం పరిశీలించి గంటలో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ధ్రువ పత్రం పొందవచ్చు. దంపతుల తరఫున ముగ్గురు సాక్షి సంతకాలు చేయాలి.



**ప్రయోజనాలివే..** ఉద్యోగులు తమ భార్య లేక భర్తను నామినీగా నమోదు చేయాలన్నా, ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాలన్నా, విదేశాలకు వెళ్లే దంపతులకు పాస్‌పోర్టు, వీసా, వర్క్ పర్మిట్, బీమా వంటివి కావాలంటే వివాహ ధ్రువపత్రం అవసరం. దంపతుల మధ్య విభేదాలు వచ్చి పోలీసు కేసులు నమోదైనప్పుడు కోర్టులో సాక్ష్యంగా చూపడానికి ఉపయోగపడుతుంది. పెనుగొండ, ఆచంట, పాలకొల్లు, మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని పట్టణ, గ్రామాల్లో ఉన్న కల్యాణ మండపాలు, ఆలయాలు, షాదీఖానాలు, చర్చిలు, ఇళ్లలో ఏటా వేల సంఖ్యలో వివాహాలు జరుగుతున్నాయి. కానీ.. గత 17 నెలల్లో చూస్తే కేవలం 2,887 వివాహాలు మాత్రమే నమోదయ్యాయి. ‘భవిష్యత్తులో వివాహ ధ్రువపత్రం ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుంది. ఎక్కువ మంది అవగాహన లేక రిజిస్ట్రేషన్ చేయించుకోవడం లేదని’ పెనుగొండ సబ్ రిజిస్ట్రార్ ఎండీ అహ్మద్ అలీ చెప్పారు.

# భావి తరానికి విలువల విద్య

కాళ్ల: భావితరానికి విద్యతో పాటు విలువలు, మన సంస్కృతి, సంప్రదాయాలు నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా భీమవరం సమీపాన పెదఅమిరంలో ఉన్న వివేకానందం సేవా సమితి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. స్వామి వివేకానంద శిష్యుల్లో ఒకరైన సోదరి నివేదిత పేరిట ఈ విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. గుంటూరులోని శారదామఠం అధ్యక్షురాలు ప్రవ్రాజిక భవానీ ప్రాణ మాతాజీ ‘నివేదిత విద్యాలయ’ను ప్రారంభిస్తారని వివేకానంద సేవా సమితి సంస్థ ప్రతినిధి శివవర్మ తెలిపారు. ఆదివారం పీఠం మాతాజీలు ప్రవ్రాజిక త్యాగనిష్ఠ ప్రాణ, ప్రవ్రాజిక దివ్యాత్మప్రాణ ఆధ్యాత్మిక ప్రవచనాలు జరుగుతాయని పేర్కొన్నారు.

**పేద విద్యార్థులకు ప్రాధాన్యం** పెదఅమిరరంలోని సేవాసమితి భవనం ప్రాంగణంలో సుమారు 40 సెంట్ల విస్తీర్ణంలో ఈ పాఠశాలను నిర్మించారు. ఎల్‌కేజీ నుంచి 7వ తరగతి వరకు 30 మంది చొప్పున 270 మంది విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించారు. ఎంపికలో అల్పాదాయ వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

## ఔత్సాహికులారా.. అందిపుచ్చుకోండి!

అనకాపల్లి: రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్ ఉండాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం. భారీ పరిశ్రమల కంటే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలే ఎక్కువ మందికి ఉపాధిని కల్పిస్తాయని నమ్మకం. ఔత్సాహికులు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి తోడ్పాటు అందించేలా ఎంఎస్ఎంఈ పార్క్‌లు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను అభివృద్ధి చేస్తున్నారు. అనకాపల్లి, పెందుర్తి, ఎలమంచిలి నియోజకవర్గాల్లో ఇప్పటికే పారిశ్రామిక పార్క్‌లను సిద్ధం చేశారు. మిగతా నియోజకవర్గాల్లో భూములను గుర్తించారు. తీర ప్రాంతాన్ని ఆనుకుని ఇప్పటికే భారీ పెట్టుబడులతో పరిశ్రమలు వస్తున్నాయి. వాటికి అనుబంధంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) కంపెనీలు ఏర్పాటు చేయగలిగితే స్థానికంగా మరింత మందికి ఉపాధి లభించేఅవకాశం ఉంటుంది.

**మన్యంలో మూడుచోట్ల..**

ఏజెన్సీ ప్రాంతంలో భారీ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం లేదు. షెడ్యూల్డ్ ప్రాంతంలో గిరిజనేతరులు వచ్చి కంపెనీలు పెట్టడానికి వీలులేదు. సానికంగా సూక్ష్మ, చిన్న తరహా యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన భూములు కొనుగోలు పెట్టుబడి పెట్టే సోమత ఎక్కువ



మంది గిరిజనులకు ఉండదు. అందుకే అల్లూరి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు (ఎఫ్ఎఫ్‌సీ) నిర్మించేలా అధికారులు ప్రణాళిక చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బహుళ అంతస్తుల భవనం నిర్మించి సానిక ఔత్సాహికులకు ప్లగ్ అండ్ ప్లే విధానంలో గదులు కేటాయిస్తాయి. వీటికి అవసరమైన మౌలిక సదుపాయాలను ఏపీఐఐసీనే కల్పిస్తుంది. ఇప్పటికే అరకులోయలో 5.02 ఎకరాలు ఏపీఐఐసీ ద్వారా తీసుకున్నారు. పాడేరు నియోజకవర్గానికి సంబంధించి చింతపల్లిలో 15 ఎకరాలు, రంపచోడవరం నియోజకవర్గం కన్నవరం గ్రామంలో 15.26 ఎకరాల్లో ఎఫ్ఎఫ్‌సీల ఏర్పాటుకు భూములను గుర్తించారు. వీటిలో ఆహార శుద్ధి, అసెంబ్లింగ్, సర్వీస్ యూనిట్లు నెలకొల్పే అవకాశం ఉంది.

అన్ని ప్రాంతాల అభివృద్ధిఎంఎస్ఎంఈ పార్కులు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ సముదాయాలతో ఎక్కువమంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.కొత్తగా గుర్తించిన చోట భూసేకరణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. నరసింహారావు, జడ్ఎం, ఏపీఐఐసీ

## నగరపాలక.. అభివృద్ధి సాగక

కర్నూలు : కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి అటకెక్కింది. అధికారుల మధ్య సమన్వయ లోపంతో పనులు ముందుకు సాగడం లేదు. అధికారులు, గుత్తేదారులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఫలితంగా ఎవరికివారు రాజకీయం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల పలువురు గుత్తేదారులు కలిసి సమావేశం నిర్వహించారు. తమకు బిల్లులు చెల్లించడం లేదంటూ కొందరు వాపోతున్నారు. మరోవైపు టెండర్లు దక్కించుకున్న పలువురు గుత్తేదారులు పనులు చేయడం లేదు.. అలా ప్రారంభించి వదిలేస్తుండటంతో అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం పడుతోంది.

**సగం చేసి.. మధ్యలో ఆపేసి**

ఈ చిత్రం.. నగరంలోని 27వ వార్డు పరిధిలోనిది. రూ.49.90 లక్షలతో కల్వర్టుతోపాటు కాలువలు నిర్మించేందుకుగాను గత నెలలో శిలాఫలకం వేశారు. కల్వర్టు పనులు చేశారు. రహదారికి ఇరువైపులా కాలువల పనులు చేపట్టాల్సి ఉంది. నెల గడిచినా ఇప్పటివరకు చేపట్టలేదు. బిల్లులు రావాల్సి ఉందని.. అందుకే పనులు ప్రారంభించ లేదని గుత్తేదారులు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన నగరపాలక పాలకవర్గ సమావేశంలో కార్పొరేటర్ సైతం ప్రస్తావించారు.

**శిలాఫలకాలతో సరి..**

నగరంలో గత కొన్ని నెలలుగా అభివృద్ధి పనుల్లో తీవ్రమైన స్తబ్దత నెలకొంది. పాలకులు శిలాఫలకాలు ఆవిష్కరిస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో పనులు పూర్తై ప్రారంభానికి నోచుకోవడం లేదు. తాము శిలాఫలకాలు వేసిన పనులనైనా ప్రారంభించేలా చూడండంటూ పాలకులు చెప్పే పరిస్థితులు నెలకొనడం గమనార్హం. నగర పరిధిలో



సుమారు రూ.30 కోట్ల విలువైన పనులు ఆగిపోయినట్లు సమాచారం. కొందరు గుత్తేదారులు కావాలనే లెస్‌కు టెండరు వేసి దక్కించుకొని పనులు ప్రారంభించడం లేదని తెలిసింది.

**రెండు వర్గాలుగా ఏర్పడి..**

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో రెండు వర్గాలుగా ఏర్పడినట్లు సమాచారం. గుత్తేదారులు సైతం చెరో వర్గంలో చేరిపోయి రాజకీయం చేస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అభివృద్ధి పనుల విషయంలో గందరగోళం నెలకొంది. దీంతోపాటు బిల్లుల సమస్య నెలకొంది. పలువురు వివిధ పనులు చేసినా బిల్లుల కోసం తిరగాల్సిన పరిస్థితి. కార్యాలయ సిబ్బంది కొంతమందికే సహకరిస్తున్నారన్న వాదన వినిపిస్తోంది.

**గుత్తేదారులపై చర్యలేవీ?**

పనులు ప్రారంభించకపోవడం.. నిర్దేశించిన గడువులో పనులు పూర్తి చేయకపోవడం.. మధ్యలో పనులు ఆపేసిన గుత్తేదారులపై అధికారులు చర్యలు తీసుకొనేందుకు ఏమాత్రం సాహసించడం లేదు. నాణ్యత ప్రమాణాలు పాటించని గుత్తేదారులకు కొందరు పూర్తి సహకారం అందిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో పాలకులు ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# పనులు పట్టాలెక్కాయ్



ఆదోని : ఆదోని పట్టణ శివారులోని టిడ్కో నివాస ప్రాంతంలో మురుగునీటి శుద్ధి ప్లాంటు (ఎస్టీపీ) పనులు తిరిగి పట్టాలెక్కాయి. 2016-20లో తెదేపా ప్రభుత్వ హయాంలో 5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో రూ.14 కోట్ల నిధులతో ప్లాంటు ఏర్పాటుకుగాను పనులు ప్రతిపాదించారు. 2018లో పనులకు సంబంధించి ఒప్పందం చేసుకుని ప్రారంభించారు. ఆ తర్వాత 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయి. దీని గురించి గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో ఎస్టీపీ పనుల్లో కదలిక వచ్చింది. ప్రాజెక్టు నిర్మాణ పనులను ఉన్నతాధికారులు నిత్యం పరిశీలిస్తూ సూచనలు ఇస్తున్నారు. ఫలితంగా అరవై శాతం పనులు పూర్తయ్యాయి. మరో ఏడాదిలోపు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టారు.

ఆదోని పట్టణానికి మరో రెండు ఎస్టీపీ ప్లాంట్లు మంజూరయ్యాయి. 11 ఎంఎల్‌డీ, 14.5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో వీటిని ఏర్పాటు చేయనున్నారు. సుమారు రూ.82 కోట్లతో పనులు చేపట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఒకదానిని ఆర్.ఆర్.లేబర్ కాలనీ ప్రాంతం, మరొకటి టిడ్కో ప్రాంతంలో నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. త్వరలో పరిపాలన, సాంకేతిక, ఆర్థికపరమైన అనుమతులు లభిస్తే పనులు పట్టాలెక్కనున్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే మురుగునీరు శుద్ధి చేయనున్నారు.

**కాలుష్యం తగ్గించేలా..**

పట్టణంలో ప్రధానంగా ఆవుదూడ, ఎర్రవంకలు ప్రవహిస్తున్నాయి. మురుగు కాలువలోని నీరంతా ఈ రెండు వంకల్లో కలుస్తున్నాయి. ఈ మురుగునీరు శివారు ప్రాంతాలకు చేరుతోంది. కొందరు ఈ నీటితో పంటలు సాగు చేస్తున్నారు. ఫలితంగా ఆహార కాలుష్యం జరుగుతోంది. జనం రోగాలబారిన పడే అవకాశముంది. ఈ నేపథ్యంలో వీటిని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టాయి. ఇక్కడ శుద్ధి చేసిన నీటిని నిర్మాణ పనులు, పచ్చదనం పెంపు తదితరాలకు వినియోగిస్తారు.

# నిర్లక్ష్యం సా'గంగ'



నంద్యాల : చెన్నై నగరానికి తాగునీటితోపాటు నంద్యాల, వైఎస్సార్, తిరుపతి, నెల్లూరు జిల్లాలకు సాగునీరు అందించే తెలుగుగంగ ప్రాజెక్టుకు ఎనలేని ప్రాధాన్యముంది. దీనిద్వారా లక్షలాది ఎకరాలు సస్యశ్యామలమవుతున్నాయి. మరోవైపు తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరును నీటిని నిల్వ చేసుకునేందుకు నిర్మించారు. జలాశయంలోని నీటిని అవసరం వచ్చినప్పుడూ ఉపయోగించుకునేలా రూపకల్పన చేశారు. తెలుగుగంగ బైపాస్ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేసేందుకు డీపీఆర్ రూపొందించారు. 1985లో ప్రాజెక్టు పనులు ప్రారంభమై 1997 నాటికి పూర్తి చేశారు. జలాశయంలో కీలకమైన బైపాస్ కెనాల్‌ను మాత్రం ఇప్పటివరకు నిర్మించలేదు.

**కరవు పరిస్థితులు వస్తే..**

జలాశయాన్ని 16.323 టీఎంసీల సామర్థ్యంతో 4,776 హెక్టార్లలో నిర్మించారు. అప్పట్లో అనుకున్న డీపీఆర్ ప్రకారం శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం 885 అడుగులు ఉన్నప్పుడు బనకచర్ల ద్వారా వెలుగోడు రిజర్వాయర్‌ను పూర్తి స్థాయిలో నింపి నిల్వ చేస్తారు. పోతిరెడ్డిపాడు వద్ద 854 అడుగుల నుంచి విడుదలయ్యే నీటిని బైపాస్ కెనాల్ ద్వారా నేరుగా విడుదల చేస్తారు. పంట కాలువలకు 5 వేల క్యూసెక్కులను విడుదల చేసి వైఎస్సార్ జిల్లాలోని బ్రహ్మరాయసాగర్‌తో పాటు కండలేరు తదితర ప్రాజెక్టులకు పంపుతారు. పోతిరెడ్డిపాడు వద్ద 853 అడుగుల లోపు నీటిమట్టం ఉండి కరవు వచ్చిన సమయంలో వెలుగోడు రిజర్వాయర్‌లోని నీటిని వాడుకునేలా ప్రాజెక్టును రూపొందించారు. ఇప్పటివరకు బైపాస్ కెనాల్ నిర్మాణం జరగలేదు.

**ప్రతిపాదనలు సిద్ధం చేసినా..**

వెలుగోడు రిజర్వాయర్ నిర్మాణం కోసం నాలుగు దశాబ్దాల కిందటే భూసేకరణ చేశారు. అదే సమయంలో బైపాస్ కెనాల్‌కు భూమి సేకరించారు. కాలువ నిర్మాణం మాత్రం జరగలేదు. బనకచర్ల నుంచి వెలుగోడు రిజర్వాయర్‌కు వచ్చే కాలువ.. నంద్యాల-ఆత్మకూరు రహదారిలో రిజర్వాయర్ సమీపంలో బైపాస్ చేసి కాలువ నిర్మించాలని గతంలో ప్రతిపాదించారు. 13 కి.మీల పొడవునా నిర్మించి రిజర్వాయర్ నుంచి పంట కాలువలకు నీటిని విడుదల చేసేలా రూపకల్పన చేశారు. 14 మీటర్ల పొడవు, 5 మీటర్ల లోతున కాలువ తవ్వి నీటిని విడుదల చేస్తే సరిపోతుందని అప్పట్లో అధికారులు అంచనా వేశారు. ఇందులో భాగంగానే భూసేకరణ జరిగినా కాలువ నిర్మాణం చేపట్టలేదు.

**రూ.100 కోట్లతో పూర్తి?** ప్రస్తుతం బైపాస్ కెనాల్ నిర్మాణానికి రూ.100 కోట్లు కేటాయిస్తే సరిపోతుందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. కృష్ణా బోర్డు నిబంధనల ప్రకారం ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నేరుగా నీటిని తీసుకునే అవకాశం లేదు. శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చే సమయంలోనే కృష్ణా వెనుక జలాలను పోతిరెడ్డిపాడు ద్వారా వీబీఆర్‌లో నిల్వ చేసుకుని.. బనకచర్ల ద్వారా ఏటా సాగు నీటిని బైపాస్ కెనాల్ ద్వారా వాడుకుంటే ప్రయోజనం ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టులో భాగంగా తెలుగుగంగ బైపాస్ కెనాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. దీనిపై సీమ ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సి ఉంది.

# పథకం నీరుగారి..

నందికొట్కూరు : నందికొట్కూరు పురపాలక సంఘం పరిధిలో ప్రజలకు శుద్ధ జలం కలగా మారింది. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పట్లో తెదేపా ప్రభుత్వ పాలనలో రూ.109.18 కోట్లతో వివిధ పనులు చేపట్టి శుద్ధ జలం అందించేలా ప్రణాళికలు రూపొందించారు. నిధులు కేటాయించారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో పనులు ముందుకు సాగలేదు. ఐదేళ్ల కాలంలో కనీసం ట్యాంకు నిర్మాణాలను పూర్తి చేయలేదు. పైపులైను పనులు ముందుకు సాగలేదు. దీనికితోడు అలగనూరు రిజర్వాయర్ నిర్మాణంపై గత ప్రభుత్వం నిరక్ష్యం వహించడంతో శుద్ధ జల పథకం అందని ద్రాక్షలా మారింది.

**రూ.109.18 కోట్లు కేటాయించినా..**

పట్టణ ప్రజలకు శుద్ధ జలాలు అందించేందుకు రూ.109.18 కోట్లతో చేపట్టిన పనుల్లో ట్యాంకు నిర్మాణాలు కొంత జరిగాయి. మిడుతూరు మండలం అలగనూరు జలాశయం నుంచి 19 కి.మీ. మేర పైపులైను ద్వారా నీటిని తరలించాల్సి ఉంది. ఇది ముందుకు సాగడం లేదు. పట్టణంలో 62 వేల మందికిపైగా జనం నివసిస్తున్నారు.

పట్టణంలోని 29 వార్డులకు నీటి సరఫరా చేసేందుకు కర్నూలు రహదారిలోని బీఆర్ఆర్ నగర్‌లో 900 కేఎల్, పగిడ్యాల రహదారిలోని బీఆర్ నగర్‌లో 1,000 కేఎల్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద 1,300 కేఎల్, నీలిషికారీ కాలనీలో 1,100 కేఎల్ సామర్థ్యంతో నాలుగు ప్రాంతాల్లో ఓహెచ్ఆర్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టారు. నీలిషికారీ



కాలనీలో చేపట్టిన ట్యాంకు పనులు మధ్యలో ఆగిపోయాయి. మిగిలిన ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి.

**స్పందిస్తే స్వచ్ఛ జలం**

నందికొట్కూరు పట్టణంలో నిలిచిన శుద్ధ జలం పథకం పనులను పూర్తి చేసేలా కూటమి ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది. పాలకులు సైతం దీనిపై దృష్టి పెడితే పట్టణవాసుల కష్టాలు తీరుతాయి. అందరికీ స్వచ్ఛమైన నీరు లభిస్తుంది.

## స్వాధీనంలో ఉన్నా 'నిషేధమా'

భీమవరం : వెళ్లని కార్యాలయం లేదు... కలవని అధికారి లేరు...అయినా ఏళ్లుగా సమస్య పరిష్కారం కాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. వైకాపా ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో కొంతమంది భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లడంతో వారసులకు బదిలీ చేయలేక, ఆర్థిక అవసరాలకు అమ్ముకోలేక ఆర్థికంగా, మానసికంగా నలిగిపోతున్నారు. నిషేధిత జాబితాలో ఉన్న తమ భూములను క్రమబద్ధీకరించాలని కోరుతున్న రైతుల వేదనను పట్టించుకొనేవారే లేరు.పెంటపాడుకి చెందిన విజయ ఆనందరెడ్డి 115/2 సర్వే నంబరులో 3.15 ఎకరాల భూమిని రీసర్వేలో 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని, క్రమబద్ధీకరించాలని కొంతకాలంగా అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. రీసర్వే అనంతరం సర్వేనం.225లో 850 ఎకరాల భూమి ఆన్‌లైన్‌లో కనిపించకపోవడంతో భూ క్రయవిక్రయాలు జరగడం లేదని, బ్యాంకులో రుణ సదుపాయం లేదని నరసాపురం మండలం చినమామిడిపల్లికి చెందిన పాలూరి బాబ్జీ ఆవేదన వ్యక్తం చేశారు.

కుమార్తె వివాహం కోసం 49/2 సర్వే నంబరులో ఉన్న భూమిని విక్రయించేందుకు ఏడాదిగా ప్రయత్నిస్తూనే ఉన్నా. భూమి మా ఆధీనంలో ఉన్నా నిషేధిత జాబితాలోకి వెళ్లడంతో అవసరానికి విక్రయించేందుకు అవకాశం లేకుండా పోయిందని భీమవరం మండలం రాయలంలోని ముత్యాలరావు ఆవేదన వ్యక్తం చేశారు.

వైకాపా చేపట్టిన రీసర్వేలో వచ్చిన తప్పులు సరిదిద్దేందుకు కూటమి సర్కారు చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో 7,021 ఫిర్యాదులొచ్చాయి. వీటిలో వందకి పైగా ఫిర్యాదులు తమ భూములు నిషేధిత జాబితాలో చేర్చారనే వచ్చాయి. వాటిపై ఇదిగో అదిగో అంటూ అధికారులు



చెప్పడమే గాని ఇచ్చిన అర్జీలకు పరిష్కారం దొరకలేదు. తణుకు, పెంటపాడు, తాడేపల్లిగూడెం, మొగల్తూరు, నరసాపురం, భీమవరం తదితర మండలాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. రైతులు వైద్య అవసరాలతో పాటు పిల్లల విద్య, వివాహ, ఇతర అవసరాలకు క్రయవిక్రయాలు చేసే వీల్లేక అప్పుల పాలవుతున్నారు.

పరిష్కారం లేక: నిషేధిత జాబితా భూముల సమస్యలు మండల స్థాయిలో పరిష్కారానికి వీల్లేకపోవడంతో సమస్యలు తీరడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీకోసం కార్యక్రమంలో రెవెన్యూ దరఖాస్తుల్లో వచ్చేవి 50 శాతం ఇవే ఉంటున్నాయి. చినమామిడిపల్లిలో రైతులకు చెందిన సుమారు 1400 ఎకరాలు రీసర్వే అనంతరం ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. నరసాపురం పట్టణంలో ఆర్.ఎస్.నం.53లో పదెకరాలకు పైగా నిషేధిత జాబితాలోకి వెళ్లిపోయింది. సమస్యలన్నీ పరిశీలనలో ఉన్నాయి, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని డీఆర్వో వెంకటేశ్వరరావు తెలిపారు.

## 'తీగ లాగితే' కనిపించదా?

ఏలూరు: కొల్లేరు కాంటూరు పరిధిలో విద్యుత్తు అక్రమ వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. ఇష్టారాజ్యంగా నియంత్రికలు ఏర్పాటు చేసేశారు. దూర ప్రాంతాలకు తీగలు తీసుకువెళ్లారు. ఇదంతా బహిరంగంగా సాగుతున్నా అటవీ అధికారులు..ఇటు విద్యుత్తుశాఖ కన్నెత్తి చూడటం లేదు.అంతా మాఇష్టం.. కొల్లేరు కాంటూరులో వేల ఎకరాల్లో అక్రమ సాగు చేస్తున్నారు. 18వేల ఎకరాలు ఆక్రమణల్లో ఉన్నట్లు తేలింది. ఇందులో ఆకివీడు, భీమడోలు, నిడమర్రు, కైకలూరు మండలాల్లో ఎక్కువగా రొయ్యల సాగు చేస్తున్నారు. వీటికి ఏరియేటర్ల కోసం విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. నియంత్రికలు ఏర్పాటు నిషేధమైనా వసూళ్లకు అలవాటు పడిన కొందరు సిబ్బంది దీనికి అండగా నిలుస్తున్నారు. కాంటూరు సరిహద్దులో ఉన్న చెరువులకు అయితే కాంటూరుకు ఆవల నియంత్రికలు ఏర్పాటు చేసి తీగలు ఏర్పాటు చేసి సాగు చేస్తున్నారు.

ఇది నిడమర్రు మండలం తోకలపల్లి సమీపంలోని అటవీశాఖ చెక్ పోస్ట్. దీని పక్కనే ఇలా విద్యుత్తు నియంత్రికను ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి గ్రామంలోని వంద ఎకరాలకు పైగా ఆక్వా చెరువులకు కరెంటు అక్రమంగా సరఫరా చేస్తున్నారు. రహదారి పక్కనే జరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

ఇది నిడమర్రు మండలం డి.గోపవరం సమీపంలో అక్రమ విద్యుత్తుతో నిర్వహిస్తున్న ఆక్వా చెరువు. సమీపంలోని కాలువ ఆవల నియంత్రిక




నుంచి వైరింగ్‌ను కాలువ గుండా పైపులు వేసి మరీ తీసుకొచ్చారు. భారీ విద్యుత్తు తీగల చుట్టలు చెరువుల సమీపంలో కనిపిస్తున్నాయి. కైకలూరు మండలం శృంగవరప్పాడు, ఆకివీడు మండలం సిద్దాపురం, చినకాపవరం, పెదకాపవరం, కోళ్లపర్రు తదితర గ్రామాల్లో 500 ఎకరాలకుపైగానే అక్రమ విద్యుత్తు ద్వారా ఆక్వా సాగు సాగుతోంది. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

మీకేం పట్టదా.. 'విద్యుత్తు కనెక్షన్లు ఉన్న ప్రాంతాలను గుర్తించాం. విద్యుత్తు అధికారులకు నివేదిక పంపాం' అంటూ అటవీశాఖ అధికారులు మమ అనిపిస్తున్నారు. అసలు తీగలు ఏర్పాటు చేస్తున్నప్పుడు అటవీశాఖ అధికారులు ఏం చేస్తున్నారు. అటవీశాఖ నివేదికల ప్రకారం విద్యుత్తు అధికారులు ఎందుకు అక్రమ సరఫరాలను అడ్డుకోవడం లేదు. ఈ ప్రశ్నలకు ముడుపుల ముచ్చటే సమాధానంగా ఉంది. దీనిపై అధికారులను అప్రమత్తం చేసి చర్యలు తీసుకుంటామని ఏలూరు, పశ్చిమ కలెక్టర్లు వెట్రిసెల్వి, నాగరాణి తెలిపారు.

# నిబంధనలకు పాతరేసి.. అవినీతికి తెరతీసి..

తిరుపతి : ఐదేళ్ల వైకాపా పాలనలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) అక్రమాలకు కేంద్రంగా మారింది. రైతులకు బదులు నాటి అధికార పార్టీ నేతల సేవలో నిమగ్నమైంది. ఎక్కడికక్కడ నిబంధనలకు పాతరేసి మరీ పప్పుబెల్లాల్లా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బ్యాంకు రుణాలు మంజూరు చేసింది. అవకతవకలపై అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చినా పట్టించుకోలేదు. కూటమి సర్కార్ కొలువు దీరాక తొలుత సహకార శాఖతో విచారణ జరిపించారు. తర్వాత ప్రభుత్వ ఆదేశాలతో ఈ బాధ్యతను కలెక్టర్ సుమిత్‌కుమార్ డీఆర్వో మోహన్‌కుమార్‌కు అప్పగించారు. ఏడు నెలలుగా విచారణ సాగుతుండటం విమర్శలకు దారితీస్తోంది. వైకాపా హయాంలో ఐదేళ్లపాటు నామినేటెడ్ కమిటీనే ఉంది. ఛైర్‌పర్సన్‌గా.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వర్గీయురాలు రెడ్డెమ్మ బాధ్యతలు నిర్వర్తించారు. పెత్తనం మొత్తం ఆమె భర్త కృష్ణమూర్తిదే. రుణాల మంజూరు, ఉద్యోగ నియామకాలు, టెండర్ల అప్పగింత వరకు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. డీసీసీబీని తమ జాగీరులా చేసుకున్నారు. ఒక కుటుంబంలో ఒకరికే రుణం ఇవ్వాలనే నిబంధన ఉంది. అదేవిధంగా రూ.5 లక్షలు దాటిన పనులకు టెండరు పిలిచి అప్పగించాలి. ఇలాంటి నియమాలు పక్కనపెట్టారు.

**ఉద్యోగికే కాంట్రాక్టు కట్టబెట్టి..**

పలమనేరులోని శాఖకు నూతన భవన నిర్మాణ కాంట్రాక్టును సైతం ఉద్యోగికే అప్పగించారు. రూ.5 లక్షలకుపైన పనిని టెండర్ పిలిచి తక్కువ కోట్ చేసిన గుత్తేదారుకు ఇవ్వాలి. కానీ రూ.98 లక్షల కాంట్రా



క్టును ఉద్యోగికే కట్టబెట్టడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది.

**ఉద్యోగాలకు డబ్బుల వసూలు**

వైకాపా నాయకులు, తమ అనుకూలురుకు పనులు కేటాయించడమే కాదు.. ఉద్యోగాలను అమ్ముకున్నారు. ఉద్యోగ నియామకాలకు ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షలు- రూ.15 లక్షలు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి.

**15 రోజుల్లో నివేదించాల్సి ఉన్నా..**

గతేడాది అక్టోబరులో తొలుత సహకార శాఖ విచారణ ప్రారంభించింది. 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. అనంతరం డీఆర్వో మోహన్‌కుమార్ కోర్టులోకి బంతి వెళ్లింది. ఈ అంశానికి అంతగా ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో విచారణ నత్తనడకన సాగుతోంది. ఏప్రిల్ చివరి నాటికి నివేదిక ఇస్తారని అనుకున్నా ఇప్పటికీ మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రస్తుతం ఇది తుది దశకు చేరుకుందని చెబుతున్నప్పటికీ ప్రభుత్వానికి ఎప్పుడు నివేదిక పంపిస్తారు? అక్కడి నుంచి చర్యలకు ఎంతకాలానికి ఆమోదం లభిస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది.

**రూ.12 కోట్లకుపైగానే అవకతవకలు**

వి.కోటకు చెందిన వైకాపా నేత పీఎన్ నాగరాజు కుటుంబసభ్యులకు వి.కోట శాఖలో ఏకంగా రూ.1.62 కోట్ల పంట రుణం ఇచ్చారు. ఇదే శాఖలో రెడ్డెమ్మ బంధువు ఇంటి నిర్మాణానికి రూ.40 లక్షల రుణం మంజూరు చేశారు. శ్రీకాళహస్తి, పిచ్చాటూరు, తిరుచానూరు, బైరెడ్డిపల్లె, వి.కోట, పుంగనూరు, మదనపల్లె సహా మొత్తం 12 శాఖల్లో ఇలా గోల్‌మాల్ జరిగిందని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ఆధారాలతో సహా ఫిర్యాదు ఇచ్చారు. రూ.12 కోట్లకుపైగానే అవకతవకలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు.

**రూ.1.40 కోట్ల చెల్లింపులు**

వైకాపా పాలనలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన తర్వాత ఆ పార్టీ నేతలు, రుణాలు తీసుకున్న వ్యక్తులు కొందరు మొత్తంగా రూ.1.40 కోట్ల వరకు డీసీసీబీకి చెల్లించారని సమాచారం. మిగతా సొమ్మునూ రికవరీ చేసే పనిలో బ్యాంకు అధికారులు ఉన్నారు.

# క్యూఆర్ కోడ్‌పై లెక్కలేవీ?

తిరుపతి : ప్రజా పాలనలో ఫిర్యాదులు, అభిప్రాయాలను ప్రజల నుంచి తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ-గవర్నెన్స్ తరహాలో ఆర్టీసీలో క్యూఆర్ కోడ్ ప్రవేశపెట్టారు. తద్వారా ప్రయాణికుల ఫిర్యాదులు, అభిప్రాయాలు తెలుసుకునేందుకు వీలుగా జిల్లాలోని ప్రతి బస్టాండ్, బస్సుల్లో క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేశారు. కానీ దీని ద్వారా జిల్లాకు అందే ఫిర్యాదులు, అభిప్రాయాలపై అధికారుల్లో స్పష్టత లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.ఆర్టీసీ అధికారులు సౌకర్యవంతమైన ప్రయాణం, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నా కొన్నిచోట్ల ప్రయాణికులు సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. బస్టాండ్లలో సురక్షిత తాగునీరు లేకపోవడం, మరుగుదొడ్ల సమస్యలు, పరిశుభ్రత, ఇతర వ్యక్తిగత అభిప్రాయాలు తెలియజేయాలంటే సంబంధిత అధికారులు అందుబాటులో ఉండకపోవ డం, ఫోన్‌లకు స్పందించకపోవడం వంటి సమస్యలను ప్రయాణికులు ఎదుర్కొంటున్నారు. వీటన్నింటినీ పరిశీలనలో తీసుకున్న కూటమి ప్రభుత్వం ఇతర శాఖల్లో అమలు చేస్తున్న క్యూఆర్ కోడ్‌ను ఆర్టీసీలో కూడా అమల్లోకి తెచ్చింది. ప్రతి బస్టాండ్, బస్సుల్లో క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసి, తద్వారా సమస్యలు, అభిప్రాయాలు తెలియజేయాలని సూచించింది.

క్యూఆర్ కోడ్ ద్వారా ఎన్ని సమస్యలు నమోదవుతున్నాయని? ఎన్ని పరిష్కరిస్తున్నారు? సంతృప్తికరమైన అభిప్రాయాలెన్ని? అనే వాటిపై లెక్కలు లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై జిల్లా స్థాయి అధికారులను సంప్రదించినా సరైన సమాధానం లేకపోవడం విచారకరం.

**అవగాహన కల్పిస్తేనే..**

తిరుపతి ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం కావడంతో తిరుపతి బస్టాండ్‌లో తెలుగు, తమిళ, హిందీ ఇతర భాషలకు చెందిన యాత్రికులు రాకపోకలు సాగిస్తుంటారు. వారందరికీ అర్థమయ్యేలా ఆయా భాషల్లో క్యూఆర్ కోడ్ వద్ద బోర్డులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం బస్టాండ్‌లోని విచారణ కేంద్రం, రిజర్వేషన్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ఏంటి? ఎందుకుంది? అనేది ప్రయాణికులకు తెలియని పరిస్థితి.

జిల్లాలో డిపోలు: 11

బస్సుల సంఖ్య:

సుమారు 900

రోజూ రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య: 1.20 లక్షలు

# ఉత్తుత్తి.. సామాజిక భవనాలు!



గుత్తి: ప్రజలకు బహుళ ప్రయోజనం పేరుతో అధికారులు సామాజిక భవనాలు నిర్మిస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వం నుంచి నిధులు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారు. వాస్తవానికి ఎక్కడా సామాజిక భవనంలో సరిగా వినియోగంలో లేవు. గుత్తితోపాటు పలు గ్రామాల్లో భవనాలు కొన్ని ఆక్రమణలకు గురయ్యాయి. పలుచోట్ల శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. భవనాల నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. ఈనేపథ్యంలో క్షేత్రస్థాయిలోని పరిస్థితిపై పరిశీలన కథనం.

**క్షేత్రస్థాయిలో ఇలా...**

గుత్తి పురపాలికలోని కోటలో పద్మశాలీయ సామాజిక వర్గం కోసం పదేళ్ల కిందట భవనం నిర్మించారు. దీనిన ఏనాడు వినియోగంచలేదు. కొందరు ఆ భవనాన్ని ఆక్రమించారు. రూ.50లక్షలు విలువైన భవనం ఆక్రమణకు గురైనా ఎవరూ పట్టించుకోవడంలేదు.

చెర్లోపల్లికాలనీలో ఓ నాయకుడు తన ఇంటి వద్ద సామాజిక భవనాన్ని ప్రభుత్వ నిధులతో నిర్మించాడు. దీన్ని ఎవరూ వినియోగించకుండా తాళం వేశాడు. భవనం ఆ నాయకుడి ఆధీనంలోనే ఉంది. 20 ఏళ్ల కిందట ఎస్సీల కోసం రూ.50లక్షలతో నిర్మించిన భవనంలో కొన్నేళ్లపాటు వసతిగృహానికి వినియోగించారు. ఇప్పుడు సచివాలయం కొనసాగుతోంది. విశాలంగా ఉన్న భవనం ఎస్సీలకు ఉపయోగపడటం లేదు. బేతాపల్లిలో భవనాన్ని ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి వాడుకుంటున్నాడు. అందులో వ్యవసాయ సామగ్రి, పంట దిగుబడులను నిల్వ చేసుకుంటున్నాడు. వన్నేదొడ్డిలో మరో భవనం నిరుపయోగంగా ఉంది. ఈ భవనం చిన్నదిగా ఉండటంతో శుభకార్యాలు జరుపుకొనేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు.

ఊబిచర్లలో రూ.14 లక్షలు వెచ్చించి ఎస్సీ కార్పొరేషన్ సామాజిక భవనాన్ని నిర్మించింది. దీన్ని దళితులు ఎన్నడూ వినియోగించుకోలేకపోయారు. ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది.

కె.ఊబిచర్లలో అటవీశాఖ అధికారులు నిర్మించిన భవనం అధ్వానంగా ఉంది. కొత్తపేటలోని భవనం కూడా నిరుపయోగంగా ఉంది. అప్పుడప్పుడు అధికారులు సమావేశాలను నిర్వహిస్తున్నారు.

కమిటీలదే బాధ్యత

సామాజిక భవనాలను ప్రజలు కమిటీలుగా ఏర్పడి వినియోగించుకోవాలి. ఏసామాజిక వర్గం కోసం నిర్మించారో వారే కమిటీగా ఏర్పడి భవనాల ఉనికి కాపాడాలి. పంచాయతీలే నిర్వహించాలన్న నిబంధన లేదు. ప్రజలే భవనాలను వినియోగించుకుంటూ వాటి ఆలనా పాలన చూడాల్సి ఉంది.కమిటీలు లేకపోవడంతో భవనాలు చాలాచోట్ల నిరుపయోగంగా ఉన్నాయి.

శివాజీరెడ్డి, ఈవోఆర్డీ, గుత్తి

# అక్రమ లేఅవుట్లు.. అమాయకుల పాట్లు



పెనుకొండ : వైకాపా అయిదేళ్ల పాలనలో అక్రమ లేఅవుట్ల విషయంలో తీసుకున్న చర్యలు శూన్యం. దీంతో అప్పట్లో నాయకులు రెచ్చిపోయారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ అక్రమ లేఅవుట్లతో దోచేశారు. పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో పలు మండలాల పరిధిలో పారిశ్రామిక అభివృద్ధి, జాతీయ రహదారుల నిర్మాణాలు అక్రమార్కులకు కలిసొచ్చే అంశాలుగా మారాయి. దీంతో ఎక్కడ చూసినా పొలాలు తీసుకోవడం ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్ వేయడం ప్లాట్లను అమాయకులకు అంటగట్టడం చేశారు. అదే విషసంస్కృతి ప్రస్తుతం కొనసాగుతుండడంతో కనీసం కూటమి ప్రభుత్వంలో అయినా చర్యలు తీసుకోవాలని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు కేవలం తాఖీదులతో సరిపెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

**అత్యధికంగా రెండు నియోజకవర్గాల్లో..**

పెనుకొండ, హిందూపురం నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో వందల సంఖ్యలో అక్రమ లేఅవుట్లు కనిపిస్తున్నాయి. నిత్యం అధికారులు వాటిని చూసుకుంటూ ఆ మార్గాల్లో వెళుతున్నారు.. కాని చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈప్రాంతం మొత్తంగా కేవలం మూడు నాలుగింటికి మాత్రమే పూర్తిస్థాయిలో అహుడా అనుమతులు ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలినవన్నీ దోచుకోవడానికి వేసినవే. చిలమత్తూరు, గోరంట్ల, పరిగి, లేపాక్షి మండలాల పరిధిలో 200 లేఅవుట్లకుపైనే వెలిశాయి. గోరంట్ల, సోమందేపల్లి మండలాల పరిధిలో వైకాపా హయాంలో నాటి పాలకులే అక్రమార్కుల అవతారం ఎత్తారు. అవన్నీ ఇప్పటికీ అలానే ఉన్నాయి.

**పోలీసుస్టేషన్ చుట్టూ తిరుగుతూ..**

గోరంట్ల మండలంలోని హిందూపురం రహదారిలో మండల కాంప్లెక్సు కూడలికి సమీపంలో అనుమతులు లేని లేఅవుట్లలో స్థలాలను కొనుగోలు చేసిన ఎందరో పడుతున్న అవస్థలు అన్నీఇన్నీకావు. సుమారు నెల రోజులుగా పదుల సంఖ్యలో బాధితులు పోలీసుస్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. గోరంట్లకు చెందిన ఓ వ్యాపారి చిరకాల స్వప్నంగా నిర్మించుకున్న ఇంటిని బయటపడే మార్గం లేక అమ్ముకున్నాడు. అనుమతులు లేని లేఅవుట్‌లో కొనడమే ఆయన చేసిన తప్పు. ఎందరో చేసేది లేక ప్లాట్లను అయినకాడికి అమ్ముకుంటున్నారు. గోరంట్ల మండల పరిధిలో సుమారు 10 పంచాయతీల్లో వందకుపైగా అక్రమ లేఅవుట్లు కనిపిస్తున్నాయి.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం: సమత, జిల్లా పంచాయతీ అధికారి**

జిల్లా వ్యాప్తంగా ఎక్కడా అనుమతులు లేని లేఅవుట్లు ఉన్న పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు తాఖీదులతో సరిపెట్టనచోట అధికారులకు ఆదేశాలు జారీ చేసి తదుపరి చర్యలకు ఉపక్రమిస్తాం.

# చెంతనే స్వర్గం.. చేరాలంటే నరకం



రామకుప్పం : త్రిరాష్ట్ర కూడలిలో నెలవైన జలపాతాలకు కనీస వసతులు కరవయ్యాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు గ్రామాల భారీగా ప్రజలు తరలివస్తారు. కుప్పం నియోజవర్గం రామకుప్పం మండల పరిధి చెలిమిచేను గ్రామ సమీపంలో కొండల మధ్య జాలువారుతున్న చెలిమిచేను, బైరెడ్డిపల్లి మండల పరిధిలోని కైగల్ జలపాతాల అందాలు తిలకించేందుకు పర్యాటకులు పోటీ పడతారు. కనీసం రహదారి సరిగ్గా లేక ఆ ప్రాంతాలకు వెళ్లేందుకు అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి.

**కొండల్లో.. కష్టాలతో**

ఇక్కడి వెళ్లేందుకు ననియాల మీదుగా రామకుప్పం, కుప్పం నుంచి అటవీ ప్రాంతంలో ప్రధాన రహదారి కలదు. రహదారి నుంచి జలపాతం వరకు సుమారు 3 కి.మీల దూరం అటవీ ప్రాంతంలో ప్రయాణం సాగించాలి. కొండల్లో కనీసం కాలిబాట కూడా లేని అటవీ మార్గంలో నడిచి వెళ్లాల్సి ఉంటుంది. ఇన్ని అవస్థలతో వెళ్లి అక్కడి జలపాతం అందాలు చూసి వాటిని ఇట్టే మర్చిపోతున్నారు. రహదారి నుంచి జలపాతం వరకు కనీసం మట్టి రోడ్డునైనా ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు. కౌండిన్యా అభయారణ్యంలో సహజంగా ఏర్పడిన జలపాతం అందాలు వీక్షించేందుకు అవస్థలు తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు.

**120 అడుగుల ఎత్తు నుంచి**

చెలిమిచేను జలపాతం వద్ద 120 అడుగుల ఎత్తు నుంచి నీరు పాలనురగలా జాలువారుతోంది. పర్యాటకులు కొండల మధ్య నుంచి సుమారు వంద అడుగుల లోయలో దిగి ఈ అందాలు వీక్షిస్తున్నారు. అదే విధంగా కైగల్ జలపాతం అందాలు వీక్షించాలంటే కుప్పం-పలమనేరు జాతీయ రహదారి నుంచి సుమారు 5 కిలోమీటర్లు మట్టిరోడ్డుపై ప్రయాణం చేయాలి. సొంత వాహనం తీసుకెళ్తే తప్ప ఇతర వాహనాలు అందుబాటులో ఉండవు. చెలిమిచేను, కైగల్ జలపాత లోయలో దిగేందుకు మెట్ల మార్గం నిర్మించకపోవడంతో కొండలు, గుట్టలు దాటాల్సి వస్తోంది. పెద్దబండరాళ్లు దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

**బస ఏర్పాట్లు చేయాలి**

ఇక్కడ బస చేసేందుకు కనీస వసతులు, గుడారాలు లేవు. రక్షిత మంచినీరు, బోజన సదుపాయం లేక వారంతా ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకుని మౌలిక వసుతులు కల్పించాలని, కనీసం మంచి రవాణా మార్గం నిర్మించాలని కోరుతున్నారు. సీఎం చంద్రబాబు పర్యాటకాన్ని పరిశ్రమలా గుర్తించారు. ఆయనే ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం, పక్కనే పలమనేరులో రెండు మంచి జలపాతాల వద్ద సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలి.

# శంకుస్థాపనకే జంకు!

అనకాపల్లి : సాధారణంగా వేసవి వచ్చిందంటే నిర్మాణ పనులు ఊపందుకుంటాయి. జిల్లా కేంద్రం అనకాపల్లిలో పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటోంది. అలాగని భవనాలు నిర్మించుకోవడానికి ఎవరు ఆసక్తిగా లేరా అంటే... అదీ కాదు. ప్రభుత్వం కొత్తగా అమలులోకి తీసుకొచ్చిన భవన నిర్మాణ నిబంధనల నేపథ్యంలో ప్లాన్లు ఇవ్వడానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లు, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీ) ముందుకు రావడం లేదు. దీంతో గతంలో అనుమతులు తీసుకున్న ఇళ్ల నిర్మాణాలే కొనసాగుతున్నాయి. కొత్తగా ఎవ్వరూ నిర్మాణాలు చేపట్టడానికి ఆసక్తి చూపడం లేదు.

జీవీఎంసీలో ఎవరైనా ఇళ్లు నిర్మించుకోవాలంటే ముందుగా ఎల్‌టీపీలను సంప్రదిస్తుంటారు. వారు ప్లాన్ గీసి దరఖాస్తులను పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. అప్పటి నుంచి ప్లాన్ అనుమతి పొందేవరకు అన్నీ చూసుకుంటారు. అధిక శాతం వీరే ఇంటి నిర్మాణ పనులు చూస్తుంటారు. ఇందుకోసం భారీగానే ఇంటి యజమాని నుంచి డబ్బు తీసుకుంటారు. అనుమతుల ముసుగులో యజమానులను తిప్పలు పెడుతుంటారనే ఆరోపణలున్నాయి. ఇదే సమయంలో ఇళ్లు కూడా నిబంధనల ప్రకారం నిర్మించరు. ప్లాన్ ఒకలా ఉంటే.. నిర్మాణం ఇంకోలా ఉ



ంటోంది.

**పడిపోయిన ఆదాయం**

ఇళ్ల నిర్మాణాలు పెద్దగా లేకపోవడంతో ఆ ప్రభావం ఇతర రంగాలపైనా పడింది. జీవీఎంసీ పరిధిలో 450 మంది వరకు ఎల్‌టీపీలు ఉన్నారు. వీరంతా జీవీఎంసీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్లాన్లు గీస్తుంటారు. పట్టణంలో 100 నుంచి 300 చ.మీ.లలోపు నిర్మాణాలు ఎక్కువగా జరుగుతుంటాయి. వీటి నిర్మాణానికి రూ. 30 లక్షల నుంచి రూ. 60 లక్షలు ఖర్చవుతుంది. దీనిలో 40 శాతం కూలీలకు, 60 శాతం నిర్మాణ సామగ్రికి ఖర్చు చేస్తారు. ఒక్కో ఇంటికి రూ. 40 లక్షలు అనుకున్నా నెలకు రూ. 12 కోట్ల మేర వ్యాపార లావాదేవీలపై ప్రభావం పడుతోంది. సెంటు స్థలంలో ఇల్లు నిర్మించుకుంటే రూ. 15 వేల నుంచి రూ. 20 వేలు, రెండు సెంట్లయితే రూ. 35 వేల నుంచి రూ. 40 వేలు, మూడు సెంట్ల స్థలంలో రూ. 70 వేల నుంచి రూ. 80 వేల వరకు జీవీఎంసీకి ఆదాయం వస్తుంది. ఇంటి ప్లాన్‌లు రాకపోవడంతో ఈ ఆదాయం పడిపోయింది. మరోవైపు నిర్మాణ రంగంపైన ఆధారపడిన శ్రామికులు, వర్తకులు నష్టపోతున్నారు.

పట్టణ ప్రణాళికలో అక్రమాలు నిరోధించి పారదర్శకతకు పెద్దపీట వేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా జీఓ నం. 20 విడుదల చేసింది. అనుమతుల ప్రకారం నిర్మాణం లేకపోతే ఇంటి యజమానితోపాటు ఎల్‌టీపీది సైతం బాధ్యతేనని మార్గదర్శకాల్లో పొందుపరిచింది. ప్లాన్‌తోపాటు ఈ మేరకు ధ్రువపత్రం అందజేయాల్సి ఉంది. దీంతో వారంతా ప్లాన్లు గీయడానికి ముందుకు రావడం లేదు. అనకాపల్లిలో సాధారణంగా నెలకు 45 నుంచి 50 ఇంటి ప్లాన్లకు దరఖాస్తులు వస్తుంటాయి. అటువంటిది గతనెలలో కేవలం నాలుగంటే నాలుగు మాత్రమే దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

# పరిహారం ఇవ్వకుండా పనులు

అనకాపల్లి : కోడూరు రెవెన్యూ పరిధిలో కలెక్టర్ బంగ్లా సమీపాన సర్వే నంబరు 20లో 39.38 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో మహిళా పారిశ్రామికవేత్తలకు ప్లాట్లు మంజూరు చేసి పరిశ్రమలు నెలకొల్పడానికి ఏపీఐఐసీ ముందడుగు వేసింది. ఏళ్ల తరబడి ఈ భూమిలో 32 మందికి పైగా రైతులు జీడి, మామిడి, యూకలిప్టస్ తోటలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రెవెన్యూ అధికారులు గతంలో భూసేకరణ చేపట్టి జాబితాను సిద్ధం చేశారు. సర్వే కొలతల్లో అవకతవకలు రావడంతోపాటు జాబితాలో పేర్లు కొందరివి లేకపోవడంతోపాటు పరిహారం విషయంలో కొందరు రైతులు 2018లో కోర్టును ఆశ్రయించారు. దీంతో సేకరణ పనులకు తాత్కాలిక నాడు బ్రేకులు పడ్డాయి. 2024లో అప్పటి కలెక్టర్ రైతులు, సాగు ఆక్రమణదారులతో మాట్లాడి కోర్టులో కేసును విత్‌డ్రా చేయించి పనుల్లో కదలికలకు శ్రీకారం చుట్టారు. బదిలీల్లో రవి వెళ్లిపోవడంతో ఇటీవల బాధ్యతల చేపట్టిన విజయకృష్ణన్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల రీసర్వే చేపట్టారు. 31.77 ఎకరాల్లో 31 మంది రైతులు సాగులో ఉన్నట్లు గుర్తించి పరిహార జాబితా సిద్ధం చేశారు. ఎకరాకు రూ.20 లక్షలతోపాటు చెట్లకు పరిహారం ఇస్తామని చెప్పారు. పరిశ్రమలు ఏర్పాటుకు ఏపీఐఐసీ అధికారులకు భూమిని ఇటీవల అప్పగించారు. తాజాగా శుక్రవారం ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పరిశ్రమలు ఏర్పాటుకు రెండు పొక్లెయిన్లతో పనులు ప్రారంభించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న లబ్ధిదారులు, రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిహారం ఇవ్వకుండా భూముల్లో ఎలా పనులు చేపడతారని మండిపడుతున్నారు. దీనిపై ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎస్.నరసింహారావును వివరణ కోరగా జాబితా ఆధారంగా రైతులకు త్వరలో పరిహారం చెల్లిస్తామని చెప్పారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం నగదు విడుదలైందన్నారు. వారి ఖాతాల్లో నగదు జమవుతుందన్నారు.

# త్రిపుర మార్గం... ఉపాధికి శ్రీకారం!

నర్సీపట్నం : వెదురు ఆధారిత ఉపాధి కోసం తొలి అడుగు పడింది. ఈశాన్య రాష్ట్రాల్లో ఒకటైన త్రిపురలో బేంబోసాతల్డా రకం వెదురుతో గృహోపకరణాలు తయారు చేసే కుటీర పరిశ్రమలు ఉన్నాయి. అక్కడ అత్యధికులకు ఈ వెదురు జీవనోపాధిగా ఉంది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచన మేరకు వెదురు ఆధారిత ఉపాధి అవకాశాలు ఉమ్మడి విశాఖ జిల్లాలోనూ కల్పించే దిశగా అటవీ శాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బేంబోసాతల్డా రకం విత్తనాలు వంద కేజీలు అవసరమని ప్రతిపాదన చేశారు. తొలి విడతగా 60 కేజీల విత్తనాలు కిలోలు త్రిపుర నుంచి విమానంలో విశాఖపట్నం వచ్చాయి. వీటిని నర్సీపట్నం, పాడేరు, చింతపల్లి నర్సరీల్లో పెంచాలని, ప్రయోగాత్మకంగా వివిధ ప్రాంతాల్లో నాటించాలని నిర్ణయించారు. ఫలితాలు బాగుంటే ఉమ్మడి విశాఖ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో ఈ వనాలు విరివిగా పెంచేలా కార్యాచరణ సిద్ధం చేస్తారు. ఇప్పటికే నర్సరీల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

తేలికగా ఉండే ముల్లా వెదురుతో త్రిపురలో అగర్‌బత్తి తయారు చేస్తుంటారు. రాష్ట్రంలోని అగరుబత్తి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఈ రకం వెదురు వనాలను పెంచాలని యోచిస్తున్నారు. రెండున్నర దశాబ్దాల కిందట నర్సీపట్నం ప్రాంతానికి చెందిన కొంతమంది కార్పెంటర్లను త్రిపుర రాష్ట్రానికి పంపారు. వారంతా వెటదురు ఆధారంగా అక్కడ కుటీర పరిశ్రమలు ఎలా అభివృద్ధి చెందాయో ప్రత్యక్షంగా చూసొచ్చారు. మన దగ్గర లభ్యమయ్యే వెదురుతో 32 రకాల గృహోపకరణ, గృహాలంకరణ వస్తువులు తయారు చేయవచ్చని గుర్తించారు. త్రిపుర నుంచి నిపుణులను రప్పించి నర్సీపట్నం కలప డిపోలో 150 మందికి శిక్షణ ఇప్పించారు. అప్పట్లో కొంతమందికి రూ. 40 లక్షల వరకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించారు. కొద్దిరోజులపాటు కార్పెంటర్లు పలు రకాల వస్తువులు తయారు చేసినప్పటికీ మార్కెటింగ్ సదుపాయం కల్పించకపోవడంతో వదిలేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పట్టణీకరణ, పర్యాటక ప్రదేశాల అభివృద్ధి, నగర వనాల ఏర్పాటు, ఎకో టూరిజం నేపథ్యంలో వెదురు ఆధారిత వస్తువులకు మార్కెటింగ్ అవకాశాలు బాగుంటాయని అధికారులు భావిస్తున్నారు.

చురకలు



## చీరలో నభా వయ్యారాలు.. సో బ్యూటీఫుల్!

ట్రెడిషనల్ లుక్‌లో నభా నటేశ్ మెరిసిపోయింది. సోషల్ మీడియాలో షేర్ చేసిన లేటెస్ట్ ఫొటోషూట్‌లో ఆమె బంగారు రంగు చీర, ఎర్ర మెరూన్ బ్లౌజ్‌తో చక్కగా అలరిస్తోంది. అరుణోదయ కాంతుల్లో సన్నివేశాలుగా కనిపించే ఈ ఫొటోలు ఇప్పుడు అభిమానుల మనసులను గెలుచుకుంటున్నాయి. రెట్రో టచ్‌తో మిళితమైన ఈ లుక్‌తో నభా అందాలను కొత్తగా ఆవిష్కరించింది. ఓ గది మూలలో కూర్చుని పుస్తకం చదివే ఫోటో, మరోక ఫోటోలో బెడ్ పక్కన మెల్లగా తలవంచిన స్టైల్%ా% ఇలా ప్రతి క్షణాన్ని ఒక సంగీత తరంగంలా రూపొందించింది నభా. ఈ ఫొటోలు ఫొటోగ్రాఫీ పరంగానూ, స్టైలింగ్ పరంగానూ కొత్తగా అనిపిస్తున్నాయి. అంతేకాదు, ఈ లుక్‌కి బ్యాగ్‌గ్రౌండ్‌లో ప్లే అయిన ఏఆర్ రెహ్మాన్ సంగీతం కలవలిసి మరింత మాయాజాలంగా చేసింది. నభా నటేశ్ తెలుగులో 'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో హిట్ అందుకున్నా, ఆ తరువాత వరుస విజయాల్ని



అందుకోలేకపోయింది. ఒకింత గ్యాప్ తర్వాత మళ్లీ 'స్వయంభు' సినిమాతో రీ ఎంట్రీ ఇస్తోంది. 'స్వయంభు'లో నిఖిల్ సరసన యాక్షన్ పీరియాడిక్ డ్రామాలో కనిపించనుంది. ఇక 'డార్లింగ్' మూవీకి సంబంధించి ఇప్పటికే గ్లామర్ షాట్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నభా నటేశ్ నటనపై నమ్మకంతో పాటు, తన ఫిజికల్ లుక్స్‌పైన కూడా బాగా ఫోకస్ పెట్టింది. రెగ్యులర్‌గా జిమ్ చేస్తూ తన ఫిట్‌నెస్‌ను మెయింటైన్ చేస్తోంది. అదే సమయంలో ఫోటోషూట్ల ద్వారా సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన ముద్ర వేసుకుంటోంది. తాజాగా వచ్చిన ఈ ట్రెడిషనల్ సిరీస్ కూడా ఆమె ఇమేజ్‌కి కొత్త అర్థం చేకూర్చేలా మారింది. ఈ ఫోటోలపై అభిమానుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ట్రెడిషనల్ లుక్స్‌లోనూ ఎంత అందంగా కనిపించవచ్చో నభా మరోసారి నిరూపించిందంటూ, అభిమానుల నుంచి మెచ్చుకునే కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## కళావతి కసెక్కించే పెర్ఫార్మెన్స్ ఇస్తోందా!

బాలీవుడ్ వెబ్ సిరీస్ 'అక్క'తో కీర్తి సురేష్ ఎంట్రీ ఇస్తోన్న సంగతి తెలిసిందే. తిరుగుబాటు దారుల కుట్రలను తిప్పికొట్టే రివేంజ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతోన్న సిరీస్ ఇది. ఇదే సిరీస్ తో ధర్మరాజ్ శెట్టి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. యశ్ రాజ్ ఫిలింస్ ఈ సిరీస్ ను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుంది. ఇందులో రాధిక ఆప్టే మరో కథానాయికగా నటిస్తుంది. అంటే రాధికతో కీర్తి సురేష్ పోటీ పడి నటించాల్సిన పరిస్థితి ఇది. ప్రస్తుతం సెట్స్ లో ఉన్న సిరీస్ గురించి మరిన్ని విషయాలు లీక్ అయ్యాయి. ఇందులో కీర్తి సురేష్ మాఫి యా లేడీ డాన్ పాత్ర పోషిస్తుంది. కంటెట్ కాస్త బోల్డ్ గాను ఉ oటుందని తొలి నుంచి ప్రచారంలో ఉంది. అలాంటి పెర్ఫార్మెన్స్ విషయంలో రాధికా ఆప్టే ఎక్కడా తగ్గదు. బోల్డ్ సన్నివేశాల ఎలివేషన్ పరంగా తనదైన మార్క్ వేస్తుంది. అలాగని కీర్తి సురేష్ కూడా ఎక్కడా



తగ్గలేదు. తొలుత రాధికతో పోటీ పడగలదా? అన్న సందేహం వ్యక్తమంది. కానీ ఆన్ సెట్స్ లో కీర్తి సురేష్ బోల్డ్ అప్పిరియన్స్ తో ఆకట్టుకుంటుందని నెట్ ఫ్లిక్స్ వర్గాల నుంచి లీకైంది. రొమాంటిక్ సన్నివేశాల్లో కీర్తి ఎక్కడా రాజీ లేకుండా నటిస్తుందిట. తెరపై ఆ సన్నివేశాలు సరికొత్త అనుభూతి పంచుతాయంటున్నారు. రాధికా ఆప్టే బోల్డ్ అప్పిరియన్స్ గురించి అందిరికీ తెలుసు. కానీ కీర్తి సురేష్ మాత్రం సినిమాల కోసమే అంత లిబర్టీ తీసుకోలేదు. అక్క సిరీస్ కోసం మాత్రం ఎక్కడా ఆలోచిం చకుండా నటిస్తుంది. బాలీవుడ్ లో స్ట్రాంగ్ కెరీర్ ని బిల్డ్ చేసుకునే ప్రక్రియలో భాగంగా రాజీ పడటం లేదు. పోటీని ఎదుర్కుని నిలబడాలంటే ఆ మాత్రం అప్పిరి యన్స్ తప్పనిసరిగా భావించి ముందుకెళ్తున్నట్లు కనిపిస్తుంది. మొత్తానికి 'అక్క' సిరీస్ లో సరికొత్త కీర్తిని చూడటం ఖాయమే.




## సెన్సార్ బోర్డ్‌కు ఇవి కనిపించలేదా?



బాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ సక్సెస్ ఫుల్ ఫ్రాంచైజీ హౌస్‌ఫుల్ నుంచి తాజాగా హౌస్‌ఫుల్ 5 వచ్చిన విషయం తెల్సిందే. అక్షయ్ కుమార్ హీరోగా రూపొందిన ఈ సినిమాలో పలువురు బాలీవుడ్ స్టార్స్ నటించారు. ముఖ్యంగా ఈ సినిమాలో రితేష్ దేశ్‌ముఖ్, అభిషేక్ బచ్చన్‌లు నటించడంతో అంచనాలు పెరిగాయి. ఇండియాలో హౌస్‌ఫుల్ ఫ్రాంచైజీకి ఉన్న క్రేజ్ నేపథ్యంలో విడుదలకు ముందు నుంచే ఈ సినిమాపై అంచనాలు పెరుగుతూ వచ్చాయి. అందుకు తగ్గట్లుగా ఈ సినిమా వినోదాత్మకంగా సాగింది. అయితే వినోదం పేరుతో ఈ సినిమాలో అసభ్య కంటెంట్‌ను చూపించారు అంటూ రివ్యూవర్స్‌తో పాటు ప్రేక్షకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సెన్సార్ బోర్డ్ ఈ సినిమాకు యూ/ఎ సర్టిఫికెట్ ఇచ్చిన విషయం తెల్సిందే. సెన్సార్ బోర్డ్ చిన్న చిన్న బూతు పదాలు ఉన్నా కూడా చాలా తీవ్రంగా స్పందిస్తూ ఉండటం మనం ఈ మధ్య కాలంలో చూస్తూ ఉన్నాం. అలాంటిది ఈ సినిమాలో బూతు కంటెంట్ చాలానే ఉంది. పిల్లలు చూడకూడని సీన్స్‌ను సైతం దర్శకుడు సినిమాలో పెట్టాడు. అలాంటప్పుడు ఎలా ఈ సినిమాకు యూ/ఎ సర్టిఫికెట్ ఇచ్చారు అంటూ చాలా మంది తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని అడల్ట్ కంటెంట్ సీన్స్ సెన్సార్ బోర్డ్ వారికి కనిపించలేదా ఏంటి అంటూ తీవ్రంగా విమర్శలు చేస్తున్న వారు ఉన్నారు. ఇలాంటి సినిమాలు పిల్లలు చూడటం ఎంత వరకు కరెక్ట్ అంటున్నారు. ఆడవారి అవయవాలను అసభ్యంగా పోల్చుతూ కామెడీ చేయడంతో పాటు, రకరకాలుగా బూతులు మాట్లాడుతూ, కామెడీ పేరుతో ఒకరిని ఒకరు ఇష్టానుసారంగా కొట్టుకుంటూ చేసిన సీన్స్ విషయంలోనూ విమర్శలు వస్తున్నాయి. అసలు ఇలాంటి సినిమాలను ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అంటూ ఎలా మీరు ప్రచారం చేశారు అంటూ మేకర్స్‌ను కొందరు ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియాలో దాదాపు నెల రోజులుగా ఈ సినిమాపై చేస్తున్న ప్రచారం నేపథ్యంలో అన్ని వర్గాల వారు ఈ సినిమాను చూసేందుకు థియేటర్ల వద్ద క్యూ కట్టారు. తీరా చూస్తే పిల్లలు ఈ సినిమాను చూసే విధంగా కొన్ని సీన్స్ లేవు అంటూ పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న డైలాగ్స్ ఉన్నా కూడా సెన్సార్ బోర్డ్ వారు వాటిని తొలగించాలని ఆర్డర్ వేస్తారు. కానీ ఈ సినిమా విషయంలో సెన్సార్ బోర్డ్ ఎందుకు చూసి చూడనట్లు వదిలేసింది అంటూ నెటిజన్స్ సైతం ప్రశ్నిస్తున్నారు. సెన్సార్ బోర్డ్ మెంబర్స్ వారు ఏమైనా హౌస్‌ఫుల్ సినిమాకు అనుకూలంగా వ్యవహరించి ఉంటారా లేదంటే సెన్సార్ వారికి కూడా అందుకుండా మేకర్స్ బూతులను ఈ సినిమాలో చూపించే ప్రయత్నం చేశారా అనే చర్చ జరుగుతోంది. మొత్తానికి కామెడీ పేరుతో ఇలాంటి చెత్తను ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడం ఎంత వరకు కరెక్ట్ అంటూ చాలా మంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో హౌస్‌ఫుల్ 5 బూతుల గురించి ప్రముఖంగా చర్చ జరుగుతోంది.

## జాన్వీకపూర్ తో రామ్ చరణ్ లిప్ లాక్!



గురువులను బట్టే శిష్యులు తయారవుతారు. అందుకే ఎప్పటికైనా శిష్యుడు గురువునే మించిపోతాడంటారు. సుకుమార్–బుచ్చిబాబుల గురు శిష్యులను చూస్తుంటే ఇది నిజమయ్యేలా ఉ oది. రొమాంటిక్ సన్నివేశాల విషయంలో సుకుమార్ ఎలివేషన్ ఎలా ఉంటుందన్నది చెప్పాల్సిన పనిలేదు. ఆ విషయంలో సుకుమార్ ఎక్కడా రాజీ పడడు.

'100 పర్సంట్ లవ్' లో తమన్నాని ఎంత అందంగా చూపించాడో? ఇప్పటికీ ఆ సన్నివేశాలు కళ్ల ముందు ఆడుతూనే ఉంటాయి. అటుపై 'ఆర్య 2'లో బన్నీ–కాజల్ అగర్వాల్ మధ్య పెదవి ముద్దుల యుద్ధం తెలిసిందే. రీసెంట్ గా 'పుష్ప' లో బన్నీ –రష్మికా మందన్నా మధ్య రొమాంటిక్ సన్నివేశాల గురించై తే చెప్పాల్సిన పనిలేదు. ఫీలింగ్స్ పాటే గానీ...ఫీలింగ్స్ వస్తున్నాయి సామీ అనే డైలాగ్ గానీ..కిడ్నాపింగ్ కారులో కిరికిరి సీన్ గానీ అన్నీ సుకుమార్ క్రియేటివిటీ నుంచి జాలువారినవే. అలాంటి గురువు వద్ద శిష్యరికం చేసిన బుచ్చిబాబు తన ట్యాలెంట్ ఏంటి? అన్నది తొలి సినిమా 'ఉప్పెన'తోనే చూపించాడు. సము ద్రం మధ్యలో జలజల పాటలో హీరో–హీరోయిన్ రొమాన్స్ పీక్స్ లో ఉంటుంది. అంతకు ముందు పరిచయ సన్నివేశాలు అంతే హైలైట్ అవుతాయి. అలా బుచ్చిబాబు కూడా తాను రొమాంటిక్ మేకర్ అని నిరూపించుకున్నాడు. అలాంటి బుచ్చిబాబు 'పెద్ది' విషయంలో కూడా ఆ ఛాన్స్ తీసుకున్నాడా? అంటే అవుననే తెలుస్తోంది. రామ్ చరణ్ –జాన్వీ కపూర్ జంటగా ఈ చిత్రాన్నితెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులోనూ ఘాటైన సన్నివేశాలకు ఏమాత్రం కొదవలేదుట. రామ్ చరణ్–జాన్వీ మధ్య కొన్ని ఇంటిమేట్ సీన్స్ ఉన్నాయంటున్నారు.

అలాగే ఓ స్ట్రాంగ్ లిపికిస్ కూడా సీన్ డిమాండ్ చేయడంతో తొలి షెడ్యూల్ లోనే చిత్రీకరించినట్లు తెలిసింది. ఇంత వరకూ ఈ విషయం బయటకు రాలేదు. జాన్వీ కి కూడా టాలీవుడ్ హీరోతో లిప్ కిస్ అనుభవం ఇదే తొలిసారి. దేవరలో ఎన్టీఆర్ తో నటించింది. కానీ కొరటాల శివ రొమాంటిక్ డైరెక్టర్ కాకపోవడంతో ఆ ఛాన్స్ లేకుండా పోయింది. ఇప్పుడా ఆ లెక్కలన్నీ పెద్దితో బుచ్చిబాబు సరి చేస్తున్నాడు.

## శాలినీ పాండే గ్లామర్ ఎటాక్.. ఈ లుక్ మాములుగా లేదు

టాలీవుడ్‌కు 'అర్జున్ రెడ్డి' సినిమాతో పరిచయమైన శాలినీ పాండే, మొదటి సినిమాతోనే యువతను ఆకట్టుకుంది. క్లాస్ అండ్ క్యూట్ గ్లామర్ తో అద్భుతంగా నటించిన ఆమె ఆ తర్వాత కొన్ని హిందీ సినిమాల్లో కూడా నటించింది. అయితే ఇటీవల గ్లామరస్ అవతారంలో షిఫ్ట్ అవుతూ, హీటెక్కించే ఫోటోషూట్లతో సోషల్ మీడియాలో దూసుకెళ్తోంది. తాజా ఫొటోషూట్‌లో శాలినీ వేసుకున్న వైట్ అవుట్‌ఫిట్ నెటిజన్లను షాక్‌కు గురిచేస్తోంది. తాజా ఫొటోలలో శాలినీ తెల్లటి తడిచిన డ్రెస్‌లో కెమెరాకు పోజులిస్తూ అదిరిపోయే లుక్‌ను ప్రదర్శించింది. వర్షంలో తడుస్తున్నట్టుగా, చెయ్యి జుట్టులో పెట్టుకొని, వశీకరణమైన చూపులతో దిగిన ఫోటోలు చూసిన వారంతా షాక్ అవుతున్నారు. ఇది నెమ్మదిగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక సినిమాల విషయానికి వస్తే, శాలినీ పాండే బాలీవుడ్



లో 'జయేశ్‌భాయ్ జోర్దార్' సినిమాలో రణవీర్ సింగ్ సరసన నటిం చింది. అయితే ఆ సినిమా ఆశించిన స్థాయిలో సక్సెస్ కాకపోయినా, శాలినీ నటన ప్రశంసలు అందుకుంది. అందులోనూ ఆమె లుక్స్ కాస్త గ్లామర్ టచ్‌తో మారిపోవడం కూడా ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ప్రస్తుతం ఆమె హిందీలో ఓ స్పోర్ట్స్ డ్రామాలో నటిస్తోంది. ఆ ప్రాజెక్ట్‌కి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది. తన కెరీర్‌ను గ్లామర్‌తో స్టబ్లిష్ చేసుకోవాలని భావిస్తున్న శాలినీ, సినిమాలతో పాటు బ్రాండింగ్ ఫ్యాషన్ ఫొటోషూట్లపై కూడా ఫోకస్ పెడుతోంది. 'నేచురల్ బ్యూటీ'గా పేరొందిన శాలినీ.. ఇప్పుడు స్టయిలిష్ అవతారాలతో కూడా అభిమానుల్ని మాయ చేస్తోంది. ఆమె తాజా ఫోటోలకు 2 గంటలలోపే లక్షల్లో లైక్స్ రావడం సోషల్ మీడియాలో ఆమె క్రేజ్ ఏ స్థాయిలో ఉ oదో చెప్పకనే చెబుతోంది. మొత్తానికి శాలినీ పాండే తన కెరీర్‌కు గ్లామర్‌తో కొత్త మలుపు తిరిపిస్తూ, రాబోయే రోజుల్లో తనకో ప్రత్యేక స్థానం సంపాదించుకునే ప్రయత్నంలో ఉంది. ఈ ఫోటోషూట్ చూసిన తర్వాత మాత్రం.. ఆమెకు మరిన్ని భారీ ఆఫర్లు వచ్చే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. మరి ఈ గ్లామర్ గాలివాన ఎంత వరకు ఆమెకు అవకాశాలను తెస్తుందో చూడాలి.

## మళ్లీ మాజీల నుంచి శ్రుతిహాసన్ కి సందేశాలా!

శ్రుతిహాసన్ ఇప్పుడు సింగిల్. బోయ్ ఫ్రెండ్స్ కి దూరంగా ఉంటూ సోలో లైఫ్ ని లీడ్ చేస్తోంది. తొలుత మైఖేల్ కోర్సేలోతో సహజీవనం..అటుపై శంతను హజారికాతో బాండింగ్ వ్యవహారం తెలిసిందే. ఆ రెండు బ్రేకప్ ల నుంచి చాలా అనుభవాలు నేర్చుకుంది. అలాగని ప్రేమకు పెళ్లికి పూర్తిగా దూరం ఉంటుందని కాదు. మళ్లీ తప్పకుండా లవ్ లో పడతానని హింట్ ఇవ్వనే ఇచ్చింది. మరి ఇప్పుడా ఇద్దరు మళ్లీ మెసెజ్ లతో టచ్ లోకి వస్తున్నారా? అంటే అవుననే తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే డాడ్ కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్‌లో శ్రుతి హాసన్ గాయనిగా పాటలు పాడిన సంగతి తెలి సిందే. ఈనాడు సినిమా తర్వాత థగ్ లైఫ్ సినిమాలో శ్రుతి హాసన్ పాట పాడటం ఇదే. విన్ వెలి నాయకా అంటూ అమ్మడు ఆలపిం చింది. ప్రీరిలీజ్ ఈవెంట్ లో లైవ్ పెర్ఫార్మెన్స్ కూడా ఇచ్చింది. అప్పటి



నుంచి శ్రుతిహాసన్ ఫోన్ ఇన్ బాక్స్...వాట్సాప్ మెసెజ్ లతో నిండిపోయిందిట. ఇప్పటికీ మెసెజ్ లు వస్తూనే ఉన్నాయంది. తన పనితనాన్ని మెచ్చుకుంటూ వస్తోన్న సందేశాలు తనకెంతో సంతోషాన్ని అంది స్తున్నాయంది.

తనని ఇష్టపడే వాళ్లతో పాటు ఇష్టపడని వాళ్ల నుంచి కూడా మెసేజ్ లు వస్తున్నాయంది. దీంతో ఆ మెసెజ్ లు పంపిన వారిలో మాజీ ప్రేమికులు ఉన్నారంటూ సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఓ నెటి జనుడు నేరుగా శ్రుతి హాసన్ ని ఈ విషయం అడిగేసాడు. కానీ శ్రుతి హాసన్ నుంచి మాత్రం ఎలాంటి రిప్లై రాలేదు. మౌనం అర్ధాంగీకారం అంటారు. మరి నిజామా? కాదా? అన్నది శ్రుతి ధృవీకరించాలి. ప్రస్తు తం శ్రుతి హాసన్ కూలీలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో అమ్మడు ఓ కీలక పాత్ర పోషిస్తుంది. ఇంకా కొన్ని సినిమాలు ఆన్ సెట్స్ లో ఉన్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536